మంగళవారం 7-3-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 345



SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సేవాపథం



● స్టూడెంట్స్‌కు అండగా: రాధిక భరత్ రామ్

కర్మ్ ఫలం... ఎంతో ఉన్నతం!

దయాగుణం అనేది బ్యాంకులో భద్రంగా దాచుకునే డబ్బు కాదు. అది కష్టం ఉన్న చోట కనిపించాలి. ధైర్యం ఇవ్వాలి. ముందుకు నడిపించాలి. 'కర్మ్' ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది అమ్మాయిలు ఉన్నత చదువులు చదువుకోవడానికి సహకారం అందిస్తోంది 48 సంవత్సరాల రాధిక భరత్ రామ్...

ఢిల్లీలోని ప్రసిద్ధి చెందిన 'ది శ్రీ రామ్ స్కూల్స్' వైస్-చైర్‌పర్సన్ హోదాలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ సామాజిక సేవా కార్యక్రమాలకు ఎప్పుడూ దూరంగా లేదు రాధిక.

మనదేశంలో ఎంతోమంది అమ్మాయిలు రకరకాల కారణాలతో హైస్కూల్ స్థాయిలోనే చదువు ఆపేయడానికి సంబంధించి రాధికకు బాధగా ఉండేది. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'కర్మ్' ఫౌండేషన్ ఫెలోషిప్‌లకు శ్రీకారం చుట్టింది. ఫెలోషిప్‌కు ఎంపికైన వారికి మూడు సంవత్సరాల పాటు అకాడమిక్, ఎగ్జామ్ ఫీజులు కట్టడం, వసతి సౌకర్యం ఏర్పాటు చేయడం, లోకల్ ట్రావెల్ అలవెన్స్‌లు ఇవ్వడం, లాప్‌టాప్, పుస్తకాలు కొనివ్వడం... మొదలైనవి ట్రస్ట్ ద్వారా జరుగుతాయి. దీంతోపాటు కెరీర్ కౌన్సెలింగ్, సెల్ఫ్-ఇంప్రూవ్‌మెంట్ వర్క్ షాప్... మొదలైన వాటిని విస్తృతంగా నిర్వహిస్తోంది కర్మ్ ఫౌండేషన్.

'కర్మ్ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక అవసరాలు తీరడమే కాదు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మనం ఏర్పర్చుకునే లక్ష్యాల విషయంలో స్పష్టత వస్తుంది. వాటిని ముందుకు తీసుకువెళ్లడానికి నిర్మాణాత్మకమైన సలహాలు లభిస్తాయి' అంటుంది సచిత అనే విద్యార్థిని.

విద్యారంగానికి సంబంధించి దాతలు ఎక్కువగా ఉన్నప్పటికీ, ఉన్నత విద్య విషయంలో మాత్రం తక్కువగా ఉన్నారు. ఆ లోటును 'కర్మ్' పూరిస్తోంది.

'అమ్మాయికి హైస్కూల్ చదువు సరిపోతుంది' అనుకునే తల్లిదండ్రుల ఆలోచన విధానంలో మార్పు తీసుకువస్తోంది కర్మ్.

'దాతృత్వం అంటే సహాయపడడం మాత్రమే కాదు మన టైమ్‌ను కూడా వెచ్చించాలి. వారితో మాట్లాడాలి. వారికి ఎప్పుడూ అందుబాటులో ఉండాలి' అంటున్న రాధిక ఫెలోషిప్‌కు ఎంపికైన స్టూడెంట్స్‌ను పేర్లతో సహా గుర్తుపెట్టుకొని ఆత్మీయంగా పలకరిస్తుంది.

ఇంటిప్

పొట్ట మీద చారలా?

డెలివరీ తర్వాత చాలామందికి పొట్ట మీద చర్మం ముడతలు పడి చారలు వస్తాయి. ఈ చారల సమస్య కొందరిలో చాలా తీవ్రంగా ఉంటుంది. వీటిని కొన్ని చిట్కాలతో పరిష్కరించుకోవచ్చు. అవేమిటంటే..

● స్నానం చేయడానికి ముందు కాస్త ఆముదాన్ని గోరువెచ్చగా చేసుకుని చారలు ఉన్న చోట సున్నితంగా మర్దన చేయాలి. గంట సేపటి తర్వాత స్నానం చేయాలి. ఇలా ప్రతిరోజు చేస్తూ ఉంటే నెల తిరిగేసరికి మంచి ఫలితం కనిపిస్తుంది.

లేదంటే... ప్రతిరోజు రాత్రి నిద్రపోయే ముందు బాదం నూనెతో చారలపై మర్దన చేసుకోవాలి. మరునాడు ఉదయాన్నే వేడి నీటితో స్నానం చేసి, చారలపై కలబంద గుజ్జు రాసుకోవాలి. ప్రతి రోజూ ఇలా చేస్తే నాలుగైదు వారాల్లోనే మంచి ఫలితం ఉంటుందని పెద్దలు చెబుతున్నారు.

బ్యూటిప్స్

ఆరోగ్యానికే కాదు... అందానికి కూడా!



- ఉల్లిపాయలోని యాంటీసెప్టిక్ గుణాలు చర్మ సమస్యలకు చెక్ పెడతాయి. మచ్చలను తొలగిస్తాయి.
- టేబుల్ స్పూన్ ఉల్లి రసంలో టేబుల్ స్పూన్ ఆలివ్ ఆయిల్ కలిపి ఫేస్‌ప్యాక్ లా వేయాలి. ఆరిన తర్వాత గోరు వెచ్చటి నీటితో కడిగేయాలి. మీ ముఖంలో నిగారింపు మీకే తెలుస్తుంది.
- టీ స్పూన్ పసుపులో సరిపడా ఉల్లిపాయ రసాన్ని కలిపి పేస్ట్‌లా చేయాలి. దీనిని ముఖానికి ప్యాక్ లా వేసుకోవాలి. ఆరిన తర్వాత చల్లటి నీటితో కడిగేయాలి. ఇన్‌స్టంట్‌గా చర్మం మెరిసిపోతుంది.
- శనగపిండి, ఉల్లిరసం, పాలు .. మూడూ సమపాళ్లలో తీసుకొని పేస్ట్‌లా ముఖానికి రాసుకుని.. కాసేపటి తర్వాత కడిగితే మొహం చంద్రబింబమే.



- అతినీల లోహిత కిరణాల వల్ల చర్మం దెబ్బతినే ప్రమాదాన్ని ఉల్లి తగ్గిస్తుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు యూవీ కిరణాల వల్ల కలిగే హానిని అడ్డుకుంటాయి.
- చివరగా ఒక మాట.., ఉల్లిపాయను తరిగేటప్పుడు కళ్లు మంటపుట్టి, నీళ్లు కారతాయి. అయితే అది కూడా మంచిదే. అలా నీరు కారడం వల్ల కళ్లలోని మలినాలు తొలగిపోతాయి, అంతేకాదు, కంటి సమస్యలను నివారించడంలో ఉల్లికి సాటి మరేదీ లేదు. నేత్ర సమస్యలకు చెక్ పెట్టాలంటే మీ డైట్‌లో ఉల్లి ఉండేలా చూసుకోవాల్సిందే.

రేపు విమెన్స్ డే





మేమే మా ధైర్యం!

ముంబై జుహూ గ్రౌండ్స్‌లో విమెన్స్ డే సందర్భంగా 1500 మంది ఆడపిల్లలు కరాటేలో తమ విన్యాసాలను ప్రదర్శించనున్నారు. వీళ్లంతా ఎవరో చదవండి...

'మన దేశంలో 11 నుంచి 14 ఏళ్ల లోపు ఆడపిల్లలు రెండున్నర కోట్ల మంది ఉన్నారు. వీరు స్కూల్లో సైన్సు నేర్చుకున్నట్టు లెక్కలు నేర్చుకున్నట్టు ఆత్మరక్షణ ఎందుకు నేర్చుకోరు? ఎందుకు నేర్పించరు?' అని అడుగుతుంది ఇషితా శర్మ.

ముంబైలో డాన్స్ స్కూల్‌ను నడిపే ఇషితా శర్మ ఐదేళ్ల క్రితం ఒకరోజు రాత్రి కారులో వెళుతుంటే కొంతమంది పోకిరి కుర్రాళ్లు ఆమెను ఫాలో అయ్యారు. ముందామెకు ఏం చేయాలో తోచలేదు. భయపడింది. కాని చివరకు ధైర్యం కూడగట్టుకుని అద్దం దించి పెద్దగా అరిచింది. అంతే. వాళ్లు పారిపోయారు. 'ఇంత వయసు వచ్చిన నేనే ఇలా భయపడ్డాను. చిన్నపిల్లలు ఎంత భయపడిపోతారో అనే ఆలోచన నాకు వచ్చింది' అంటుందామె. ఈ ఆలోచన నుంచే 'ముక్కా మార్' ఆవిర్భవించింది.

11 నుంచి 14 ఏళ్ల లోపు ఆడపిల్లలకు కరాటే, కుంగ్ ఫూ వంటి ఆత్మరక్షణ విద్యలు నేర్పాలని అనుకుంది ఇషిత. తనకు తెలిసిన ఒక కరాటే మాస్టర్‌ని సహాయం అడిగింది. అతను అంగీకరించాడు. ముంబైలోని వెర్సోవా బీచ్‌లో ఐదుమంది ఆడపిల్లలతో 2018లో 'ముక్కా మార్' (దెబ్బ కొట్టు) కార్యక్రమం మొదలైంది.

అయిదు పది, పది వంద అవడానికి ఎంతో సమయం పట్టలేదు.



దేహం, గళం, బుద్ధి

'ఆడపిల్లలు మగవాళ్ల కంటే బలహీనులు అనే భావనతోనే పెంచుతారు. అబ్బాయిలను మగాడిలా పోరాడు అంటారు. మేము- ఆడపిల్లను ఆడపిల్లలా పోరాడు అని చెబుతాం. ఆడపిల్ల ఎందులోనూ తక్కువ కాదు అని చెబుతాం. మన పెంపకంలో ఆడపిల్లకు ఏ అన్యాయం జరిగినా ఊరికే ఉండు, సహించు అనే బోధిస్తారు. మేము ఎదిరించు, నీ గళం వినిపించు, బుద్ధిని ఉపయోగించు అని చెబుతాం. ముఖ్యంగా హింసను ఎదిరించాలంటే ఈ మూడు తప్పవు' అంటుంది ఇషిత.

'ముక్కా మార్ శిక్షణలో చేరాక ఏదైనా ప్రమాదం వస్తే పెద్దగా అరిచి ప్రతిఘటించాలని, తర్వాత బుద్ధిని ఉపయోగించి అక్కడి నుంచి బయటపడాలని ఆ రెండూ సాధ్యం కాకపోతే శారీరకంగా తలపడి పోరాడాలని మాకు తెలిసొచ్చింది' అని ఒక అమ్మాయి అంది.

1100 స్కూళ్లలో

'ముక్కా మార్' శిక్షణ అవసరం మహారాష్ట్ర ప్రభుత్వం కూడా గుర్తించింది. ఎం.సి.జి.ఎం (మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ గ్రేటర్ ముంబై) పరిధిలోని 1100 పైగా స్కూళ్లలో 'ముక్కా మార్' కార్యకర్తలను వారానికి రెండు రోజులు ఆత్మరక్షణ విద్యలు నేర్పేందుకు ప్రోత్సహించింది. 6,7,8 తరగతులు విద్యార్థినులకు స్కూళ్లలో వారానికి రెండు రోజులు కరాటే, కుంగ్ ఫు, కుస్తీ క్లాసులు నేర్పిస్తున్నారు. లాక్‌డౌన్ సమయంలో ఆన్‌లైన్ ద్వారా అంటే వాట్సప్ చాట్‌బోట్ ద్వారా క్లాసులు కొనసాగాయి. ఈ క్లాసులు దేశంలోని ఏ ప్రాంతం ఆడపిల్లలైనా నేర్చుకోవచ్చు. ఇప్పటికి 'ముక్కా మార్' ద్వారా 5 వేల మంది ఆడపిల్లలు నేరుగా ఆత్మరక్షణ విద్యలు నేర్చుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా 16 వేల మంది అమ్మాయిలు నేర్చుకున్నారు. దాదాపు 300 మంది మహిళా టీచర్లకు శిక్షణ ఇవ్వడం వల్ల ఆ టీచర్ల ద్వారా 50 వేల మంది ఆడపిల్లల వరకూ నేర్చుకుంటున్నారు.

మన సమాజంలో రోజురోజుకూ ఆడపిల్లల మీద హింస, లైంగిక దాడులు పెరిగిపోతున్నాయి. అయితే వాటికి భయపడి ఆడపిల్లను ఇంట దాచడం అంటే వారి భవిష్యత్తును నాశనం చేయడమేనని అంటుంది ఇషితా శర్మ. 'వారు ధైర్యంగా సమాజంలో తిరగాలి. ప్రమాదం ఎదురైతే ఎదిరించేలా ఉండాలి. ఆత్మరక్షణ విద్యలు నేర్పడం ద్వారా మాత్రమే వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి భయం పోతుంది' అంటుందామె.

నిజంగానే ప్రతి స్కూల్లో మేథ్స్ టీచర్, సైన్స్ టీచర్ ఉన్నట్టుగా ఆడపిల్లల కోసం ఒక కరాటే టీచర్ ఉండాలని ఈ విమెన్స్ డే సందర్భంగా ప్రభుత్వాలు ఆలోచిస్తే తప్పకుండా మేలు జరుగుతుంది.

రైతమ్మలకు జేజేలు!

సాగుబడి

పూర్వాభాద్ర కార్తె: మార్చి 5 నుంచి

రసాయనిక అవశేషాల్లేని ఆహారమే ఆరోగ్యానికి, పర్యావరణానికి మూలమని గుర్తించి అమృతాహారాన్ని పండిస్తున్న ఇద్దరు రైతమ్మల విశేష కృషి గురించి ముచ్చటించుకుందాం. గుంటూరు నగరంలో తమ ఇంటిపైనే సేంద్రియ కూరగాయలు పండించుకుంటూ పనిలో పనిగా మరో 650 మందికి సాయం చేస్తున్న అర్బన్ ఫార్మర్ ఒకరైతే.. చిత్తూరు జిల్లాలోని తమ సొంతూళ్లో ప్రజలకు, స్కూల్లో మధ్యాహ్న భోజనానికి ఏడాది పొడవునా అమృతాహారాన్ని పండించి ఇస్తున్న విద్యాధిక మహిళా కౌలు రైతు మరొకరు. ఇద్దరూ ఇద్దరే! 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా ఈ చల్లని తల్లులకు మనసారా వందనాలు చెబుదాం...



ఆరోగ్యం మన మిద్దె తోటలోనే ఉంది

- గుంటూరులో విస్తరిస్తున్న మిద్దె తోటల సంస్కృతి
- కృష్ణకుమారి నేతృత్వంలో మిద్దెతోట పెంపకందారుల సంఘం రిజిస్ట్రేషన్
- వాట్సాప్ గ్రూప్‌లు, యూట్యూబ్ ఛానల్ ద్వారా సేవలు
- అధిక దిగుబడినిచ్చే అంటు మొక్కలు చౌకగానే అందుబాటులోకి...

ఆరోగ్యం ఆసుపత్రిలో లేదు. మన మిద్దె తోటలోనే ఉంది. మన తినే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను రసాయనాల్లేకుండా మనమే ఇంటిపైన పండించుకుందాం. నలుగురం చేయీ చేయీ కలిపి మిద్దె తోటలు సాగు చేసుకుంటూ ఆరోగ్యంగా జీవిద్దాం.. అని చెప్పటమే కాదు.. మనసా వాచా కర్మణా ఆచరిస్తున్నారు కొల్లి కృష్ణకుమారి. గుంటూరు ఎన్‌జీవో కాలనీకి చెందిన బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగిని అయిన ఆమె 2020 జనవరి నుంచి 1400 చ.అ.ల మిద్దె తోట సాగు చేస్తున్నారు. ఉల్లి, వెల్లుల్లి, క్యారెట్ తప్ప మిగతావన్నీ దాదాపు రోజూ తమ ఇంటిపైన పండించుకున్నవే తింటున్నారు. కేన్సర్‌ను జయించిన ఆమె ఉద్యోగవిరమణ తర్వాత ఉద్యమ స్ఫూర్తితో సేంద్రియ మిద్దెతోటలను విస్తరింపజేస్తున్నారు.

సంఘ బలం.. ఉత్సాహం..

రిటైరైన ఉద్యోగులు, పెద్దవాళ్లు (సెకండ్ యూత్) కూరగాయలు, పండ్ల మొక్కలను పెంచడం హాబీగా మార్చుకుంటున్నారు. సేంద్రియ ఇంటిపంటలు/ మిద్దె తోటల సంస్కృతిని వ్యాప్తిలోకి తెచ్చే లక్ష్యంతో సంఘాలు కూడా ఏర్పాటవుతున్నాయి. మిద్దెతోటల నిపుణులు తుమ్మేటి రఘోత్తమరెడ్డి ఆధ్వర్యంలో గుంటూరు సహా రెండు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల్లోనూ మిద్దెతోటల పెంపకందారుల సంఘాలు ఏర్పాటయ్యాయి. 'గుంటూరు మిద్దెతోటలు' పేరుతో ఏర్పాటు చేసిన రెండు వాట్సప్ గ్రూప్‌లలో 659 మందికి పైగా ఉన్నారు. 2021 నుంచి గుంటూరులో మిద్దె తోటల కార్యకలాపాలను కృష్ణకుమారి నేతృత్వంలో వలంటీర్ల బృందం అత్యంత క్రియాశీలంగా నిర్వహిస్తుండటం విశేషం. ఉద్యానవన శాఖ అధికారుల సహకారంతో ప్రతి నెలా అవగాహన కల్పిస్తున్నారు. గుంటూరు మిద్దె తోటలు పేరిట యూట్యూబ్ ఛానల్‌ను ఏర్పాటు చేశారు.

'గుంటూరు మిద్దె తోటల పెంపకందారుల సంక్షేమ సంఘం (జి.ఎం.ఎస్.ఎస్.)' లాభాపేక్షలేని సంస్థగా రిజిస్టర్ అయ్యింది. కృష్ణకుమారి ఆమె అధ్యక్షురాలిగా, మరికొందరు ఉత్సాహవంతులైన విశ్రాంత బ్యాంకు అధికారులు, వైద్యులతో కూడిన కార్యవర్గం ఏర్పాటైంది. సంఘ వార్షిక సభ్యత్వ రుసుము రూ. 500. నెలవారీగా సమావేశమవుతూ వారికి కావాల్సిన మొక్కలను కడియం, కుప్పం నర్సరీల నుంచి తెప్పించి సభ్యులకు అందిస్తున్నారు. సంఘం జమాఖర్చులపై ఆడిటింగ్ నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తుండటం ప్రశంసనీయం.



● సంఘ సభ్యుల గుర్తింపు కార్డు

ఉత్సాహంగా వాలంటీర్ల సేవలు



● మిద్దె తోటలో కృష్ణకుమారి



సాధారణ మొక్కలతో పోల్చితే ఎన్నో రెట్లు ఎక్కువ దిగుబడినిచ్చే గ్రాఫ్టెడ్ మొక్కల అవసరం మేడపైన కుండీలు, మడుల్లో తక్కువ స్థలాల్లో కూరగాయలు పెంచుకునే వారికి ఎంతో ఉందంటారు కృష్ణకుమారి. అడవి వంగతో అంటుకట్టిన(గ్రాఫ్ట్ చేసిన) వంగ, టమాటో, మిరప, సొర మొక్కలతో పాటు పర్పుల్ క్యాబేజి, ఎర్రబెండ, ఎల్లో/పర్పుల్ కాలిఫ్లవర్ వంటి అరుదైన, నాణ్యమైన మొక్కలను నర్సరీల నుంచి తెప్పించి మిద్దెతోట పెంపకందారులకు మూడింట ఒక వంతు ధరకే అందిస్తున్నారు. కృష్ణకుమారి, వలంటీర్ల బృందం సఫలీకృతమయ్యారు. గూగుల్ ఫామ్స్, ఎక్సెల్ షీట్ ద్వారా సభ్యులకు కావాల్సిన మొక్కల ఆర్డర్ తీసుకొని మొక్కలను తెప్పిస్తున్నారు. సభ్యులందరికీ ముద్రిత ఫొటో గుర్తింపు కార్డులు ఇచ్చారు. 50 మంది వాలంటీర్లు ఉత్సాహంగా సేవలందిస్తుండటం వల్ల సంఘాన్ని చురుగ్గా నిర్వహించ గలుగుతూ ఉన్నామని కృష్ణకుమారి చెప్పారు. గత రెండేళ్లలో మిరప రైతులు పురుగుమందులను చాలా ఎక్కువగా వాడాల్సి వస్తోందని అంటూ.. రైతులను తప్పుపట్టలేమని, వినియోగదారులుగా మన జాగ్రత్తలో మనం ఉండాలని, వీలైనన్ని కూరగాయలను మనమే పండించుకోవాలని కృష్ణకుమారి(94906 02366) అంటున్నారు.

– దాళా రమేష్‌బాబు, సాక్షి ప్రతినిధి, గుంటూరు

ఫొటోలు: గజ్జల రామగోపాలరెడ్డి



ఊరంతా బాగుండాలి.. అందులో నేనుండాలి!

- ఎమ్మే బీఈడీ చదివినా ప్రకృతి వ్యవసాయంపై మక్కువ
- ఎకరం కౌలు పొలంలో 20 రకాలకుపైగా కూరగాయల సాగు
- గ్రామస్తులకు, స్కూలు పిల్లల మధ్యాహ్న భోజనానికి కూరగాయలు సరఫరా
- తిరుపతి జిల్లా ఎస్‌బీఆర్ పురం వాసి కోనేటి శైలజ ఆదర్శ సేద్యం

ఎమ్మే బీఈడీ చదివినా ఉద్యోగం కోసం ఎదురు చూడలేదు. తన కుటుంబంతో పాటు... గ్రామంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయాన్ని ఎంచుకున్నారు. ఎకరం భూమిని లీజుకు తీసుకొని అందులో 20 రకాలకుపైగా కూరగాయలు, ఆకుకూరలు సాగుచేస్తున్నారు. పండించిన పంటను మార్కెట్‌లో విక్రయించకుండా... తన ఊర్లో వారికి, అంగన్‌వాడీ, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు కోనేటి శైలజ.



● ప్రతి రోజూ ఆదాయమే

శైలజ స్వస్థలం తిరుపతి జిల్లా వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురం గ్రామం. పుట్టినిల్లు.. మెట్టినిల్లు కూడా అదే ఊరు. అందరూ వ్యవసాయంపై ఆధారపడ్డవారే. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఎంఏ, ప్రైవేటు కాలేజ్‌లో బీఈడీ పూర్తి చేశారు. వ్యవసాయదారుడు మాధవ వర్మను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. సొంత భూమిలో మామిడి తోట సాగులో ఉంది. ఏపీ రైతు సాధికార సంస్థ ప్రోత్సాహంతో శైలజ ప్రకృతి సేద్యంలో కూరగాయల సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. గ్రామంలోనే ఎకరం భూమిని లీజుకు తీసుకున్నారు. గత ఏడాది నవంబర్‌లో 20 రకాల కూరగాయల సాగు ప్రారంభించారు. ఇప్పటి వరకు పెట్టిన ఖర్చు రూ.13,500 చేశారు. శైలజ తోటలో కిలో పచ్చిమిర్చి రూ. 60, క్యారెట్, బీట్రూట్ రూ. 50, టొమాటో, వంగ, బెండ, గోరుచిక్కుడు, కాకర, అలసంద రూ. 40, ముల్లంగి (కట్ట) రూ.15, గోంగూర(కట్ట) రూ. 10 చొప్పున అమ్ముతున్నారు. మొన్నటి వరకు రూ.17,500 ఆదాయం వచ్చింది. ఏడాది పొడవునా రోజూ కూరగాయలను ప్రజలకు అందించాలన్నదే తన లక్ష్యమని శైలజ వివరించారు.

మధ్యాహ్న భోజనంలో ఇవే కూరలు

శైలజ పండించే కూరగాయలను గ్రామస్తులకే విక్రయిస్తున్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ, ప్రాథమిక, జిల్లా పరిషత్ హైస్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేస్తున్నారు. ఘనజీవామృతం, ఆవు పేడ, పంచితం, మజ్జిగతో కషాయాలను తయారు చేసి పంటలకు ఉపయోగిస్తుండటాన్ని గ్రామస్తులు ఆసక్తిగా చూస్తుంటారు. ప్రకృతి సాగు ఉత్పత్తుల విని యోగం వల్ల కలిగే ప్రయోజనాలను రైతు సాధికర సంస్థ సిబ్బంది, శైలజ, ఆమె భర్త మాధవ వర్మ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది కూరగాయలు కొంటున్నారు. అంగన్‌వాడీ పిల్లలు, స్కూల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వడ్డించే కూరగాయలు కూడా శైలజ పండిస్తున్నవే. 'శైలజ పండించిన కూరగాయలను ధర కాస్త ఎక్కువైనా కొని వాడుతున్నా. పిల్లలు కూరలు రుచిగా ఉన్నాయని చెబుతుంటే సంతోషంగా ఉంద'ంటున్నారు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలు పూర్ణ.



● కూరగాయల తోటలో శైలజ

గ్రామస్తులు, స్కూలు పిల్లల కోసమే!

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో నేను పండించే కూరగాయలు తిని మా ఊరివాళ్లంతా ఆరోగ్యంగా ఉంటే అంతే చాలు. ప్రస్తుతం నేను పండించే కూరగాయలు మా ఊరి వాళ్లకే సరిపోతున్నాయి. గ్రామస్తులు, స్కూలు పిల్లల తరువాతే ఎవరికైనా. ఏడాది పొడవునా కూరగాయలు పండించి ఇవ్వాలన్నదే నా తపన.

– కోనేటి శైలజ, (9912197746), ఎస్‌బీఆర్ పురం, వడమాలపేట మం., తిరుపతి జిల్లా

కొనమెరువు: గ్రామానికి చెందిన వెంకట్రామరాజు శైలజ పండించే కూరగాయలను కొనుగోలు చేసి చెన్నైలో ఉంటున్న తన కుమారుడు డాక్టర్ రామకృష్ణంరాజుకు వారానికి ఒక రోజు పంపుతుండటం మరో విశేషం.

– తిరుమల రవిరెడ్డి, సాక్షి ప్రతినిధి, తిరుపతి.

ఫొటోలు: కేతారి మోహన్‌కృష్ణ

12న వైరాలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

ఖమ్మం జిల్లా వైరాలోని శ్రీసత్యసాయి వేద పాఠశాలలో ఈ నెల 12 (ఆదివారం)న ఉ. 10 గం, నుంచి రైతులకు గోఆధారిత ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన ప్రకృతి సేద్య నిపుణులు టి. నాగరాజు శిక్షణ ఇస్తారు. వివరాలకు.. 94410 34 138.

18న ఔషధ, సుగంధ మొక్కల సాగుపై బోడుప్పల్ 'సీమాప్'లో రైతు సదస్సు



కేంద్ర ప్రభుత్వ సంస్థ కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల పరిశోధనా కేంద్రం (సీమాప్) ఆధ్వర్యంలో మార్చి 18 (శనివారం) ఉ. 10 గం.-సా. 5 గం. వరకు సికింద్రాబాద్ సమీపంలోని బోడుప్పల్‌లో సంస్థ కార్యాలయ ఆవరణలో రైతు సదస్సు జరగనుంది. అధిక దిగుబడినిచ్చే ఔషధ, సుగంధ మొక్కల సాగు పద్ధతులు, మొక్కలు, విత్తనాలు, సుగంధ నూనెలను వెలికితీసే డిస్టిలేషన్ యంత్రాల ప్రదర్శనతో పాటు మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పిస్తారు. శాస్త్రవేత్తలతో ముఖాముఖి చర్చించి సందేహాలు నివత్తి చేసుకోవచ్చు.

సుగంధ తైలాలకు దేశవిదేశాల్లో గిరాకీ

నిమ్మగడ్డి, కాశగడ్డి వంటి అనేక సుగంధ పంటల నుంచి తీసిన తైలాలకు దేశవిదేశాల్లో ఎంతో గిరాకీ ఉంది. ఈ రెండు పంటల మొక్కలు/విత్తనాలను రైతుకు అర ఎకరం వరకు ఉచితంగా ఇవ్వటంతోపాటు పంట కొనుగోలు దారులతో అనుసంధానం చేస్తామని సీమాప్ ఇన్‌చార్జ్ శాస్త్రవేత్త జి.డి. కృష్ణబాబు 'సాక్షి సాగుబడి'కి తెలిపారు. అశ్వగంధ, నేల తంగేడు వంటి ఔషధ మొక్కలకు సైతం మార్కెటింగ్ సమస్య లేదన్నారు. నీరు నిల్వ/నీడ ఉండని ఏపీ/తెలంగాణలోని అన్ని నేలల్లో ఈ పంటలను ఆరుతడి/డ్రిప్ పద్ధతిలో సాగు చేయవచ్చన్నారు. ఔషధ, సుగంధ పంటలపై ఆసక్తి గల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు పొరుగు రాష్ట్రాల రైతులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ కిసాన్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. ప్రవేశం ఉచితం. మధ్యాహ్న భోజన సదుపాయం ఉంది. అయితే, పాల్గొనదలచిన వారు తప్పనిసరిగా ఈ నెల 15లోగా పేరు నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. నమోదు పత్రంపై మీ వివరాలు, ఫొటో జతపరచి, సంతకం చేసి కింది మెయిల్‌కు పంపాలి.

crchyd@cimap.res.in

www.cimap.res.in 040-29201131

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 345
మంగళవారం 7-3-2023
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'


లాభాల హోలీ
60 వేల స్థాయి పైకి సెన్సెక్స్.. 17,700 ఎగువకు నిఫ్టీ - 13లో


ముంబై సూపర్ షో
మహిళల ప్రీమియర్ లీగ్‌లో 9 వికెట్ల తేడాతో బెంగళూరుపై గెలుపు - 12లో


తిహార్ జైలుకు సిసోడియా
ఢిల్లీ మద్యం విధానంలో అవకతవకల కేసులో ఆప్ నేత సిసోడియా కస్టడీని సీబీఐ కోర్టు మరో 14 రోజులు పొడిగించింది.
వివరాలు 6లో ▸


యడియూరప్పకు తప్పిన ముప్పు
బీజేపీ నేత యడియూరప్ప హెలికాప్టర్ ల్యాండింగ్‌కు సమస్య ఎదురైంది. చెత్త ఎగరడంతో కొంతసేపు గాలిలోనే చక్కర్లు కొట్టింది.
వివరాలు 6లో ▸


నాన్న లైంగికంగా వేధించాడు
తండ్రే తనను లైంగికంగా వేధించాడని.. 15 ఏళ్లప్పుడు ఆయన్ని ఎదిరించానని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ చెప్పారు.
వివరాలు 6లో ▸


బాలికల విద్యపై విషం
ఇరాన్‌లో బాలికలను చదువుకు దూరం చేసేందుకు విష ప్రయోగాలకు పాల్పడుతున్నారు. 700 మంది వీటి బారినపడ్డారు.
వివరాలు 6లో ▸

ఫ్యామిలీ డాక్టర్లు రెడీ

ఈనెల 15 తరువాత పూర్తిస్థాయిలో ప్రారంభం

- రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే ట్రయల్ రన్ సక్సెస్.. 1,142 పీహెచ్‌సీల్లో పూర్తి స్థాయిలో వైద్యుల భర్తీ
- సెలవుపై వెళ్లినా సేవలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు.. రాష్ట్రవ్యాప్తంగా రిజర్వ్‌లో 175 మంది డాక్టర్లు
- ప్రతి జిల్లాకు బ్యాకప్ 104 ఎంఎంయూ.. 108 అంబులెన్స్‌లు కొత్తగా మరో 146
- ఆరోగ్యశ్రీ సేవల్లో ఫిర్యాదులకు వీలుగా కార్డులపై నెంబర్
- రక్తహీనత బాధితులకు వైఎస్సార్ పోషణ ప్లస్ ద్వారా పౌష్టికాహారం
- వైఎస్సార్ కంటి వెలుగు మూడో విడతలో మిగిలిన వారికి వైద్య పరీక్షలను ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఆరోగ్యశ్రీ రిఫరల్ సేవలను ఫ్యామిలీ డాక్టర్ విధుల్లో చేర్చాలని ఆదేశం
- వైద్య ఆరోగ్యశాఖలో నాడు– నేడు సహా వివిధ కార్యక్రమాలపై సీఎం ఉన్నత స్థాయి సమీక్ష





సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య ఆరోగ్య రంగంలో మరో కీలక ఘట్టానికి సన్నాహాలు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఈ నెల 15వ తేదీ తరువాత పూర్తి స్థాయిలో అమలులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్ అమలు, వైద్య ఆరోగ్య శాఖలో నాడు – నేడు సహా వివిధ కార్యక్రమాల పురోగతిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలించారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలతో మేలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి కుటుంబం ఆరోగ్యం పట్ల కూడా అంతే శ్రద్ధ తీసుకుంటూ ఫ్యామిలీ డాక్టర్ విధానానికి రూపకల్పన చేసింది. గతేడాది అక్టోబర్ 21 నుంచి ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ 45,90,086 మందికి వైద్య సేవలు అందించినట్లు సమీక్షలో అధికారులు తెలిపారు.

రిఫరల్ సేవలను భాగం చేయండి

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రిఫరల్ సేవలను ఫ్యామిలీ డాక్టర్ విధుల్లో భాగంగా చేయాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. ఆరోగ్యశ్రీ సేవల్లో ఎలాంటి ఇబ్బంది, సమస్యలు ఎదురైనా

మిగతా 2వ పేజీలో ▶

‘స్కిల్’ కుంభకోణంపై సీఐడీ దూకుడు

దర్యాప్తు వేగవంతం.. శ్రీకాంత్ అర్జాకు నోటీసు
సీమెన్స్ కంపెనీకి 10శాతం వాటాగా రూ.371 కోట్లు చెల్లింపు
ఆ నిధులే హవాలా మార్గంలో టీడీపీ పెద్దల ఖాతాల్లోకి..



సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎస్‌ఎస్‌డీసీ)లో కుంభకోణంపై సీఐడీ దర్యాప్తు వేగవంతం చేసింది. సీమెన్స్ కంపెనీతో ప్రాజెక్టు పేరిట ప్రజాధనాన్ని కొల్లగొట్టిన కేసులో అప్పట్లో ఏపీ ఎస్‌ఎస్‌డీసీ ఎండీగా వ్యవహరించిన శ్రీకాంత్ అర్జాకు సీఐడీ సోమవారం నోటీసులు జారీ చేసింది. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీతో రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్ పేరిట టీడీపీ ప్రభుత్వ పెద్దలు నిధులు కొల్లగొట్టిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు కేటాయిస్తే సీమెన్స్ కంపెనీ 90శాతం నిధులు వెచ్చించి రాష్ట్రంలో యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తారని ఒప్పందం చేసుకున్నారు. కానీ సీమెన్స్ కంపెనీ ఒక్క రూపాయి కూడా వెచ్చించకుండానే రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.371 కోట్లు చెల్లించేశారు. వాటిలో రూ.245 కోట్లను డిజైన్ టెక్, స్కిల్లర్ అనే షెల్ కంపెనీల ద్వారా సింగపూర్‌కు మళ్లించి, వాటిని మళ్లీ టీడీపీ పెద్దల ఖాతాల్లోకి బదిలీ చేశారు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వంలో ఐటీశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశే ఏపీ ఎస్‌ఎస్‌డీసీ వ్యవహారాలు చూడటం గమనార్హం. ఈ కేసులో సీఐడీ అధికారులు డిజైన్ టెక్, షెల్ కంపెనీలకు చెందిన పలువురిని అరెస్ట్ చేశారు. చంద్రబాబు సన్నిహితుడు, అప్పట్లో ఏపీ ఎస్‌ఎస్‌డీసీ డైరెక్టర్‌గా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ, ఎండీగా ఉన్న గంటా సుబ్బారావుతో పాటు పలువురిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో సీఐడీ అధికారులు ఇప్పటి వరకూ ఎనిమిది మందిని అరెస్టు కూడా చేశారు. అప్పట్లో ఏపీ ఎస్‌ఎస్‌డీసీ ఎండీగా ఉన్న శ్రీకాంత్ అర్జాకు సీఐడీ సోమవారం నోటీసు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సీమెన్స్ కంపెనీ తన వాటా 90 శాతం నిధులు సమకూర్చకుండానే నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ వాటా నిధులను అప్పట్లో ఎండీగా ఉన్న గంటా సుబ్బారావు విడుదల చేశారు. ఆ నిధులే హవాలా మార్గంలో టీడీపీ పెద్దలకు చేరాయి. ఆ తర్వాత

మిగతా 2వ పేజీలో ▶

ఏది నిజం?

మీ తప్పు ఒప్పుకునేదెప్పుడు బాబూ?

- పోలవరం వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు, రామోజీ 4లో
- విభజన చట్ట ప్రకారం పోలవరాన్ని నూరుశాతం తామే పూర్తి చేస్తామన్న కేంద్రం
- పీపీఏతో ఒప్పందం చేసుకుంటే పనులు ప్రారంభిస్తామని నాడు టీడీపీ సర్కార్‌కు సూచన
- కానీ, ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలు తమకే ఇవ్వాలని కేంద్రంపై చంద్రబాబు ఒత్తిడి
- దీనికోసం ప్రత్యేక హోదాపైనా రాజీ... 2016లో నిర్మాణ బాధ్యత రాష్ట్రానికి అప్పగించిన కేంద్ర ప్రభుత్వం
- కానీ 2013–14 నాటి ధరల ప్రకారమే నిధులు ఇస్తామని షరతు... సరేనన్న బాబు
- ఏ ప్రాజెక్టుకైనా మూడేళ్లకోసారి రివిజన్ తప్పనిసరి... బాబు మాత్రం దానిపైనా రాజీ
- అసలు 2013 నాటి ధరలతో ఇప్పుడు ప్రాజెక్టు పూర్తి చేయటం సాధ్యమా?
- బాబు తప్పులను సరిదిద్దుతూ ముందుకెళుతున్న జగన్

తెలియదు.. గుర్తు లేదు.. మర్చిపోయా

- సీఐడీ విచారణకు ఏమాత్రం సహకరించని టీడీపీ మాజీ మంత్రి నారాయణ
- ఆయన భార్య, ‘నారాయణ’ కీలక ఉద్యోగిని ప్రమీల తీరు కూడా అంతే
- హైదరాబాద్‌లో విచారించిన అధికారులు
- 20న సీఐడీ ముందు హాజరుకండి
- నారాయణ అల్లుడు, ఆయన సోదరుడికి హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: గత ప్రభుత్వం హయాంలో జరిగిన అమరావతి భూముల కుంభకోణం కేసులో టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పొంగూరు నారాయణ సీఐడీ విచారణకు ఏమాత్రం సహకరించలేదని తెలిసింది. అసైన్డ్ భూములు, బినామీ పేర్లతో భూములు కొనుగోలు, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ రూపొందించడంలో అక్రమాలపై సీఐడీ అధికారులు ఎంత గుచ్చి గుచ్చి అడిగినా నారాయణ ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం ఇవ్వలేదని సమాచారం. తెలియదు.. గుర్తు లేదు.. మర్చిపోయా అనే రీతిలో నారాయణ వ్యవహరించారని తెలిసింది. ఈ మేరకు సీఐడీ అధికారులు

మిగతా 2వ పేజీలో ▶


ఎమ్మెల్యే కోటాలో 7 ఎమ్మెల్సీ స్థానాలకు
నామినేషన్లు షురూ



- నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ ఈ నెల 13
- 16వ తేదీ వరకు ఉపసంహరణ గడువు
- 23న ఎన్నికలు.. నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి 2లో

నికర జలాల్లో మిగులు తేల్చాకే
కావేరికి గోదావరి

నదుల అనుసంధానం టాస్క్‌ఫోర్స్ చైర్మన్‌కు తేల్చి చెప్పిన రాష్ట్రం



- రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలగ కూడదని స్పష్టీకరణ
- నిధులిస్తే పోలవరం పూర్తి చేసి గోదావరి, కృష్ణా అనుసంధానం పూర్తి చేస్తామని ప్రతిపాదన
- సానుకూలంగా స్పందించిన టాస్క్‌ఫోర్స్ చైర్మన్
- గోదావరి జలాల తరలింపుపై సీఎం జగన్ ప్రతిపాదనను పరిశీలించాలని ఏపీ విజ్ఞప్తి
- దీనివల్ల అతి తక్కువ ఖర్చుతో గరిష్ట ప్రయోజనాలు ఉంటాయని వెల్లడి
- ఏకాభిప్రాయంతోనే గోదావరి–కావేరి అనుసంధానం చేపడతామని శ్రీరామ్ స్పష్టీకరణ 14లో

9 నుంచి నిరసనలు,
ధర్నాలు

ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు 14లో

ఏపీ జేఏసీ నిరసనలకు
వీఆర్‌వోలు దూరం

ఏపీ జేఏసీ అమరావతి నిర్వహించే ఆందోళనలు, నిరసనలకు వీఆర్‌వోలు దూరంగా ఉంటారని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు ప్రకటించారు. కొన్ని ఉద్యోగ సంఘాలు సొంత ప్రయోజనాలకు ఉద్యోగులను వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు.

- వివరాలు 14లో



పెట్టుబడుల కోసం
సీఎం జగన్‌ది మంచి ప్రయత్నం

బీజేపీ నేతలు జీవీఎల్, విష్ణుకుమార్ రాజు

రాష్ట్రంలో పెట్టుబడుల కోసం సీఎం జగన్ మంచి ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కుదుర్చుకున్న ఒప్పందాలు వాస్తవరూపం దాల్చితే ఏపీకి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

- వివరాలు 14లో

ఎమ్మెల్యే కోటాలో 7 ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లు షురూ

సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసన మండలిలో ఖాళీ అవుతున్న ఎమ్మెల్యే కోటాలోని ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సోమవారం ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ ఆఫీసర్‌గా రాష్ట్ర శాసన మండలి సంయుక్త కార్యదర్శి పి.వి.సుబ్బారెడ్డి, సహాయ రిటర్నింగ్ అధికారిగా ఆర్.వనితారాణిని నియమించారు. ఎన్నికల ప్రక్రియ ఈ నెల 25లోగా పూర్తి చేయనున్నారు. సోమవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలు కాగా, తొలి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఈ నెల 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ సెలవు దినాలు మినహా మిగతా పనిదినాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 14న ఉదయం 11 గంటలకు అసెంబ్లీ భవనంలో నామినేషన్ల పరిశీలన, 16న మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. ఈ నెల 23న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ అసెంబ్లీ భవనంలో పోలింగ్, సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

ఫస్ట్ సోలార్ సంస్థలో పాలిటెక్నిక్ విద్యార్థినులకు ఉపాధి

- సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి
- సాంకేతిక విద్యాశాఖతో ప్రత్యేక అవగాహన

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు అంతర్జాతీయ సంస్థ ఫస్ట్ సోలార్‌లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ సంచాలకురాలు చదలవాడ నాగరాణి తెలిపారు. సాంకేతిక విద్యా శాఖ ప్రధాన కార్యాలయం నుంచి హైబ్రీడ్ విధానంలో సంస్థ ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని 76 ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల నుంచి 362 మంది అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, 1,050 మంది విద్యార్థినులు ఆన్‌లైన్ విధానంలో పాల్గొన్నారు. నాగరాణి మాట్లాడుతూ ప్రముఖ అమెరికన్ సంస్థ ఫస్ట్ సోలార్ వెంచర్స్ సోలార్ ప్యానెళ్ల తయారీలో అగ్రగామిగా ఉందన్నారు. చెన్నై సమీపంలోని పెరంబదూర్‌లో ప్రారంభించనున్న నూతన శాఖలో 600 మంది మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ బ్రాంచ్‌ల చివరి సంవత్సరం విద్యార్థినులను దశల వారీగా క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపిక చేస్తారన్నారు. ఎంపిక ప్రక్రియ నెట్టూర్ టెక్నికల్ ట్రైనింగ్ ద్వారా జరుగుతుందని చెప్పారు. ఫస్ట్ సోలార్ సంస్థ మానవవనరుల విభాగ అధిపతి దయానా సీక్వేరియా మాట్లాడుతూ కంపెనీ ప్రొఫైల్, కెరీర్ మార్గం, ఎంపిక ప్రక్రియ, నిబంధనలను వివరించారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ వి.పద్మారావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ, ఎస్‌బీటీఈటీ సెక్రటరీ కె.విజయ భాస్కర్, ఫస్ట్ సోలార్‌కు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలు మే లోపు పూర్తి చేయాలి

సాక్షి, అమరావతి: డిగ్రీ కళాశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియ మే నెల లోపు పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డిని కోరినట్లు జీసీటీఏ అధ్యక్షుడు రాఘవరెడ్డి తెలిపారు. జూన్ ఫస్ట్ నుంచి తరగతులు ప్రారంభించాలని, అధ్యాపకులకు ఒకసారి ఇంటర్ జోనల్ బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ సంఘం గవర్నమెంట్ కాలేజ్ గెజిటెడ్ టీచర్ల సంఘం జేఏసీ నాయకులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

కృత్రిమ మేధస్సుదే భవిత

- ఏపీఐఎస్–ఐఐటీటీఎన్ఐఎఫ్ మధ్య ఎంవోయూ
- ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ వెల్లడి

ఏర్పేడు(తిరుపతి జిల్లా): భవిష్యత్ అంతా కృత్రిమ మేధస్సుదేనని, దానిని ఆధారంగా చేసుకుని కొత్త ఆవిష్కరణలు చేపడుతున్నట్లు తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో తాను పాల్గొని కీలక ఉపన్యాసం ఇచ్చానని పేర్కొన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ(ఏపీఐఎస్), ఐఐటీ తిరుపతి నవవిష్కార్ ఐ హబ్ ఫౌండేషన్ (ఐఐటీటీఎన్ఐఎఫ్) మధ్య ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ఏపీఐఎస్ సీఈవో అనిల్‌కుమార్ టెంటు, ఐఐటీటీఎన్ఐఎఫ్ ప్రాజెక్టు డైరెక్టర్ రోషన్ శ్రీ వాత్సవ ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారని వివరించారు. ఈ ఒప్పందంలో భాగంగా పొజిషనింగ్ అండ్ ప్రెసిషన్ టెక్నాలజీ ఆధారిత స్టార్టప్ కంపెనీలకు సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ రెండు సంస్థలు కలిసి హ్యాక్‌థాన్స్, కోహర్ట్, గ్రాండ్ చాలెంజెస్ స్టార్టప్ ఈవెంట్స్‌ను నిర్వహిస్తాయని కేఎన్ సత్యనారాయణ పేర్కొన్నారు.

మాచ్‌ఖండ్‌లో మళ్లీ నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

- వాల్వ్ హౌస్‌లోకి చొచ్చుకెళ్లిన దుంగలు


ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్ర ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో సోమవారం విద్యుత్ ఉత్పత్తి మళ్లీ నిలిచిపోయింది. విద్యుత్ కేంద్రంలో వాల్వ్ హౌస్ వద్ద గల 3వ నంబర్ బట్టర్ ప్లే వాల్వ్ వద్ద సాంకేతిక లోపం తలెత్తింది. నాలుగు రోజుల కిందట టీపీ డ్యామ్ వద్ద జాలీ గేటు పడిపోయిన ఘటనలో కొన్ని భారీవృక్షాల దుంగలు సొరంగ మార్గం గుండా సర్జ్‌షాఫ్ట్ మీదుగా వాల్వ్ హౌస్‌లోకి చేరడంతో సాంకేతిక లోపం తలెత్తి ఉంటుందని భావించిన అధికారులు ఏపీ జెన్‌కో ఉన్నతాధికారులకు సమాచారం అందజేసి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేతకు అనుమతులు తీసుకున్నారు. మొదట డుడుమ నుంచి విద్యుత్ కేంద్రానికి వచ్చే నీటి విడుదలను నిలుపుదల చేశారు. అనంతరం విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసి వాల్వ్ హౌస్‌లో 3వ నంబర్ బట్టర్ ప్లే వాల్వ్ వద్ద కొన్ని చెట్లకు చెందిన వ్యర్థాలను గుర్తించారు. మిగిలిన వాల్వ్ హౌస్ వద్ద కూడా చెట్ల కొమ్మలు, దుంగలు ఉంటాయనే ఉద్దేశంతో వాల్వ్‌ల వద్ద, విద్యుత్ కేంద్రంలోను పూర్తిగా తనిఖీలు చేపట్టారు. రాత్రి సమయంలోనూ ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రంకల్లా అన్ని మరమ్మతులు పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరిస్తామని విద్యుత్ కేంద్రం ఎస్ఈ కేవీ నాగేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడం వల్ల ప్రతి గంటకూ 57 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి నష్టం కలుగుతోందన్నారు.

'స్కిల్'కుంభకోణంపై సీఐడీ దూకుడు

▶ మొదటి పేజీ తరువాయి

శ్రీకాంత్ అర్జా ఎండీగా వచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం ఈ వ్యవహారంలో గోల్‌మాల్ జరిగిందని నిర్ధారించిన తర్వాత కూడా ఏపీ ఎస్ఎస్‌డీసీ ఎండీగా ఉన్న శ్రీకాంత్ అర్జా సందేహాస్పదంగా వ్యవహరించడం గమనార్హం. సీమెన్స్ ప్రాజెక్టు విషయంలో అంతా సవ్యంగా జరిగిందని ఆయన నివేదిక ఇవ్వడం విస్మయ పరిచింది. ఐఆర్‌టీఎస్ అధికారి అయిన శ్రీకాంత్ అర్జా డెప్యుటేషన్‌పై రాష్ట్రంలో పని చేశారు. తర్వాత కేంద్ర సర్వీసులకు వెళ్లిపోయిన ఆయన ప్రస్తుతం రిటైర్ అయి ఢిల్లీలో ఉంటున్నారు. ఆయన్ని ఈ నెల 9న విచారణకు రావాలని సీఐడీ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు.

వచ్చేస్తోంది.. డిజిటల్ వర్సిటీ



జాతీయ స్థాయిలో ఏర్పాటుకు యూజీసీ శ్రీకారం

- దేశంలోని అనేక యూనివర్సిటీల అనుసంధానంతో సేవలు
- విద్యార్థులకు అందుబాటులోకి బోలెడన్ని ఆన్‌లైన్ కోర్సులు
- ఇకపై యూనివర్సిటీల్లో సీట్లు లేవనే మాటే ఉండదు
- 2023-24 విద్యా సంవత్సరం నుంచే అందుబాటులోకి వచ్చే అవకాశం

సాక్షి, అమరావతి: దేశంలో తొలిసారిగా జాతీయ స్థాయిలో డిజిటల్ యూనివర్సిటీ (ఎన్‌డీయూ) అందుబాటులోకి రాబోతోంది. 2023–24 విద్యాసంవత్సరం నుంచే దీని సేవలు ప్రారంభించేలా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) సన్నాహాలు చేస్తోంది. విద్యార్థులు కోరుకున్న కోర్సులను ఆన్‌లైన్ ద్వారా అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నూతన జాతీయ విద్యావిధానం ప్రకారం ప్రపంచస్థాయి ఉన్నత విద్యను అందరికీ అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఆదేశాలతో యూజీసీ ఈ యూనివర్సిటీకి శ్రీకారం చుడుతోంది. విద్యార్థుల వ్యక్తిగత ఆసక్తులను అనుసరించి వారి ఇంటివద్దే నచ్చిన కోర్సులను డిజిటల్ విశ్వవిద్యాలయం అందించనుంది. ఉన్నత విద్యాశాఖ, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) సహా దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ యూనివర్సిటీలు, ఇతర ఉన్నత విద్యాసంస్థలను ఇందులో భాగస్వామ్యం చేసి ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు వివిధ కోర్సులను అందుబాటులోకి తీసుకురానుంది. విద్యను అందించడం, పరీక్షలు నిర్వహించడం, సర్టిఫికెట్ల ప్రదానం వంటివన్నీ కేంద్రీకృత వ్యవస్థగా డిజిటల్ వర్సిటీ వ్యవహరిస్తుంది. ప్రస్తుతం వివిధ విద్యాసంస్థల ద్వారా అమలవుతున్న విధానాలకు భిన్నమైన రీతిలో ఈ యూనివర్సిటీ సేవలందించనుంది.

హబ్–స్పోక్ మోడల్‌లో సేవలు

స్పోక్ అండ్ హబ్ అంటే ఒక కేంద్రీకృత పంపిణీ వ్యవస్థలా డిజిటల్ వర్సిటీ పనిచేస్తుంది. సైకిల్ చక్రానికి హబ్ మాదిరిగా యూనివర్సిటీ ఉంటుంది. ఊచలు (స్పోక్) కేంద్ర ప్రదేశంలో కలుస్తూ తిరిగి అన్ని వైపులకు తమ సేవలను పంపిణీ చేసేలా వివిధ విద్యాసంస్థల భాగస్వామ్యంతో ఇది పని చేయనుంది. ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలతో పాటు ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే విద్యాసంస్థలన్నీ ఈ డిజిటల్ వర్సిటీ పరిధిలో తమ కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తేనున్నాయి. విద్యార్థులు తమ సంస్థలలో చదువుతూనే డిజిటల్ వర్సిటీ ద్వారా ఇతర సంస్థల కోర్సులను అభ్యసించడానికి వీలు కల్పిస్తుంది. వారు ఆ సంస్థల ద్వారా క్రెడిట్లను అందుకోగలుగుతారు. సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీలను ఈ క్రెడిట్ల ఆధారంగా వారు అందుకోగలుగుతారు.

50% క్రెడిట్లు సాధిస్తేనే అర్హత

విద్యార్థులు ఏ కోర్సులో అయినా 50 శాతం క్రెడిట్లు సాధిస్తేనే డిగ్రీలకు అర్హులవుతారు. ఈ క్రెడిట్లను ఒకేసారి కాకున్నా తమకు నచ్చిన సమయాల్లో సాధించినా డిగ్రీని ప్రదానం చేస్తారు. అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ ద్వారా విద్యార్థులు తమ క్రెడిట్లను బదలాయించుకోవడానికి కూడా అవకాశం ఉంటుంది. ల్యాబ్‌లు, ప్రాక్టికల్ వర్కులతో సంబంధం లేని కోర్సులు మాత్రమే ప్రస్తుతం డిజిటల్ వర్సిటీ ద్వారా అందిస్తారు. ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఢిల్లీ, బనారస్ హిందూ విశ్వవిద్యాలయం ఇప్పటికే డిజిటల్ యూనివర్సిటీ ద్వారా కోర్సులు అందించేందుకు రంగం సిద్ధం చేశాయి.

సీట్లు లేవనే సమస్య ఉండదు

విద్యార్థి తాను కోరుకొనే వర్సిటీలో అభ్యసించాలనుకునే కోర్సులో చేరే వెసులుబాటును డిజిటల్ వర్సిటీ కల్పించనుంది. సీట్లు లేకపోవడం లేదా ప్రవేశ పరీక్షలో అర్హత సాధించకపోవడం వంటి వాటితో సంబంధం లేకుండా విద్యార్థులు ఆసక్తి ఉన్న కోర్సును అభ్యసించడానికి వీలవుతుంది. ప్రస్తుతానికి సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీలతో ప్రారంభమయ్యే ఈ వర్సిటీ సేవలు రానున్న కాలంలో పీజీ డిగ్రీలు, డాక్టరేట్లను కూడా అందించేలా యూజీసీ సన్నాహాలు చేస్తోంది. ఈ డిజిటల్ వర్సిటీ ద్వారా ప్రస్తుత వర్సిటీల్లో అదనపు సీట్ల ఏర్పాటు, అందుకు తగ్గ సిబ్బంది నియామకం, మౌలిక వసతుల కల్పన వంటి భారాలు తగ్గుతాయి.

ఫ్యామిలీ డాక్టర్లు రెడీ



ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

ఫిర్యాదు చేసేందుకు వీలుగా కార్డులపై నెంబర్ ఉంచాలని సూచించారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నప్పటికీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్యం అందించేందుకు డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని కార్డులపై ముద్రించాలన్నారు. రక్తహీనత బాధితుల వివరాలను వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్‌కు అనుసంధానించి పౌష్టికాహారం అందించాలని అధికారులకు సూచించారు. అంతేకాకుండా పౌష్టికాహారం అందిస్తున్నారా? లేదా? అన్నది పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

పీహెచ్‌సీల్లో పూర్తి స్థాయిలో వైద్యుల నియామకం

ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పూర్తి స్థాయిలో అమలులోకి తెచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా 1,142 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) పూర్తి స్థాయిలో వైద్యుల నియామకాలను భర్తీ చేసినట్లు అధికారులు తెలిపారు. దీర్ఘకాలిక సెలవుల సమయంలో సేవలకు అంతరాయం కలగకుండా వైద్యుల అదనపు నియామకాలు చేపట్టామని వివరించారు. ప్రతి జిల్లాకు నలుగురు అదనపు వైద్యులను సిద్ధంగా ఉంచామన్నారు. ఇక డాక్టర్ల స్వల్పకాలిక సెలవుల సందర్భాల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడకుండా ప్రతి 6–7 పీహెచ్‌సీలకు ఒక వైద్యుడిని అదనంగా నియమించామన్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 175 మందిని రిజర్వ్‌లో ఉంచినట్లు వెల్లడించారు.

మరిన్ని ఔషధాలు.. టెస్టింగ్ కిట్లు.. రిజర్వు వాహనాలు

రాష్ట్రంలో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లకుగానూ ప్రతి చోటా ఒక కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో), ముగ్గురు నుంచి నలుగురు ఆశా కార్యకర్తలు ఉంటారని అధికారులు చెప్పారు. విలేజ్ క్లినిక్స్, 104 మొబైల్ మెడికల్ యూనిట్ల (ఎంఎంయూ)లో మందుల సంఖ్యను 67 నుంచి 105కి పెంచామన్నారు. విలేజ్ క్లినిక్స్‌లో 14 రకాల వైద్య పరీక్షల కిట్లను అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలకు అందించే వైద్య సేవలను రియల్ టైమ్‌లో నమోదు చేసేందుకు టూల్స్ సిద్ధం చేశామన్నారు. 104 ఎంఎంయూలు ప్రస్తుతం 676 ఉండగా కొత్తగా 234 వాహనాలతో కలిపి మొత్తం 910 ఎంఎంయూలతో ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలవుతుందని వివరించారు. ప్రతి జిల్లాకు బ్యాక్ అప్ కింద మరో 104 ఎంఎంయూ వాహనాన్ని రిజర్వ్‌లో ఉంచుతున్నట్లు తెలిపారు.

ఉదయం 9 నుంచి 4 గంటల వరకు..

ఫ్యామిలీ డాక్టర్ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలోనే ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తారని అధికారులు తెలిపారు. జనరల్ ఓపీ, జీవన శైలి జబ్బులు, గర్భవతుల ఆరోగ్య సంరక్షణ, అంగన్‌వాడీ, పాఠశాలల సందర్శన, పిల్లల ఆరోగ్యంపై పరిశీలన, రక్తహీనత నివారణ తదితర అంశాలపై వైద్యులు దృష్టి పెడతారని చెప్పారు. మంచానికే పరిమితమైన రోగులకు ఇంటి వద్దే వైద్య సేవలు అందించడంతో పాటు పంచాయతీ కార్యదర్శితో కలిసి గ్రామంలో పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ లాంటి విధులన్నింటినీ ఫ్యామిలీ డాక్టర్ నిర్వహిస్తారన్నారు. రక్తపోటు, మధుమేహం లాంటి జీవనశైలి జబ్బుల బాధితుల డేటా వివరాలు ఫ్యామిలీ డాక్టర్‌కు అందుబాటులో ఉంటాయన్నారు. వీరికి ఫాలో అప్ వైద్య సేవలను అందించడం కోసం ఈ డేటాను వినియోగిస్తామన్నారు. 108 అంబులెన్స్‌ల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ కండిషన్‌లో లేని వాహనాలను తొలగించి కొత్తవాటిని ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా కొత్తగా 108 అంబులెన్స్ వాహనాలు 146 కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటవుతున్న వైద్య కళాశాలల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేలా ఏర్పాట్లు జరుగుతున్నట్లు వివరించారు. విజయనగరం వైద్య కళాశాలకు ఇప్పటికే ఎన్ఎంసీ అనుమతులు లభించాయని చెప్పారు.

ఉచితంగా అత్యాధునిక వైద్యం..

వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా గ్లూకోమా, డయాబెటిక్ రెటీనోపతితో పాటు ఇతర కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి అత్యాధునిక కంటి వైద్యాన్ని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేసేందుకు, సిబ్బందికి శిక్షణ కోసం ఎల్.వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌ను భాగస్వామిగా చేసుకున్నారు. సీఎం సమీక్షలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు, ఆర్థిక శాఖ కార్యదర్శి గుల్జార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్, ప్రత్యేకాధికారి డాక్టర్ అశోక్, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరో 35.42 లక్షల మందికి వైఎస్సార్ కంటి వెలుగు

సచివాలయాల్లో స్క్రీనింగ్ పరీక్షలు

డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం మూడో విడతలో భాగంగా 60 ఏళ్లు పైబడిన 24,65,300 మందికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కంటి పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. మిగిలిపోయిన మరో 35,42,151 మందికి కంటి పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని తాజా సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలందరికీ ఉచితంగా సమగ్ర కంటి చికిత్స అందించే సంకల్పంతో కంటి వెలుగు కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2019 అక్టోబరు 10న సీఎం జగన్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం ఆరంభమైంది. తొలి రెండు దశల్లో 60,393 పాఠశాలల్లో 66,17,613 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 1,58,227 మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు అందజేయడంతో పాటు 310 మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. మూడో దశలో 60 ఏళ్లు పైబడిన వారికి కంటి పరీక్షల నిర్వహణ, చికిత్స ప్రారంభించారు. 24,65,300 మందికి ఇప్పటికే వైద్య పరీక్షలు చేసి 8 లక్షల మందికిపైగా వృద్ధులకు కళ్లద్దాలు అందించారు. మరో 4,70,034 మందికి కంటి శుక్లాల శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఈ క్రమంలో మూడో విడతలో మిగిలిపోయిన 35.42 లక్షల మందికి గ్రామ, వార్డు సచివాలయాల వద్ద కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. 26 జిల్లాల్లో 376 బృందాలతో స్క్రీనింగ్ కార్యక్రమాన్ని చేపడతారు. వచ్చే ఆగస్టులోగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.

ఎంఎస్‌ఎంఈల్లో రాణిస్తున్న మహిళలు

- దేశంలోనే రాష్ట్రంలో అత్యధికంగా మహిళల యాజమాన్యంలోని ఎంఎస్‌ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ
- మూడేళ్లలో 2.21 లక్షలకు పైగా ఎంఎస్‌ఎంఈలకు రూ.1,181.14 కోట్లు ఆర్థిక సాయం
- రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈల ద్వారా 19.59 లక్షల మందికి ఉపాధి : కేంద్రం వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ)ను సొంతంగా నిర్వహిస్తూ మహిళలు విజయవంతంగా రాణిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఎంఎస్‌ఎంఈలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. దీంతో మహిళలు ఎంఎస్‌ఎంఈలను ఏర్పాటు చేయడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశంలోనే రాష్ట్రంలో అత్యధికంగా మహిళల యాజమాన్యంలో ఉన్న ఎంఎస్‌ఎంఈలకు కేంద్రం ఇచ్చే ఆర్థిక సాయం అందింది. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ ద్వారా గత మూడేళ్లలో క్రెడిట్ గ్యారెంటీ నిధి నుంచి ఈ ఆర్థిక సాయం అందించారు. 2020–21 నుంచి 2022–23 నవంబర్ వరకు రాష్ట్రంలో మహిళల యాజమాన్యంలోని 2.21 లక్షలకు పైగా ఎంఎస్‌ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ నిధి నుంచి రూ.1,181.14 కోట్లు అందించినట్లు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఏపీలో మినహా గత మూడేళ్లలో మరే రాష్ట్రంలోనూ మహిళల యాజమాన్యంలోని ఎంఎస్‌ఎంఈలకు ఇంత పెద్ద సంఖ్యలో ఆర్థిక సాయం అందించలేదని తెలిపింది.



ఆర్థిక సాయం ఇలా..

2020–21లో దేశం మొత్తం మీద 1.71 లక్షల మహిళల యాజమాన్యంలోని ఎంఎస్‌ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ నిధి నుంచి కేంద్రం ఆర్థిక సాయం అందించింది. రాష్ట్రంలో అత్యధికంగా 74,339 ఎంఎస్‌ఎంఈలకు ఆర్థిక సాయం లభించింది. ఏపీ తర్వాత స్థానాల్లో మధ్యప్రదేశ్, తమిళనాడు నిలిచాయి. అలాగే 2021–22లో దేశం మొత్తం మీద మహిళల యాజమాన్యంలోని 1.30 లక్షల ఎంఎస్‌ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ నిధి నుంచి ఆర్థిక సాయం అందించగా.. రాష్ట్రంలో అత్యధికంగా 22,641 ఎంఎస్‌ఎంఈలకు సాయం దక్కింది. ఏపీ తర్వాత మధ్యప్రదేశ్, జమ్మూకాశ్మీర్ నిలిచాయి. ఇక 2022–23లో నవంబర్ వరకు దేశం మొత్తం మీద మహిళల యాజమాన్యంలోని 2.34 లక్షల ఎంఎస్‌ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ నిధి నుంచి ఆర్థిక సాయం అందగా రాష్ట్రంలో అత్యధికంగా 1.24 లక్షలకు పైగా ఎంఎస్‌ఎంఈలకు సాయం లభించింది. ఏపీ తర్వాత అత్యధికంగా సాయం అందుకున్న రాష్ట్రాల్లో జమ్మూకాశ్మీర్, ఉత్తరప్రదేశ్ నిలిచాయని కేంద్ర ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

పెరిగిన ఎంఎస్‌ఎంఈలు

2021–22లో మహిళల యాజమాన్యంలో ఎంఎస్‌ఎంఈలు 86.11% పెరిగినట్లు కేంద్ర ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వ శాఖ తెలిపింది. 2021 మార్చి 31 నాటికి మహిళల యాజమాన్యంలో దేశంలో 4,89,470 ఎంఎస్‌ఎంఈలుండగా గతేడాది మార్చి 31 నాటికి వీటి సంఖ్య 9,10,973కు చేరింది. మహిళల యాజమాన్యంలో ఉన్న ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు చేయూతనిస్తున్నాయని వెల్లడించింది. రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈల ద్వారా మొత్తం 19,59,778 మందికి ఉపాధి లభించినట్లు వివరించింది.

గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో మహిళల యాజమాన్యంలో ఎంఎస్‌ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ నిధి నుంచి ఆర్థిక సాయం ఇలా..

ఆర్థిక ఏడాది	ఎంఎస్‌ఎంఈల సంఖ్య	ఆర్థిక సాయం (రూ.కోట్లలో)
2020-21	74,339	274.95
2021-22	22,641	344.04
2022-23 (నవంబర్ వరకు)	1,24,143	562.15

ఎంఎస్‌ఎంఈలకు అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం

గత టీడీపీ ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈలతో పాటు పరిశ్రమలకు రాయితీలను ఇవ్వకుండా పెద్ద ఎత్తున బకాయిలు పెట్టింది. సుమారు రూ.3,409 కోట్ల మేర టీడీపీ ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఎంఎస్‌ఎంఈలు కోలుకోలేని దెబ్బతిన్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక టీడీపీ ప్రభుత్వం పెట్టిన బకాయిలను చెల్లించి ఎంఎస్‌ఎంఈలను ఆదుకుంది. అంతేకాకుండా మూడేళ్లుగా ఎంఎస్‌ఎంఈలకు సకాలంలో రాయితీలను చెల్లిస్తోంది. గత మూడేళ్లలోనే రూ.1,706.16 కోట్లను రాయితీల కింద రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. అదేవిధంగా ఎంఎస్‌ఎంఈలను ఏర్పాటు చేసే పారిశ్రామికవేత్తలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయిపట్టుకుని నడిపించేలా వ్యవహరిస్తోంది.

సీఎం రాయితీలు అందించడం వల్లే..



ఎంఎస్‌ఎంఈ పథకం కింద కార్ల కోసం పరిశ్రమల శాఖలో దరఖాస్తు చేసుకున్నా. నెల రోజుల్లోనే నాకు అనుమతి మంజూరైంది. రూ.14.50 లక్షలతో బొలేరో వాహనం, రూ.11.50 లక్షలతో బ్రిజా వాహనం కొనుగోలు చేశా. రెండు కార్లకు మొత్తం రూ.26 లక్షలు కాగా ఇందులో 45 శాతం సబ్సిడీ వచ్చింది. ఈ రెండు కార్లకు డ్రైవర్లను పెట్టుకొని బాడుగకు తిప్పుకుంటూ జీవనం సాగిస్తున్నా. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంఎస్‌ఎంఈలకు రాయితీలు అందించడం వల్లే పరిశ్రమలు వస్తున్నాయి. నాకు జీవనోపాధి కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను ఎప్పటికీ మరిచిపోను.
–ఎస్ఎల్ శిరోమణి, జ్ఞానాపురం, నంద్యాల

ప్రయివేట్ స్కూళ్లలో పేదలకు ఉచిత ప్రవేశాలు

పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు

సాక్షి, అమరావతి: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం 2023–24 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లలో ప్రవేశాలు కల్పించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాలకు చెందిన వారు (అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులు) కోసం 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాల(బీసీ, మైనారిటీ, ఓసీ)కు చెందిన పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అర్హత కలిగిన పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించి 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశం కల్పిస్తామని చెప్పారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు వార్షిక ఆదాయం రూ.1,20,000, పట్టణ ప్రాంతంలో నివసించే బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు వార్షికాదాయం రూ.1,44,000లను ప్రాతిపదికగా తీసుకుని వారి కుటుంబాల పిల్లలను అర్హులుగా పరిగణిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాల కల్పనకు నోటిఫికేషన్ జారీ చేసినట్టు వెల్లడించారు. ఒకటో తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ దరఖాస్తు నమోదుకు షెడ్యూల్ కూడా ప్రకటించామన్నారు. అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులు, అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్(సమగ్ర శిక్ష) దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు.

విద్యార్థుల ప్రవేశాలకు షెడ్యూల్

- ఆన్‌లైన్ పోర్టల్‌లో అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల నమోదు తేదీలు: 06.03.2023 నుంచి 16.03.2023 వరకు
- విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు (ఆన్‌లైన్ పోర్టల్‌లో) తేదీలు: 18.03.2023 నుంచి 07.04.2023 వరకు
- ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రవేశానికి ఎంపిక ప్రక్రియ: 09.04.2023 నుంచి 12.04.2023 వరకు
- మొదటి ఎంపిక జాబితా విడుదల తేదీ: 13.4.2023
- ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో మొదటి జాబితాలో ఎంపిక కాబడిన విద్యార్థుల ప్రవేశాలను నిర్ధారించే తేదీలు: 15.04.2023 నుంచి 21.04.2023 వరకు
- రెండో ఎంపిక జాబితా విడుదల తేదీ: 25.4.2023
- రెండో జాబితాలో ఎంపికైన విద్యార్థుల ప్రవేశాలను నిర్ధారించే తేదీలు: 26.04.2023 నుంచి 30.04.2023 వరకు

తెలియదు.. గుర్తు లేదు.. మర్చిపోయా

▶ మొదటి పేజీ తరువాయి

నారాయణ, ఆయన భార్య పి.రమాదేవి, నారాయణ విద్యా సంస్థల ఆర్థిక వ్యవహారాల కోసం ఏర్పాటు చేసిన ఎన్ స్పైరా సంస్థలో కీలక స్థానంలో ఉన్న పొత్తూరి ప్రమీల అనే ఉద్యోగినిని హైదరాబాద్‌లో సోమవారం వేర్వేరుగా విచారించారు. నారాయణ విద్యా సంస్థలు, ఎన్ స్పైరా సంస్థల బ్యాంకు ఖాతాల నుంచి రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యాంకు ఖాతాలకు నిధుల బదలాయింపుపై సీఐడీ అధికారులు నారాయణను ప్రశ్నించారు. ఆ నిధులతో బినామీల పేరిట అమరావతిలో అసైన్డ్ భూములు కొనుగోలు చేసిన రికార్డులు చూపిస్తూ ప్రశ్నించినట్టు తెలుస్తోంది. నారాయణ బినామీల పేరిట కొనుగోలు చేసిన భూముల సమీపంలోనే స్టార్టప్ సిటీ వచ్చేలా సీఆర్‌డీఏ అమరావతి మాస్టర్ ప్లాన్ రూపొందించిన ఉదంతంపైనా వివరాలడిగారు. ఆ సమయంలో మునిసిపల్ శాఖ మంత్రిగా ఉన్న నారాయణ మాస్టర్ ప్లాన్‌ను ప్రభావితం చేశారని అభియోగాలున్నాయి. నారాయణ విద్యా సంస్థలు, చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్, వారి సన్నిహితుడు లింగమనేని కుటుంబానికి చెందిన సంస్థల భూముల విలువ పెరిగేలా ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చేలా నారాయణ అధికార దుర్వినియోగానికి పాల్పడటంపైనా సీఐడీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. నారాయణ ఒక్క ప్రశ్నకు కూడా సూటిగా సమాధానం చెప్పలేదని తెలుస్తోంది. సీఐడీ విచారణకు ఏమాత్రం సహకరించకూడదని ఆయన ముందుగానే నిర్ధారణకొచ్చినట్టుగా వ్యవహరించారని సమాచారం. నారాయణ భార్య రమాదేవి, పొత్తూరి ప్రమీల కూడా విచారణకు ఏమాత్రం సహకరించ లేదు.

నారాయణ కుమార్తెను ఇంటి వద్దే విచారించండి

మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ డిజైన్ల ముసుగులో సాగిన భూ దోపిడీపై నమోదు చేసిన కేసులో తమ ముందు హాజరు కావాలంటూ సీఐడీ ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ నారాయణ కుమార్తె సింధూర, ఆమె భర్త పునీత్, అతడి సోదరుడు వరుణ్‌కుమార్, రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అంజనీకుమార్ బాబీలు హైకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి సోమవారం విచారణ జరిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి, సింధూరను ఆమె ఇంటి వద్దే 20న విచారించాలని సీఐడీని ఆదేశించారు. అదే రోజున సీఐడీ ముందు హాజరు కావాలని పునీత్, వరుణ్‌లకు సైతం ఆదేశాలిచ్చారు. ఇక అంజనీకుమార్‌ను అదే రోజున న్యాయవాది సమక్షంలో విచారించాలని సీఐడీకి సూచించారు.

క్లుప్తంగా...

ఏసీ పేలి..
తల్లీపిల్లల సజీవదహనం
రాయచూరు థర్మల్ కేంద్రం క్వార్టర్స్‌లో విషాదం

రాయచూరు రూరల్: కర్ణాటకలోని రాయచూరు జిల్లా శక్తినగర్‌లో ఘోర ప్రమాదం సంభవించింది. వేసవిలో చల్లదనం కోసమని ఎయిర్ కండిషనర్ (ఏసీ) వేసుకోగా అది పేలి తల్లి, ఇద్దరు పిల్లలు మంటల్లో కాలిపోయారు. రాయచూరు థర్మల్ కేంద్రం (ఆర్టీపీఎస్) ఇంజినీర్ ఇంట్లో సోమవారం రాత్రి ఈ దుర్ఘటన జరిగింది. రాయచూరు నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ థర్మల్ విద్యుత్కేంద్రంలో సిద్ధలింగయ్యస్వామి సహాయక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. స్థానిక క్వార్టర్స్‌లో ఆయన కుటుంబంతో నివసిస్తున్నారు. సోమవారం రాత్రి 7:30 గంటల సమయంలో ఇంట్లో ఏసీ షార్ట్‌సర్క్యూట్‌తో పేలింది. మంటలు చెలరేగాయి. హాల్లో కూర్చుని టీవీ చూస్తున్న సిద్ధలింగయ్యస్వామి భార్య రంజిత (33), కుమార్తె మృదుల (13), కుమారుడు కారుణ్య (11) మంటల్లో చిక్కుకుని అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఆ సమయంలో సిద్ధలింగయ్యస్వామి డ్యూటీలో ఉండడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. వీరి స్వస్థలం మండ్య జిల్లా. శక్తినగర్ పోలీసులు విచారిస్తున్నారు.

పోలవరం కుడి కాలువ రక్షణ గట్టును తవ్వకుండా ఆపండి
ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: కృష్ణా జిల్లాలో పోలవరం కుడి కాలువ రక్షణ నిమిత్తం ఏర్పాటు చేసిన గట్టు నుంచి గ్రావెల్, మట్టి తవ్వకాలను ఆపేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కృష్ణా జిల్లాలోని గన్నవరం, విజయవాడ రూరల్, ఆగిరిపల్లి మండలాల పరిధిలో పోలవరం కుడి కాలువ రక్షణ నిమిత్తం ఏర్పాటు చేసిన గట్టును అక్రమంగా తవ్వేస్తూ గ్రావెల్, మట్టి తరలిస్తున్నారని, దీని వల్ల కాలువ తీవ్రంగా దెబ్బతింటోందని, ఈ విషయంలో జోక్యం చేసుకుని తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ గన్నవరం మండలం కేసరపల్లి గ్రామానికి చెందిన పిల్లి సురేంద్ర బాబు ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. అక్రమార్కులపై క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ అక్రమ మైనింగ్ వల్ల పోలవరం కాలువ తీవ్ర ప్రమాదంలో పడిందన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ధర్మాసనం ముందుంచారు. వాటిని పరిశీలించిన ధర్మాసనం ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి, ఇంజనీర్ ఇన్ చీఫ్‌లను ఆదేశించింది. ఈ విషయంలో కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ, సీఐడీ అదనపు డీజీ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) సభ్య కార్యదర్శి, గనుల శాఖ డైరెక్టర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డైరెక్టర్‌లతోపాటు పలువురికి వ్యక్తిగత నోటీసులు అందజేసేందుకు పిటిషనర్‌కు హైకోర్టు అనుమతిచ్చింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

కోర్టు ముందు హాజరుకండి
- గుంటూరులోని ఏకాంబరేశ్వర స్వామి దేవస్థానం ఈవోకు హైకోర్టు ఆదేశం
- విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: గుంటూరులోని కంచికామాక్షి ఏకాంబరేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరై దేవస్థానానికి చెందిన రెండు ఎకరాల భూమిపై ప్రైవేటు వ్యక్తులకు హక్కులు కల్పించడం గురించి వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు నగరంలోని పాత గుంటూరులో ఉన్న కంచికామాక్షి ఏకాంబరేశ్వరస్వామి దేవస్థానానికి యలవర్తి కుటుంబాచార్యులు 1914లో రెండు ఎకరాల భూమిని దానం ఇచ్చారు. ఆ భూమి అప్పటి నుంచి దేవదాయశాఖ అధీనంలోనే ఉంది. అయితే, ఈ రెండు ఎకరాల భూమిని దేవాదాయశాఖ ఆధీనం నుంచి తప్పించి ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేసేందుకు దేవదాయ కమిషనర్ ఉత్తర్వులిచ్చారని, ఇందులో జోక్యం చేసుకోవాలని కోరుతూ జి.హేమందగుప్తా, మరో ముగ్గురు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది పాణినీ సోమయాజి వాదనలు వినిపిస్తూ, కమిషనర్ తీరు చట్ట విరుద్ధమన్నారు. ధర్మాసనం స్పందిస్తూ, కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను ఈవో ఎందుకు సవాలు చేయలేదని ప్రశ్నించింది. ఇందుకు తాను సమాధానం చెప్పలేనని దేవస్థానం తరఫు న్యాయవాది కె.మాధవరెడ్డి తెలిపారు. ప్రైవేటు వ్యక్తులతో ఈవో కుమ్మక్కైనట్లు కనిపిస్తోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనిపై వివరణ ఇచ్చేందుకు స్వయంగా మంగళవారం తమ ముందు హాజరుకావాలని ఈవోను ధర్మాసనం ఆదేశించింది.

జనం మధ్యకు పులి కూనలు

నంద్యాల జిల్లా పెద్దగుమ్మడాపురంలోకి వచ్చిన నాలుగు పెద్దపులి పిల్లలు

- తల్లితో కలిపేందుకు అటవీశాఖ సిబ్బంది ప్రయత్నం
- డీలా పడిన పులి పిల్లలు... జంతు వైద్యశాలలో పరీక్షలు
- ఆరోగ్యంగా ఉన్నాయని చెప్పిన వైద్యులు
- ఒకటి, రెండు రోజుల్లో తల్లి జాడ తెలియకపోతే తిరుపతి జూకు పిల్లలు..



సాక్షి, అమరావతి/కొత్తపల్లి: నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం పెద్దగుమ్మడాపురం గ్రామ శివారులోని ఓ గోడౌన్‌లో సోమవారం ఉదయం నాలుగు పెద్దపులి పిల్లలు కనిపించడంతో కలకలం రేగింది. ఆ నాలుగు ఆడ పులి పిల్లలను తల్లి వద్దకు చేర్చేందుకు అటవీశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు పిల్లల కోసం తల్లి పులి వచ్చి దాడి చేస్తుందని పెద్దగుమ్మడాపురం గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని కొత్తపల్లి మండలం పెద్దగుమ్మడాపురం గ్రామం నల్లమల అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉంటుంది. గ్రామస్తులు ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు అటవీ ప్రాంతానికి వెళుతుంటారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఓ యువకుడు గ్రామానికి చివర నిర్మాణంలోని మల్టీపర్పస్ గోడౌన్ అవతలివైపునకు వెళ్లగా, పులిపిల్లల అరుపులు వినిపించాయి. మొదట జంగం పిల్లులుగా భావించినా... దగ్గరకు వెళ్లి చూడగా నాలుగు పులి పిల్లలు కనిపించాయి. అతను వెంటనే ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశాడు. స్థానికుల సమాచారం మేరకు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నాగేశ్వరావు, సిబ్బంది పెద్దగుమ్మడాపురం చేరుకుని నాలుగు పులి పిల్లలను పరిశీలించారు. సుమారు 40రోజుల వయసు కలిగిన పులి పిల్లలను అడవిలోకి తీసుకువెళ్లి తల్లితో కలిపేందుకు ప్రయత్నించారు. మూడు గంటలు అడవిలో తిరిగినా తల్లి కనిపించలేదు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పులిపిల్లలు డీలా పడిపోయాయి. దీంతో వాటికి పాలు పట్టించి బైర్లూటి రేంజ్‌లో ఉన్న జంతువైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షలు చేసి నాలుగు పిల్లలు ఆరోగ్యంగా ఉన్నాయని నిర్ధారించారు. అటవీ ప్రాంతంలో ఎండ పెరగడం, చెట్లకు మంట పెడుతుండటంతో వేడి తీవ్రత తట్టుకోలేక గ్రామంలోకి పెద్దపులి తన పిల్లలను తీసుకువచ్చి, ఒంటరిగా తిరిగి వెళ్లి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఆత్మకూరు సర్కిల్ సీఐ ఆర్‌జీ సుబ్రహ్మణ్యం పరిస్థితిని సమీక్షించారు. ఈ విషయమై సున్నిపెంట బయోడైవర్సిటీ రేంజ్ అధికారి మహమ్మద్ హాయత్ మాట్లాడుతూ గ్రామస్తులు ఎలాంటి భయాందోళనలకు గురికావొద్దని, పులి రాకను గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. పెద్ద పులికి రెండు, మూడు పిల్లలే పుడతాయని, అయితే నాలుగు ఆడ పులి పిల్లలు పుట్టడం చాలా అరుదని ఆయన తెలిపారు.

ఎన్‌క్లోజర్‌లో పెట్టి.. తల్లి కోసం ఎదురుచూస్తూ..

పులి పిల్లలను తల్లి దగ్గరకు చేర్చేందుకు నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) నిబంధనల ప్రకారం అధికారులు, సిబ్బందితో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్ ఏసీఎఫ్ (అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్) ఆర్.శ్రీనివాసరెడ్డి 'సాక్షి'కి తెలిపారు. పులి పిల్లలు దొరికిన సమీపంలోనే చిన్న ఎన్‌క్లోజర్‌లో వాటిని ఉంచి దూరం నుంచి తల్లి వస్తుందో.. లేదో.. అని గమనిస్తున్నట్లు తెలిపారు. చుట్టూ 50 కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పిల్లల వాసన, అరుపులను బట్టి తల్లి వస్తుందని భావిస్తున్నామని, వస్తే వాటిని దానికి జత చేస్తామన్నారు. అలాకాకుండా అడవిలో వదిలేస్తే అవి ఇతర జంతువుల బారినపడతాయని చెప్పారు. ఒకటి, రెండు రోజులు చూసిన తర్వాత కూడా తల్లి రాకపోతే వాటిని తిరుపతి జూకు తరలించి సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



సమీపంలోనే సంచరిస్తున్న తల్లి!

పులి పిల్లలు లభించిన ప్రాంతంలోనే తల్లి పులి తిరుగుతున్నట్లు దాని గాండ్రింపుల ద్వారా అటవీ సిబ్బంది గుర్తించారు. ఈ తల్లి పులిని డిసెంబర్ నెలలో కెమెరా ట్రాప్‌లో గుర్తించినట్లు అటవీ శాఖాధికారులు చెబుతున్నారు. ఆ సమయంలో అది గర్భంతో ఉంది. ఇప్పుడు దాని పిల్లలే పెద్దగుమ్మడాపురంలో ఉన్నట్లు భావిస్తున్నారు.

డిసెంబర్ నెలలో కెమెరా ట్రాప్‌లో గుర్తించిన తల్లి పులి



మల్టీపర్పస్ గోడౌన్ వద్ద పులి పిల్లలు



పులిపిల్లలకు పాలు పడుతున్న అటవీశాఖ సిబ్బంది

కార్చిచ్చుకు పక్కా స్పాట్

ఈ ఏడాది ఫిబ్రవరిలోనే అడవులకు పలుచోట్ల మంటలు

- యుద్ధప్రాతిపదికన మంటలను నియంత్రిస్తున్న అటవీశాఖ
- శాటిలైట్ల సమాచారంతో మంటల ప్రాంతాలు గుర్తింపు
- ఈ వేసవిలో మంటలు చెలరేగకుండా ముందస్తు చర్యలు

సాక్షి, అమరావతి: అడవుల్లో చెలరేగుతున్న మంటలను వెంటనే నియంత్రించడానికి రాష్ట్ర అటవీశాఖ పక్కా ప్రణాళికతో ముందుకెళుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల్లో పలు చోట్ల మంటలు చెలరేగాయి. వాటిని అటవీ శాఖ సిబ్బంది యుద్ధప్రాతిపదికన నియంత్రించింది. చిన్న మంటలుగా ఉండగానే పసిగట్టి వాటిని ఆర్పేయడం ద్వారా అటవీ ప్రాంతాలను రక్షించగలిగారు. సాధారణంగా నవంబర్ నుంచి జూన్ వరకూ అటవీ ప్రాంతాల్లో మంటలు చెలరేగుతాయి. డిసెంబర్ నుంచి నెమ్మదిగా పెరుగుతూ మార్చి నుంచి మే నెల వరకు ఎక్కువగా అడవులు తగలబడతాయి. కానీ ఈసారి మాత్రం ఫిబ్రవరిలోనే రాయలసీమ ప్రాంతాలు, నల్లమల అడవుల్లో ఎక్కువగా మంటలను గుర్తించారు. గత నెలలో 5,972 చోట్ల మంటల్ని గుర్తించి ఆర్పేశారు. వైఎస్సార్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో అత్యధికంగా 1,013 పాయింట్లలో మంటలను నియంత్రించారు.





మంటలను ఆర్పుతున్న అటవీశాఖ సిబ్బంది

సమాచారం ఇలా..
- అంతరిక్షం నుంచి భూమిని నిరంతరం క్షుణ్ణంగా పరిశీలించే ఎస్ఎన్‌పీపీ, మోడిస్ శాటిలైట్లు మంటల పాయింట్లను గుర్తించడానికి సహాయపడుతున్నాయి.
- అక్షాంశ, రేఖాంశాలతో సహా మంటల సమాచారం ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా మానిటరింగ్ వ్యవస్థ ద్వారా రాష్ట్ర అటవీ శాఖకు చేరుతుంది.
- మంటల సమాచారం అటవీ ఉన్నతాధికారులు, సిబ్బంది ఫోన్‌లకు మెసేజ్‌ల రూపంలో వస్తుంది.
- రాష్ట్ర అటవీ శాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్న ఫైర్ మానిటరింగ్ సెల్ ఈ సమాచారాన్ని డీఎఫ్‌వోలకు పంపుతుంది.
- ప్రస్తుతం ఈ వ్యవస్థ ద్వారా ఫిబ్రవరిలో మంటలను నియంత్రించగలిగారు.



మంటలకు కారణాలు
- వర్షాకాలంలో అడవుల్లో గడ్డి బాగా పెరిగి వేసవి నాటికి అది ఎండిపోతుంది.
- ఎండల వల్ల, లేదా అడవుల్లో సంచరించే వ్యక్తులు కాల్చిపడేసే చుట్టలు, బీడీల వల్ల మంటలు చెలరేగుతాయి.
- ఇలాంటి మంటలను నియంత్రించడానికి అటవీ శాఖ ఫైర్ లైన్ ఏర్పాటు చేస్తుంది. తద్వారా మంటలు విస్తరించకుండా చూస్తారు.
- ఫైర్ ఫైటింగ్ పరికరాల ద్వారా మంటల్ని ఆర్పుతారు.
- అడవుల్లో మంటలు చెలరేగకుండా ఉండేందుకు సమీప గ్రామాల్లో అవగాహన శిబిరాలు కూడా నిర్వహిస్తున్నారు.
- ఈ సంవత్సరం నవంబర్ నుంచి ఇప్పటి వరకు 6,229 ప్రాంతాల్లో మంటలు ఏర్పడినా వెంటనే ఆర్పేశారు.
- 2022లో 14,452 పాయింట్లలో ఏర్పడిన మంటలను వెంటనే ఆర్పేసి అటవీ ప్రాంతాన్ని రక్షించగలిగారు.

ఎక్కువ పాయింట్లలో వచ్చినా వెంటనే ఆర్పేశాం
ఈ సంవత్సరం ఫిబ్రవరిలో అనూహ్యంగా ఎక్కువ పాయింట్లలో మంటలు వ్యాపించినా మా సిబ్బంది ద్వారా వెంటనే అదుపు చేశాం. ఆదివారం ఒక్కరోజే 825 పాయింట్లలో మంటలు ఏర్పడినట్లు శాటిలైట్ల నుంచి సమాచారం వచ్చింది. మా శాఖ వెంటనే అప్రమత్తమై వాటిని ఆర్పేసింది. ప్రతి సంవత్సరం పక్కా ప్రణాళికతో అడవుల్లో మంటలు వ్యాపించినా వెంటనే ఆర్పడం ద్వారా అటవీ ప్రాంతాన్ని కాపాడుతున్నాం.

– ఎం రవిశంకర శర్మ, నోడల్ అధికారి, ఫైర్ మానిటరింగ్ సెల్, అటవీ శాఖ

'మనూ'లో సీయూఈటీ ద్వారా యూజీ ప్రవేశాలు
రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 2023–24 అకడమిక్ సెషన్ కోసం కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ)–2023 ద్వారా అండర్ గ్రాడ్యుయేట్ రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోందని 'మనూ' డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.ఎం.వనజ తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి మార్చి 12 వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. 'మనూ' రెగ్యులర్ పీజీ బీటెక్, బీఈడీ, డిప్లొమో ఇన్ ఇంజనీరింగ్, డీఈఐ. ఈడీ అన్ని సర్టిఫికెట్, పరిశోధన ప్రోగ్రామ్‌ల ప్రవేశాలను విడిగా తెలియజేస్తుందన్నారు.

రాష్ట్ర ప్రగతికి జీఐఎస్ సదస్సు సోపానం

- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఈ సదస్సుతో మరింత బలోపేతం
- ఎంవోయూలన్నింటినీ అమలు చేసి, ప్రయోజనాలను ప్రజలకందిస్తాం
- ఎంవోయూలపై ప్రతి వారం చీఫ్ సెక్రటరీ, నెలకోసారి సీఎం జగన్ సమీక్ష
- ఒక్క రెన్యువబుల్ ఎనర్జీలోనే అంబానీ రూ.50 వేల కోట్ల పెట్టుబడులు
- సోలార్, విండ్, పంప్‌డ్ స్టోరేజ్ ప్లాంట్ల ఏర్పాటుకు పుష్కలంగా అవకాశాలు
- వెబ్‌సైట్ ద్వారా ఎవరైనా పెట్టుబడులకు ముందుకు రావచ్చు
- చంద్రబాబు కూడా విండ్ లేదా సోలార్ పవర్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ప్రగతికి, భవిష్యత్తుకు సోపానంగా జీఐఎస్ సదస్సు సాగిందని పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయటం, యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించటమే ప్రధాన లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో జరిగిన జీఐఎస్ సదస్సు విజయవంతమైందని తెలిపారు. దీనికి సహకారం అందించని ఆ రెండు ఛానళ్లు, ఆ ఒక్క పేపర్ తప్ప మిగతా అన్ని ఛానళ్లకు, పత్రికలకు ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే ప్రపంచం నలుమూలల నుంచి పెట్టుబడిదారులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చారని చెప్పారు. సోమవారం ఇక్కడ నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు, 6 లక్షల ఉద్యోగాలను ఆచరణలోకి తేవడం కోసం ఎంవోయూల పర్యవేక్షణకు కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పరిశ్రమల శాఖ డైరెక్టర్ తదితరులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కమిటీ వారానికి ఒకసారి సమావేశమై ఎంవోయూలను సమీక్షిస్తుందన్నారు. నెలలో ఒకసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన ఎంవోయూలపై సమీక్ష కూడా ఉంటుందన్నారు. ప్రతి ఒప్పందాన్ని అమలు చేసి, వాటి ప్రయోజనాలను రాష్ట్ర ప్రజలకు అందిస్తామని, సంపదను సృష్టిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. ఒక్క రెన్యువబుల్ ఎనర్జీ సెక్టార్‌లో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు పారిశ్రామిక దిగ్గజం ముఖేశ్ అంబానీ చెప్పారన్నారు. సోలార్‌లో 38 గిగావాట్ల ఉత్పత్తికి, 44 గిగావాట్ల సామర్థ్యంతో విండ్ ఎనర్జీ, 29 ప్రాంతాల్లో 33 గిగావాట్ల సామర్థ్యంతో పంప్‌డ్ స్టోరేజ్ ప్లాంట్ల ఏర్పాటుకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు మంచిని మంచిగా, చెడును చెడుగా చెప్పాలన్నారు.

ఏపీలో సమృద్ధిగా వనరులు

రాష్ట్రంలో సమృద్ధిగా ఉన్న సహజ వనరులను వినియోగించి ఆర్థిక పరిపుష్టిని సాధిస్తామని మంత్రి చెప్పారు. దేశంలో 11 పారిశ్రామిక కారిడార్లు ఉంటే మూడు ఏపీలో ఉండడం, ఇవి ప్రధాన నగరాలు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లను అనుసంధానం చేసేలా ఉండడం కూడా మన రాష్ట్రానికి అదృష్టమని తెలిపారు. ఈ మూడు కారిడార్ల పరిధిలో 48 వేల ఎకరాలను సేకరించినట్లు తెలిపారు. రోడ్లు, నీరు, విద్యుత్, నైపుణ్యం ఉన్న యువత, ఇతర మౌలిక వసతులు ఉన్నాయన్నారు. సింగిల్ విండో సిస్టమ్ ద్వారా 21 రోజుల్లో 23 శాఖలకు సంబంధించి 93 క్లియరెన్స్‌లు కూడా ఇస్తున్నామన్నారు. భూ కేటాయింపులు కూడా త్వరితగతిన చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఎవరైనా పెట్టుబడులకు ముందుకు రావచ్చునని, చంద్రబాబు కూడా విండ్ లేదా సోలార్ పవర్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు కూడా పాల్గొన్నారు.



“ చుట్టూ ఉన్న మనుషులను పరిశీలనగా చూడనిదే జీవితంలో అలవాటు పడలేని పరిస్థితులంటూ ఏవీ ఉండవన్న సత్యం బోధపడదు.

– లియో టాల్‌స్టాయ్

సాక్షి

మంగళవారం, మార్చి, 7

వెంటాడు... వేటాడు...

పరిశోధన, ప్రజా విధానాలకు సూచన, సలహాల్లో యాభై ఏళ్ళుగా కృషి చేస్తూ, స్వర్ణోత్సవం జరుపుకోవడమనేది ఉత్సాహంగా ముందుకు అడుగేయాల్సిన సందర్భం. కానీ, అందుకు విరుద్ధంగా అడుగులు ముందుకు పడకుండా పాలకులే అడ్డం పడితే? పౌర విధానానికి సంబంధించి దేశంలోకెల్లా అత్యంత గౌరవనీయమైన ఢిల్లీకి చెందిన మేధావుల బృందమైన 'సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్' (సీపీఆర్) విషయంలో ఇప్పుడు జరుగుతున్నది అలానే ఉంది. ఆ సంస్థకు విదేశీ విరాళాలు, ఆర్థిక సహాయం అందే వీలు లేకుండా 'విదేశీ సహాయ (నియంత్రణ) చట్టం' (ఎఫ్‌సీఆర్‌ఏ) కింద రిజిస్ట్రేషన్‌ను ఆరు నెలల పాటు కేంద్రం రద్దు చేసింది. ఈ మేరకు కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ ఫిబ్రవరి 27న ఉత్తర్వులివ్వడం జాతీయ, అంతర్జాతీయ మేధావులను ఉలిక్కిపడేలా చేసింది.

విద్యావిషయిక కార్యక్రమాలకే లైసెన్స్ ఇచ్చామనీ, కానీ సీపీఆర్ మాత్రం విదేశీ విరాళాలను పుస్తక ప్రచురణ లాంటి వాటికీ వినియోగిస్తోందనీ ఆ ఉత్తర్వుల ఆరోపణ. అయిదు నెలల క్రితం గత సెప్టెంబర్‌లో ఢిల్లీలోని సీపీఆర్ కార్యాలయం, అలాగే ఆక్స్‌ఫామ్ ఇండియా, పలు డిజిటల్ మీడియా సంస్థలకు నిధులిచ్చే బెంగళూరుకు చెందిన 'ఇండిపెండెంట్ అండ్ పబ్లిక్ స్పిరిటెడ్ మీడియా ఫౌండే షన్' (ఐపీఎస్ఎంఎఫ్)లపై ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ విరుచుకుపడింది. సర్వేలు నిర్వహించింది. ఆ వెంటనే సిబ్బందికి సమన్లు వెళ్ళాయి. దానికి కొనసాగింపుగా పన్ను మినహాయింపును రద్దు చేస్తామని హెచ్చరిస్తూ, షోకాజ్ నోటీసు వెళ్ళాయి. ఒక రకంగా దాని కొనసాగింపే – ఇప్పుడీ లైసెన్స్ రద్దు. నిజానికి, లాభాపేక్ష రహిత స్వచ్ఛంద సంస్థగా 1976 నుంచి సీపీఆర్‌కు పన్ను మినహా యింపు లభిస్తోంది. వచ్చే 2027 దాకా మినహాయింపు ఉన్నా, ఇప్పుడీ బెదిరింపులు గమనార్హం.

ఆదాయపు పన్ను లెక్కల్లో తేడాలుంటే విచారించడం తప్పు కాదు. చట్టం ముందు అందరూ సమానులే గనక ఏమన్నా తప్పు చేసినట్టు రుజువైతే చర్యలు తీసుకోవడమూ తప్పనిసరే. కానీ, మనసులో ఏదో పెట్టుకొని, ఏ చిన్న లోపం కనిపించినా, వెంటాడి వేధించాలని అనుకుంటేనే అది హర్షించలేని విషయం. ఆ సంస్థ బాధ్యుల్లోని పరిశోధకులు కొందరు ప్రభుత్వ విధానాల్ని తప్పుబడుతూ ఇటీవల రాసిన వ్యాసాలే దీనికి హేతువని ఓ బలమైన విమర్శ. ఎక్కడా, ఏ తప్పూ చేయలేదని తేలినప్పటికీ, సాంకేతిక కారణాలే సాకుగా సీపీఆర్ లాంటి స్వతంత్ర మేధాసంస్థను వేధిస్తున్నారన్నది స్పష్టం. కొండను తవ్వి ఎలుకను పట్టే ఈ దీర్ఘకాల ప్రక్రియతో మానసికంగా వేధించడమే పాలక వర్గాల పరమార్థంగా కనిపిస్తోంది.

నిజానికి, సీపీఆర్ అనేది దేశంలోని అగ్రేసర స్వతంత్ర పరిశోధనా సంస్థల్లో ఒకటి. విభిన్న రంగాలకు చెందిన పరిశోధకులు, వృత్తినిపుణులు, విధాన నిర్ణేతలతో కూడిన మేధావుల బృందం ఇది. ఈ లాభాపేక్ష రహిత సంస్థ 50 ఏళ్ళ క్రితం 1973లో ఏర్పాటైంది. ప్రభుత్వ విధానాల్లోని వివిధ అంశాలపై ఈ సంస్థలోని బుద్ధిజీవులు దృష్టి సారిస్తుంటారు. ఆర్థికవేత్త – మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి వై.వి. చంద్రచూడ్ సహా పలువురు మేధావులు ఈ సంస్థ కార్యవర్గంలో మాజీ సభ్యులు. అనేక కేంద్ర శాఖలతో, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలతోనూ కలసి పనిచేసిన ఈ సంస్థను భారత ప్రభుత్వం గుర్తించింది. దశాబ్దాలుగా పన్ను మినహాయింపూ ఇస్తోంది. గత ఏడాదీ వివిధ రాష్ట్రాలు, కేంద్ర శాఖల నుంచి సీపీఆర్‌కు నిధులు వచ్చాయి.

మరి, ఉన్నట్టుండి సీపీఆర్ జీవితం మీద పాలకులకు ఎందుకు విరక్తి కలిగినట్టు? దీనికి రకరకాల కథనాలు వినిపిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో పనిచేస్తున్న 'జన అభివ్యక్తి సామాజిక్ వికాస్ సంస్థ' (జస్వాస్) సహా దాదాపు 30 సంస్థలకు డేటా సేకరణ, పర్యావరణ చట్టం సహా పలు అంశాల్లో పరిశోధనకు సీపీఆర్ నిధులిచ్చింది. ఛత్తీస్‌గఢ్‌లో ఏనుగులు తిరిగే జీవవైవిధ్య ప్రాంతం హస్‌దేవ్‌లో బొగ్గు గనుల అక్రమ తవ్వకంపై ఆదివాసీ ఉద్యమంలో జస్వాస్ ట్రస్టీ అయిన ఒక పరిశోధకుడి భాగం కూడా ఉంది. ఆ గనులు పాలకుల ఆశీస్సులున్న వ్యాపార సంస్థవనీ, ఆ ఉద్యమానికీ – సీపీఆర్‌తో జస్వాస్ భాగస్వామ్యానికీ సంబంధం లేకున్నా పాలకులకు అది కోప కారణమైందనీ విశ్లేషకుల మాట. కారణాలు ఏమైనా, ఏలినవారికి కోపమొస్తే బండి నడవడం కష్టమనే విషయం తాజా సీపీఆర్ లైసెన్స్ రద్దుతో మరోసారి రుజువు చేస్తోంది.

గమనిస్తే – ఐటీ విభాగం తన నోటీసుల్లో పేర్కొన్న పరిశీలనలు, చేసిన ఆరోపణలు దాని పరిధిని దాటి ఉన్నాయి. ఇది పాలకులపై అనుమానాలకు ఊతమిస్తోంది. సీపీఆర్ మాత్రం తమ కార్యకలాపాలన్నీ చట్టబద్ధమైనవేననీ, ప్రభుత్వ సంస్థలు తమ ఆదాయ వ్యవహారాలను ఎప్పటి కప్పుడు ఆడిట్ చేస్తూనే ఉన్నాయనీ స్పందించింది. రాజ్యాంగ విలువల స్ఫూర్తితో ఈ వివాదం వీలైనంత త్వరలో సమసిపోతుందని అభిలషించింది. ఆ అభిలాష వాస్తవరూపం ధరిస్తే సంతో షమే. అయితే, పాలకులు తమ చేతుల్లోని దర్యాప్తు సంస్థలనూ, విభాగాలనూ దుర్వినియోగం చేయ డానికి ఏ మాత్రం వెనుకాడని గతం, వర్తమానమే భయపెడుతున్నాయి. నిబంధనల్లోని సాంకేతిక అంశాలను ఆయుధంగా చేసుకొని, భావప్రకటన స్వేచ్ఛకున్న అవకాశాల్ని అడ్డుకోవాలని పాలకులు చూడడం ఆందోళన రేపుతోంది. ఐటీనైనా, విదేశీ స్వార్థ ప్రయోజనాలు మన దేశ రాజకీయాలను ప్రభావితం చేయరాదని పెట్టుకున్న ఎఫ్‌సీఆర్‌ఏ లాంటి నియంత్రణ వ్యవస్థనైనా ప్రభుత్వేతర సంస్థల పీక నులమడానికి వాడితే అది అప్రజాస్వామికమే కాదు... అచ్చమైన ప్రతీకారమే!

'హోలీ హై....'

సాధారణంగా మనం జరుపుకొనే పండగలన్నిటికీ, ఏటేటా ఋతుచక్ర భ్రమణం వల్ల ప్రకృతిలో జరిగే మార్పులతో లంకె ఉంటుంది. ఫాల్గుణ పూర్ణిమ నాటికి దక్షిణ భారతంలో చెప్పు కోదగ్గ మార్పులేమీ ప్రకృతిలో కనబడవు. కానీ ఉత్తర భారతంలో మాత్రం ఫాల్గుణమంటే, ఎముకలు కొరికే చలి పీడ దూరమై, స్తబ్దత తొలగే సమయం. వసంతం కూతవేటు దూరంలోకి వచ్చి, వసంత శోభ అంకురాలు కనిపించే సమయం. అందుకే ఉత్తర భారతంలో హోలీ పండగ దీపావళి తరవాత అంత పెద్ద పండగ.

జ్యోతిర్మయం

దక్షిణ భారత సంప్రదాయంలో మనకు ఫాల్గుణ పౌర్ణమి ప్రధానంగా కామదహన పౌర్ణమి. సాగర మథన సందర్భంలో క్షీరాబ్ధి కన్యక అవతరించిన తిథి కనక మనకు ఫాల్గుణ పౌర్ణమి... మహాలక్ష్మి జయంతి పర్వదినం. మహాలక్ష్మి పుట్టిన రోజే, మధుర మీనాక్షీ సుందరేశ్వరుల పెళ్లి రోజు కావటం మరొక విశేషం.

మనం పండగలు జరుపుకొనే విధానాలలో మన పెద్దలు కర్మ, భక్తి, జ్ఞాన యోగాలకు మూడింటికి సంబంధించిన సంప్రదాయాలు ఇమిడ్చి ఉంచటం కనిపిస్తుంది. కర్మలలో అభిరుచి కలవారి కోసం ప్రతి పండగపూటా ఆచరించాల్సిన కొన్ని సాధారణ విధులు– తలంట్లూ, కొత్త బట్టలూ, దైవ ప్రార్థనలూ వంటివి ఉంటాయి. వాటితోపాటు, ఒక్కో పండగకు యథా శక్తి ఆచరించవలసిన కొన్ని ప్రత్యేకమైన తంతులు కూడా ఏర్పడి ఉన్నాయి. ఫాల్గుణ పూర్ణిమ నాటి సాయంత్రం హోలీ మంటలు వేయటం, వాటి చుట్టూ సామూ హికంగా నృత్యగానాలు జరపటం, ఆ మర్నాడు అందుబాటులో ఉన్న బంధుమిత్రులు అందరితో ఒకరిపై ఒకరు రంగులు జల్లుకొంటూ సరసాలాడుకొంటూ పరస్పర సౌహార్దం ప్రకటించు కోవడం, వాళ్ళతో విందులూ వినోదాలూ జరుపుకోవడం వంటివి హోలీ పండగ నాటి ప్రత్యేక విధులు.

భక్తి యోగులకయితే, హోలీ నెగళ్ళు కూడా భగవల్లీలల సంస్మరణే. భక్తాగ్రణి ప్రహ్లాదుడిని చంపబోయి తన దుర్మార్గానికి తానే ఆహుతయిన హోలికా రాక్షసి పురాణ కథను ఆ మంటలు గుర్తుకు తెస్తాయి. కామదేవుడిని కంటి చూపుతో దహించిన కైలాస నాథుడి కథను స్మృతికి తెస్తాయి.

అరిషడ్వర్గంలో ప్రథమం, ప్రధానం అయిన కామాన్ని కాల్చి వేసి, మనసును నియంత్రించి, ఏకాగ్రతతో సాధన సాగించమన్న సందేశానికి హోలీ నెగళ్లు ప్రతీక! జ్ఞానయోగ సాధకులకు దీనినే జ్ఞాపకం చేస్తుంది.

– ఎం. మారుతి శాస్త్రి
(నేడు హోలీ పర్వదినం)

మీ తప్పు ఒప్పుకునేదెప్పుడు బాబూ?

2017-18 ప్రకారం నిధులివ్వాలని వైఎస్ జగన్ ప్రభుత్వం కోరుతున్నా కేంద్రం కొర్రీలు

- నిర్మాణం దక్కగానే రూ.3,302 కోట్ల విలువైన పనులు రామోజీ వియ్యంకుడికి కట్టబెట్టిన బాబు
- రూ.150 కోట్ల విలువైన పనులు యనమల బావమరిదికి... రెండూ నామినేషన్‌పైనే
- అధికంగా కమిషన్లు వచ్చే మట్టి తవ్వకం, మాస్ కాంక్రీట్ పనులకే ప్రాధాన్యమిచ్చిన తీరు
- వరద మళ్లించడానికి స్పిల్ వే, కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేయకుండానే డయాఫ్రమ్ వాల్ పనులు
- 2019 ఏప్రిల్ నాటికి స్పిల్ వే, కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేయకుండా చేతులెత్తేసిన చంద్రబాబు
- దాంతో 2019 వరదల ఉధృతికి.. డయాఫ్రమ్ వాల్ నిర్మాణ ప్రాంతం దెబ్బతిని అగాధాలు
- దీని వల్లే పోలవరం పనుల్లో తీవ్ర జాప్యం... నేటికీ వాటిని అంగీకరించలేని ఎల్లో మీడియా
- బాబు తప్పులను సరిదిద్దుతూ ముందుకెళుతున్న జగన్... రాష్ట్ర ఖజానా నుంచే నిధులు
- కరోనా పరిస్థితుల్లోనూ అప్రోచ్ ఛానల్, స్పిల్ వే, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ కాఫర్ డ్యామ్ పూర్తి
- ఇలా ఖర్చుచేసిన రూ.2,948 కోట్లను రీయింబర్స్ చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్న కేంద్రం
- డయాఫ్రమ్ వాల్ దెబ్బతినకపోయి ఉంటే 2021 నాటికే జగన్ పోలవరాన్ని పూర్తి చేసేవారంటున్న అధికారులు

ఓ రెండేళ్ల కిందటి ఫొటో ప్రచురించి తెలుగుదేశం అధికార ప్రతినిధి పట్టాభిని పోలీసులు కొట్టేశారంటూ రాసిన 'ఈనాడు'... ఆ తరువాతి రోజు అది తప్పని ఒప్పకుంది. కాకపోతే కొట్టారని రాసిన కథ.. మొదటి పేజీలో బ్యానర్. పొరపాటైపోయిందంటూ వేసిన సవరణ... కనీకనిపించని విధంగా లోపలి పేజీల్లో ఓ సింగిల్ కాలమ్!!.

పోలవరం వ్యవహారంలోనూ అంతే. ప్రపంచంలో ఎవ్వరూ కక్కుర్తిపడని రీతిలో కమీషన్ల కోసం చేయాల్సిన పనులన్నీ వెనక్కి నెట్టేసి... చేయకూడని పనులన్నిటినీ ముందుకు తెచ్చింది చంద్రబాబు నాయుడు. పైపెచ్చు ఆ పనుల్ని కూడా రామోజీ వియ్యంకుడు, యనమల బావమరిది... ఇలా బంధుగణానికి నామినేషన్ పద్ధతిలో సంతర్పణ చేసేశారన్నదీ నిజం. చంద్రబాబు అనుసరించిన ఈ డీపీటీ (దోచుకో పంచుకో తినుకో) విధానం వల్ల పోలవరం చంద్రబాబుకు ఏటీఎంగా మారిపోయిందని సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీయే అన్నారంటే వీళ్లు ఎంతకు తెగించారో అర్థం చేసుకోవచ్చు. ఇలా చేయటం వల్ల డయాఫ్రమ్ వాల్ దెబ్బతిని.. పోలవరం ప్రాజెక్టు యావత్తూ వెనక్కెళ్లిపోయింది. పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ జాప్యానికి మానవ తప్పిదమే కారణమని ఎన్‌హెచ్‌పీసీ, డీడీఆర్‌పీ, నిపుణులు, అధికారులు పదేపదే చెప్పారు. ఆ మానవుడు చంద్రబాబేనని కూడా అందరికీ తెలుసు. కానీ రామోజీరావు ఒక్క ముక్క రాస్తే ఒట్టు!!. పైపెచ్చు తప్పంతా వైఎస్ జగన్ ప్రభుత్వానిదేనన్నట్టుగా రాతలు?

చంద్రబాబు పాపాల వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ పోలవరాన్ని పూర్తి చేయడానికి వడివడిగా అడుగులేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను... పనిగట్టుకుని మరీ విమర్శిస్తున్న 'ఈనాడు' కథనాల్లోని డొల్లతనం ఇదిగో...



ఏది నిజం ?

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దిక్సూచిలా నిలిచే పోలవరం బహుళార్థకసాధక ప్రాజెక్టు పనుల్లో కమీషన్ల కక్కుర్తితో నాడు చంద్రబాబు చేసిన పాపాల ఫలితం ... ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. ఆ సవాళ్లను ఒక్కొక్కటిగా అధిగమిస్తూ ప్రణాళికాయుతంగా పూర్తి చేసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వడివడిగా అడుగులేస్తున్నారు. కరోనా సంక్షోభాన్ని, ఆర్థిక ఇబ్బందులను సైతం అధిగమిస్తూ ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టిస్తున్నారు. ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తన నిధుల్లోంచి ఖర్చు చేసిన రూ.2,948.04 కోట్లను రీయింబర్స్ చేయడంలో కేంద్రం అలవికాని జాప్యం చేస్తోంది. అసలే ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రానికి ఇది మరింత ఇబ్బంది కలిగించేదే అయినప్పటికీ... వీలైనంతగా రాష్ట్ర ఖజానా నుంచే పోలవరానికి నిధులు విడుదల చేస్తూ ముందుకెళుతున్నారు. కమీషన్ల కక్కుర్తితో చంద్రబాబు పాల్పడిన పాపాల వల్ల గోదావరి వరదల ఉధృతికి ప్రధాన డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతం కోతకు గురైంది. దీని వల్లే పోలవరం పనులు ముందుకెళ్లకుండా ఆగిపోయాయి. లేదంటే 2021 నాటికే పోలవరం ప్రాజెక్టును సీఎం వైఎస్ జగన్ పూర్తి చేసేవారనేది జలవనరుల శాఖ అధికారులు, నీటిపారుదలరంగ నిపుణులు ఘంటాపథంగా చెబుతున్న మాట. దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్, ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో కోతకు గురైన ప్రాంతాన్ని యథాపూర్వ స్థితికి తెచ్చేందుకు సీడబ్ల్యూసీ, ఎన్‌హెచ్‌పీసీ, ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నిపుణులతో గత 15 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. వారంతా ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్నారు. కాకపోతే ఆదివారం నాడు ఈ సమస్యకు డీడీఆర్పీ పరిష్కార మార్గం చూపించింది. దీంతో డయాఫ్రమ్ వాల్‌ను సరిదిద్ది, కోతకు గురైన ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతాన్ని యథాపూర్వ స్థితికి తెచ్చి... సత్వరమే ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సీఎం వైఎస్ జగన్ చర్యలు చేపట్టారు.

31 నెలలు తట్టెడు మట్టి కూడా పోయని టీడీపీ సర్కార్

- పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి, వంద శాతం వ్యయాన్ని భరించి.. అన్ని అనుమతులు తెచ్చి తామే పూర్తి చేస్తామని కేంద్రం పార్లమెంటులో హామీనిచ్చింది. విభజన చట్టంలోనూ ఈ అంశాన్ని పొందుపరిచింది. ఆ మేరకు ప్రాజెక్టును పూర్తి చేయడం కోసం పోలవరం ప్రాజెక్టు అథారిటీని (పీపీఏ) 2014, మే 28న ఏర్పాటు చేసి.. ఆ సంస్థతో ఒప్పందం చేసుకోవాలని నాటి టీడీపీ సర్కార్‌ను కోరుతూ వచ్చింది.
- కేంద్రమే నేరుగా ప్రాజెక్టు కడితే జనానికి ప్రాజెక్టు వస్తుంది తప్ప తనకేమొస్తుందని భావించారు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. తాను గనక తనకు నచ్చిన వారికి కాంట్రాక్టుకు ఇస్తే కావాల్సినంత కమీషన్లు వస్తాయని భావించారు. అందుకే పీపీఏతో ఒప్పందం చేసుకోకుండా కాలయాపన చేస్తూ వచ్చారు.
- చివరకు పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికే అప్పగించాలని కేంద్రాన్ని కోరారు. అలా గనక చేస్తే... తాను కేంద్రం వద్ద ప్రత్యేక హోదా మాట ఎత్తనని లోపాయికారీగా హామీ ఇచ్చారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదం చేసే ప్రత్యేక హోదాను చంద్రబాబు తాకట్టు పెట్టేయడంతో... 2016, సెప్టెంబరు 7న అర్ధరాత్రి పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అప్పగించింది.
- ఆ వెంటనే పోలవరం జలాశయం పనుల్లో రూ.3,302 కోట్ల విలువైన పనులను ఈనాడు రామోజీరావు వియ్యంకుడికి చెందిన నవయుగ సంస్థకు నామినేషన్ పద్ధతిపై కట్టబెట్టేశారు చంద్రబాబు నాయుడు. అంతేకాక మరో రూ.150 కోట్ల విలువైన ఎడమ కాలువలోని పనులను నాటి ఆర్థిక మంత్రి యనమల బావమరిది పుట్టా సుధాకర్ యాదవ్‌కు నామినేషన్‌పై ఇచ్చేశారు. ఇలా పందేరాలు జరిగిపోయాక... 2016, సెప్టెంబరు 30న పనులు చేపట్టారు. అంటే అధికారం చేపట్టినప్పటి నుంచి 31 నెలలపాటు పోలవరంలో తట్టెడు మట్టి కూడా టీడీపీ సర్కార్ ఎత్తలేదన్న మాట. ➤ చంద్రబాబు నాయుడు చేసిన ఇంకో ఘోరమైన తప్పిదమేంటంటే... 2013–14 నాటి ధరల ప్రకారం నిధులిస్తే చాలని ప్రధానికి లేఖ రాయటం. నిజానికి ఎలాంటి ప్రాజెక్టు అయినా... ఎంత ప్రతిష్ఠాత్మకమైనది అయినా కాలం గడుస్తున్న కొద్దీ ముందుగా వేసిన అంచనా వ్యయం పెరుగుతుంది. అది నాగార్జున సాగర్‌కైనా.. శ్రీశైలానికైనా కూడా!!. పోలవరానికీ అంతే. 2013–14లో ఉన్న ధరలు ఇప్పుడెందుకు ఉంటాయి? అన్నిరకాల సామగ్రి, లేబర్ చార్జీలు అప్పటితో పోలిస్తే రెట్టింపుకన్నా ఎక్కువే పెరిగాయి.
- కానీ చంద్రబాబు నాయుడు నాటి ధరల ప్రకారం నిధులిస్తే చాలని ఏకంగా లేఖ రాసేయటంతో... ఇప్పుడు తాజా ధరల ప్రకారం నిధులడిగిన ప్రతిసారీ కేంద్రం సవాలక్ష కొర్రీలు పెడుతోంది. అసలు చంద్రబాబు ఇలా ఎందుకు చేశారు? ఎందుకంటే... ఆయనకు కమీషన్లు వస్తే చాలనుకున్నారు. అన్నిటికీ ఒప్పేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వానికే నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తారు కనక... కావలసినంత పిండుకోవచ్చన్నది ఆయన ఆలోచనల పిండితార్థం.
- ఇక అస్మదీయులకు పనులు అప్పగించటంలోనూ బాబు తన చేతివాటాన్ని చూపించారు. ప్రాధాన్య పనులు పక్కనబెట్టేసి... అధికంగా లాభాలు వచ్చే మట్టి తవ్వకం, స్పిల్ వేలో కాంక్రీట్ పోయడం వంటి పనులు ముందుగా చేపట్టారు. భారీగా కమీషన్లు దండుకున్నారు.

ప్రణాళికా రాహిత్యం వల్లే డయాఫ్రమ్‌వాల్‌కు దెబ్బ

- గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా అప్రోచ్ ఛానల్, స్పిల్ వే, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్ పనులు పూర్తి చేసి.. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు కట్టాలి. ఈలోగా 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని 20,946 కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. ఆ తర్వాతే ప్రధాన(ఎర్త్ కమ్ రాక్ ఫిల్–ఈసీఆర్ఎఫ్) డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్ నిర్మించాలి. కానీ.. చంద్రబాబు మాత్రం వరదను మళ్లించేలా అప్రోచ్ ఛానల్, స్పిల్ వే, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్ పూర్తి చేయకుండానే.. ప్రధాన డ్యామ్ డయాఫ్రమ్ వాల్‌ను 2018 నాటికే చంద్రబాబు పూర్తి చేశారు. ఆ తర్వాత ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు చేపట్టి... వాటిని పూర్తి చేయలేక... ఇరు వైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేసి చేతులెత్తేశారు. దాంతో 2400 మీటర్లు వెడల్పుతో ప్రవహించాల్సిన గోదావరి.. ఎగువ కాఫర్ డ్యామ్‌కు ఇరువైపులా వదిలిన ఖాళీ ప్రదేశాలు 800 మీటర్లకు కుంచించుకుపోయి ప్రవహించాల్సి వచ్చింది.
- ఎక్కువ నీరు తక్కువ ఖాళీ లోంచి ప్రవహించాల్సి వచ్చినపుడు ఏం జరుగుతుంది? ఉధృతి పెరుగుతుంది కదా!.
- ఇదిగో... 2019, అక్టోబర్ 1న గోదావరికి దాదాపు 14 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. అది ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా ప్రవహించాల్సి వచ్చింది. సెకనుకు 13 మీటర్ల వేగంతో వరద ఉధృతంగా రావటంతో డయాఫ్రమ్ వాల్ ఘోరంగా దెబ్బతింది. ➤ ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసి, స్పిల్ వే మీదుగా వరద నీటిని మళ్లించి ఉంటే.. అసలు డయాఫ్రమ్ వాల్ మీదికి అంత వరద వచ్చి ఉండేదే కాదు. అది దెబ్బతినే పరిస్థితే వచ్చేది కాదు. ➤ గోదావరి వరద ఉధృతి వల్ల ప్రధాన డ్యామ్ గ్యాప్–1 నిర్మాణ ప్రాంతంలో నదీ గర్భం +23 మీటర్ల నుంచి –12.00 మీ. వరకు అంటే దాదాపు 35 మీటర్ల మందంతో కోతకు గురైంది. గ్యాప్–2లో + 8 మీటర్ల నుంచి –12 మీటర్ల వరకు అంటే దాదాపు 20 మీటర్ల మందంతో, దిగువ కాఫర్ డ్యాంలో 36.5 మీటర్ల మందంతో గోదావరి గర్భం కోతకు గురైంది. గోదావరి వరద ఉధృతికి స్పిల్ ఛానల్ లోని కాంక్రీటు బ్లాకులు(దిమ్మెలు) కొట్టుకుపోయాయి.
- నిర్వాసితులకు పునరావాసం కల్పించే పనుల్లో కమీషన్లు రావు కనక చంద్రబాబు వారిని పట్టించుకుంటే ఒట్టు. ఐదేళ్లలో పునరావాసానికి బాబు సర్కారు కేవలం రూ.484 కోట్లు ఖర్చు పెట్టిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇలా కేవలం 3,110 కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించడంతో ... 2019లో కాఫర్ డ్యామ్ వల్ల గోదావరి వరద ఎగదన్నడంతో నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

చంద్రబాబు తప్పులు సరిదిద్దుతూ..

- చంద్రబాబు పాపాల ఫలితాన్ని సరిదిదిద్దుతూ పోలవరాన్ని ప్రణాళికాయుతంగా పూర్తి చేయడానికి సీఎం వైఎస్ జగన్ యాక్షన్ ప్లాన్ రచించి.. అమలు చేస్తున్నారు.
- కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ... ఆర్థిక ఇబ్బందులను అధిగమించి.. 48 గేట్లతో సహా స్పిల్ వేను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. ఎగువ కాఫర్ డ్యామ్‌ను, అప్రోచ్ ఛానల్, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్‌లను పూర్తి చేసి.. 2021, జూలై 11న గోదావరి ప్రవాహాన్ని 6.1 కిమీల పొడవున మళ్లించి చరిత్ర సృష్టించారు.
- కమీషన్ల కక్కుర్తితో చంద్రబాబు చేపట్టిన పనుల వల్ల దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురైన ప్రాంతాన్ని పూడ్చే విధానాన్ని ఖరారు చేయడంపై డీడీఆర్పీ, సీడబ్ల్యూసీతో 2020 నుంచి రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతూనే ఉంది. 2022, ఏప్రిల్‌లో విధానాన్ని ఖరారు చేయడంతో.. దాని ప్రకారం 2022, జూలై 9 నాటికే 20 మీటర్ల ఎత్తుతో దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసింది. వరదలు తగ్గాక పనులు చేపట్టి ఫిబ్రవరి 15 నాటికి 31.5 మీటర్ల ఎత్తుతో దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసింది. కాబట్టి ఇక గోదావరికి ఎంత పెద్ద వరద వచ్చినా నిశ్చింతగా ప్రధాన డ్యామ్ పనులను చేపట్టవచ్చు.
- ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తయిన నేపథ్యంలో ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో నిల్వ ఉన్న నీటిని పంపులతో తోడివేస్తూ.. డీడీఆర్పీ, సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు కోతకు గురైన ప్రాంతాన్ని పూడ్చి, యథాస్థితికి తెచ్చే పనులను ప్రభుత్వం ముమ్మరం చేసింది.
- టీడీపీ సర్కార్ ప్రణాళికారాహిత్యం, అవినీతితో చేపట్టిన పనుల వల్ల దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను ఎలా సరిచేయాలనే అంశంపై 15 నెలలుగా డీడీఆర్పీ, సీడబ్ల్యూసీ, ఐఐటీ(తిరుపతి, చెన్నై, ఢిల్లీ) ప్రొఫెసర్లు, ఎన్‌హెచ్‌పీసీతో రాష్ట్ర ప్రభుత్వం మేధోమథనం చేస్తోంది. సీడబ్ల్యూసీ సూచన మేరకు డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చే బాధ్యతను ఎన్‌హెచ్‌పీసీకి ప్రభుత్వం అప్పగించింది. జనవరి 26 నుంచి ఫిబ్రవరి 10 వరకూ నాలుగు రకాల పరీక్షలు చేసిన ఎన్‌హెచ్‌పీసీ.. కోతకు గురైన ప్రాంతంలో డయాఫ్రమ్ వాల్ ఎడమ వైపున 188, కుడి వైపున 200 మీటర్ల పొడవున పూర్తిగా దెబ్బతిందని తేల్చింది. మరో రెండు చోట్ల 20 మీటర్ల లోతు వరకూ దెబ్బతిందని పేర్కొంది.
- ఎన్‌హెచ్‌పీసీ నివేదిక ఆధారంగా శనివారం క్షేత్ర స్థాయిలో డయాఫ్రమ్ వాల్‌ను పరిశీలించిన డీడీఆర్పీ.. ఆదివారం దిద్దుబాటుకు మార్గదర్శకాలు జారీ చేసింది. కోతకు గురైన ప్రాంతంలో డయాఫ్రమ్‌వాల్‌కు సమాంతరంగా కొత్తగా నిర్మించి, పాత దానితో కలపడం... మిగతా చోట్ల ఐదు మీటర్ల లోతు నుంచి డయాఫ్రమ్ వాల్‌కు ఇరువైపులా బంకమట్టిని కూర్చి.. దానిపై ప్రధాన డ్యామ్ నిర్మించాలని మార్గనిర్దేశం చేసింది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలను ఇసుకతో పూడ్చి, వైబ్రో కాంపాక్షన్ ద్వారా యథాస్థితికి తేవాలని సూచించింది.
- డీడీఆర్పీ సూచించిన మేరకు సీడబ్ల్యూసీ మార్గదర్శకాల ఆధారంగా డయాఫ్రమ్‌వాల్‌ను పటిష్ఠవంతం చేయడం, ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలను పూడ్చి.. ఆ తర్వాత ప్రధాన డ్యామ్‌ను పూర్తి చేసి.. పోలవరం ఫలాలను రైతులకు అందించే దిశగా సీఎం వైఎస్ జగన్ వడివడిగా అడుగులు వేస్తున్నారు.

నిర్వాసితుల పునరావాసంపై ప్రత్యేక దృష్టి

సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక నిర్వాసితుల పునరావాసంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మూడేళ్లలోనే రూ.1677 కోట్లు ఖర్చు పెట్టి 8446 కుటుంబాలకు పునరావాసం కల్పించింది. రానున్న రెండు మూడు నెలల్లో రూ.525 కోట్లతో మిగిలిన పునరావాసం పనులు పూర్తి చేసి, 9390 కుటుంబాలకు పునరావాసం కల్పించేలా అడుగులు వేస్తున్నారు. తద్వారా 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులు అందరికీ పునరావాసం కల్పించడానికి సిద్ధమయ్యారు. ఆ తర్వాత గరిష్ఠ నీటి మట్టం 45.72 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తారు.

ఇదీ... బాబు చేసిన ద్రోహం

- పోలవరం నిర్మాణ బాధ్యతలను అప్పగిస్తూనే 2016, సెప్టెంబరు 7న అర్ధరాత్రి నాటి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ చేసిన ప్రకటనలో.. 2013–14 ధరల ప్రకారం నీటిపారుదల విభాగంలో మిగిలిన వ్యయాన్ని మాత్రమే భరిస్తామని మెలిక పెట్టారు. దానికి నాడు చంద్రబాబు అంగీకరించారు. ➤ 2016, సెప్టెంబరు 26న పోలవరానికి నాబార్డు నుంచి రూ.1981.54 కోట్ల రుణాన్ని విడుదల చేస్తూ.. ఇకపై బడ్జెట్ ద్వారా కాకుండా నాబార్డు రుణం రూపంలోనే నిధులు విడుదల చేస్తామని కేంద్రం పెట్టిన మెలికకు చంద్రబాబు అంగీకరించారు.
- 2016, సెప్టెంబరు 30న కేంద్ర ఆర్థిక శాఖ.. కేంద్ర కేంద్ర జలశక్తి శాఖకు పంపిన మెమొరాండంలో 2014, ఏప్రిల్ 1 నాటికి పోలవరం ప్రాజెక్టులో మిగిలిపోయిన నీటిపారుదల విభాగం పనులకు అయ్యే వంద శాతం వ్యయాన్ని మాత్రమే ఇస్తామని పునరుద్ఘాటించింది.
- ఆ తర్వాత ఐదున్నర నెలలకు 2017, మార్చి 15న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో.. 2014, ఏప్రిల్ 1 నాటికి పోలవరం ప్రాజెక్టు పనుల్లో మిగిలిపోయిన నీటిపారుదల విభాగం పనులకయ్యే వంద శాతం వ్యయాన్ని మాత్రమే ఇస్తామని.. అది ఎంతన్నది పోలవరం ప్రాజెక్టు అథారిటీ మదింపు చేస్తుందని.. ఆ ప్రకారమే నిధులు ఇస్తామని స్పష్టం చేసింది. ఆ సమావేశంలో ఉన్న టీడీపీకి చెందిన మంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనాచౌదరిలు నోరుమెదపలేదు.
- 2014, ఏప్రిల్ 1 నాటికి నీటిపారుదల విభాగం వ్యయంలో మిగిలిన మొత్తాన్ని మాత్రమే రీయింబర్స్ చేస్తామని.. అంతకంటే అంచనా వ్యయం పెరిగితే .. దాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని 2017, మే 8న రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర జల్ శక్తి శాఖ లేఖ రాసినా చంద్రబాబు స్పందించలేదు.
- 2016, సెప్టెంబరు 30న కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన మెమొరాండం ప్రకారం 2014, ఏప్రిల్ 1 నాటి ధరల ప్రకారం సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదనలను సీడబ్ల్యూసీకి పంపామని.. వాటిని ఆమోదించి.. నిధులు ఇవ్వాలంటూ 2018, జనవరి 12న నాటి సీఎం చంద్రబాబు ప్రధానికి లేఖ రాశారు.
- 2013–14 ధరల ప్రకారం పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.30,610 కోట్లు. ఇందులో ఇప్పటివరకూ చేసిన ఖర్చు రూ.20,702 కోట్లు మినహాయిస్తే ఇంక కేంద్రం ఇవ్వాల్సింది కేవలం రూ.9,908 కోట్లు మాత్రమే.
- జాతీయ ప్రాజెక్టుల మార్గదర్శకాల ప్రకారం ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ప్రతి మూడేళ్లకు ఒక సారి సవరించాలి. కానీ.. చంద్రబాబు వాటికి విరుద్ధంగా 2013–14 ధరల ప్రకారం నిధులు ఇస్తే చాలని ప్రధానికి లేఖ రాయడం గమనార్హం.
- 2017–18 ధరల ప్రకారం పోలవరం అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లుగా సీడబ్ల్యూసీ టీఏసీ ఆమోదించింది. ఇందులో భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం కల్పన వ్యయమే రూ. 33,168.23 కోట్లు. కానీ.. 2013–14 ధరల ప్రకారం నిధులు ఇస్తే చాలని నాటి సీఎం చంద్రబాబు ప్రధానికి లేఖ రాయడం గమనార్హం. 2013–14 ధరల ప్రకారం చూస్తే ఇప్పటిదాకా చేసిన వ్యయంపోనూ ఇంక రావాల్సింది కేవలం రూ. 9,908 కోట్లే. ఈ స్థితిలో పోలవరం ప్రాజెక్టు ఎలా పూర్తవుతుందన్నది చంద్రబాబుకే తెలియాలి.
- బాబు నిర్వాకం వల్ల పోలవరం ప్రాజెక్టుకు తీవ్ర నిధుల కొరత ఎదురవుతోంది. 2017–18 ధరల ప్రకారం సీడబ్ల్యూసీ టీఏసీ ఆమోదించిన సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లకు ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ ఇచ్చి.. నిధులు విడుదల చేయాలని గత 45 నెలలుగా ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ, జల్ శక్తి శాఖ మంత్రులను సీఎం జగన్ కోరుతూ వస్తున్నారు.



ప్రకృతి సాగు.. ఆదాయం బాగు

- ఎకరం కౌలుకు తీసుకొని బహుళ పంటల సాగు
- పెట్టుబడికి నాలుగైదు రెట్లు ఆదాయం
- ప్రకృతి సాగులో లాభాలు గడిస్తున్న ఓబుల్‌రెడ్డి

సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లా ఆకుల గణప వరానికి చెందిన ఓబుల్‌రెడ్డి ఓ సాధారణ వ్యాపారి. ద్విచక్ర వాహనంపై ఊరూరా తిరుగుతూ ఎలక్ట్రిక్ వస్తువులను అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. వ్యాపారం కలిసిరాక అప్పుల పాలై నాలుగేళ్ల క్రితం వ్యవసాయం వైపు మళ్లాడు. ఎకరం భూమిని కౌలుకు తీసుకున్నాడు. బహుళ పంటలు పండిస్తే వ్యవసాయం కూడా లాభసాటిగా ఉంటుందని నిరూపిస్తున్నాడు. తొలి మూడేళ్లు పత్తితో పాటు బీర, సొర, దోస, కాకర వంటి కూరగాయలతోపాటు ఆకు కూరలు, బంతి పంటను సాగు చేశాడు. రూ.35 వేల పెట్టుబడితో సాగు చేసి రూ.1.80 లక్షల చొప్పున ఆర్జించాడు.

విరగ పండిన మిరప


ఓబుల్‌రెడ్డి ఈ ఏడాది మిరప పంట వేశాడు. నల్ల తామర పురుగు బారిన పడకుండా పంటను కాపాడుకునేందుకు వేప గింజల కషాయం, దోమ నివారణకు తూటికాడ కషాయం పిచికారీ చేశాడు. మొక్క ఎదుగుదలకు కోడి గుడ్డు, నిమ్మరస ద్రావణం, చేప, బెల్లం ద్రావణం, తెగుళ్ల నివారణకు పుల్లటి మజ్జిగ స్ప్రే చేయడంతో పంట ఏపుగా ఎదిగింది. కషాయాలు, కలుపుతీత, పీఎండీ విత్తనాలకు రూ.35 వేలు, కోతలకు రూ.1.20 లక్షలు, కౌలుకు రూ.12 వేల చొప్పున మొత్తం రూ.1.67 లక్షలు పెట్టుబడి పెట్టాడు. తొలి కోతలోనే 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అత్తలూరు రైతు ఉత్పత్తిదారుల సంఘం మార్కెట్ ధర కంటే క్వింటాల్‌కు రూ.3 వేల అదనంగా చెల్లించి.. రూ.23 వేల చొప్పున కొనుగోలు చేస్తోంది. మిగిలిన రెండు కోతల్లో మరో 15నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా. ఈ లెక్కన ఒక్క మిరపకే రూ.7 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం కన్పిస్తోంది. పెట్టుబడి పోను రూ.5.30 లక్షల వరకు మిగులుతుండటంతో ఓబుల్‌రెడ్డి ఆనందానికి అవధులు లేవు.

అప్పులన్నీ తీర్చేశా

వ్యాపారం కలిసిరాక అప్పుల పాలయ్యా. భూమిని నమ్ముకుని అప్పులన్నీ తీర్చేశా. కష్టానికి తగ్గ ప్రతిఫలం లభిస్తోంది. రసాయన రహితంగా పండించిన మిరపను కొనేందుకు పోటీ పడుతున్నారు. మంచిరేటు వస్తోంది. పెట్టుబడికి 4 రెట్లు ఆదాయం ఆర్జించగలుగుతున్నా.
– ఓబుల్‌రెడ్డి, గణపవరం, పల్నాడు జిల్లా



'సామినేని' విగ్రహం విషయంలో జోక్యానికి హైకోర్టు నిరాకరణ



సాక్షి, అమరావతి: ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన సామినేని విశ్వనాథం విగ్రహం విషయంలో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. ప్రభుత్వ వాదనలు వినకుండా విగ్రహం తొలగింపు విషయంలో ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేమని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి, మున్సిపల్ కమిషనర్ తదితరులను ఆదేశించింది. ఇప్పటికే విగ్రహం ఏర్పాటు చేసిన నేపథ్యంలో యథాతథస్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని మాత్రమే చెప్పగలమని పేర్కొంది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్‌ల ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. బస్టాండ్‌లోకి రాకపోకలు సాగించే మార్గంలో స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తన తండ్రి సామినేని విశ్వనాథం విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ఇలా రోడ్లపై విగ్రహాలు ఏర్పాటు చేయడం సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధమని తాళ్లూరు గ్రామానికి చెందిన బొల్లా రామకృష్ణ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సోమవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. విగ్రహం విషయంలో యథాతథ స్థితిని కొనసాగించాలని ధర్మాసనం ఆదేశించింది. ప్రతివాదుల వాదనలు వినకుండా విగ్రహం తొలగింపు విషయంలో ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేమని తేల్చి చెప్పింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశిస్తూ తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

చంద్రబాబుకు స్వప్రయోజనాలు తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవు

రిలే నిరాహార దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు



తాడికొండ: రాజధాని పేరుతో చంద్రబాబు చేసిన దోపిడీని, ఆయన డొల్లతనాన్ని బయట పెట్టేందుకే బహుజన పరిరక్షణ సమితి ఉద్యమం కొనసాగుతోందని బహుజన పరిరక్షణ సమితి నేతలు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 890వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో సోమవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అమరావతిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేసి అధికారంలోకి వచ్చేందుకు బాబు చేస్తున్న కుటిల పన్నాగాలు ఎప్పటికీ ఫలించవని, ఇప్పటికే 29 గ్రామాల్లో అరాచకాలు చేసిన బాబు.. మళ్లీ అధికారంలోకొస్తే రాష్ట్ర భవిష్యత్తును సర్వనాశనం చేస్తాడని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి చతికిల పడిందంటూ దుష్ప్రచారం చేసిన బాబు అండ్ కోకు.. విశాఖ కేంద్రంగా జరిగిన గ్లోబల్ సమ్మిట్‌తో మైండ్ బ్లాక్ అయిందన్నారు. చంద్రబాబుకు స్వప్రయోజనాలు తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తూ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

తెప్పలపై దేవేరులతో మలయప్పస్వామి

తిరుమల: శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు తెప్పపై విహరించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మాడ వీధుల్లో ఊరేగించి శ్రీవారి పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు ఆశీనులై పుష్కరిణిలో 5 చుట్లు విహరించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల వేదపారాయణం, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంకీర్తనల మధ్య తెప్పోత్సవం నేత్రపర్వంగా జరిగింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిథల్ తెప్పోత్సవంలో పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 74,799 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.59 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టోకెట్లు ఉన్నవారికి సకాలంలో, దర్శన టోకెట్లు లేని వారికి 14 గంటల సమయం పడుతోంది.

శ్రీవారి సేవలో ప్రముఖులు

శ్రీవారిని సోమవారం సినీ నటుడు మంచు మనోజ్ దంపతులు, మంచు లక్ష్మి, తెలంగాణ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి దర్శించుకున్నారు.

కర్నూలు జిల్లాలో ఇళ్లకు నెర్రెలు

- భూకంపమని గ్రామస్తుల భయాందోళన

తుగ్గలి (కర్నూలు): మండల పరిధిలోని రాతన గ్రామంలో సోమవారం కొన్ని ఇళ్లకు నెర్రెలు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కొంతసేపటికి భూకంపంగా ప్రచారం జరిగింది. ఉదయం 7గంటల సమయంలో గ్రామంలోని పోస్టాఫీసు వీధిలో సలీంబాషా, ఉప్పర గోవిందు, నాగయ్య, బాషాకు చెందిన ఇళ్లలో కొద్దిపాటి శబ్దంతో పలు చోట్ల గోడలకు బీటలు ఏర్పడినట్లు ఇంటి యజమానులు తెలిపారు. మధ్యాహ్నం 3గంటల తరువాత విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, తహసీల్దారు రవి బీటలు వారిన ఇళ్లను పరిశీలించారు.

క్లుప్తంగా...

త్రిపుర పీఠం సాహాకే!

బీజేపీ ఎల్పీ నేతగా ఎంపిక



అగర్తలా: బీజేపీ నేత, తాజా మాజీ సీఎం మాణిక్ సాహా త్రిపుర సీఎం పదవిని మరోసారి చేపట్టేందుకు మార్గం సుగమమైంది. సోమవారం త్రిపుర బీజేపీ శాసనసభా పక్ష(ఎల్పీ) సమావేశంలో నూతనంగా ఎన్నికైన మొత్తం 32 మంది బీజేపీ సభ్యులూ సాహాను తమ నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని పార్టీ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. అనంతరం మాణిక్ సాహా రాష్ట్ర గవర్నర్ సత్యదేవ్ నారాయణ్‌ను కలిసి, నూతన ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ నెల 8వ తేదీన జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా తదితర ప్రముఖులు హాజరయ్యే అవకాశాలున్నాయి. కేబినెట్ కూర్పుపై అస్సాం సీఎం హిమాంత బిశ్వ శర్మ ఆదివారం అగర్తలా చేరుకుని మాణిక్ సాహా సహా పలువురితో మంతనాలు జరిపారు. అనంతరం ఆయన ఢిల్లీకి వెళ్లి హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు.

హెలికాప్టర్ ల్యాండింగ్‌కు 'చెత్త' సమస్య...

యడ్యూరప్పకు తప్పిన ముప్పు



యశవంతపుర: కర్ణాటక బీజేపీ అగ్రనేత, మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ల్యాండింగ్‌కు సమస్య ఎదురైంది. ప్లాస్టిక్ కవర్లు, చెత్త అడ్డుపడటంతో కొంతసేపు గాలిలోనే చక్కర్లు కొట్టాల్సివచ్చింది. ఆయన సోమవారం జీవర్గిలో జరిగిన సభలో పాల్గొని హెలికాప్టర్‌లో కలబురిగికి వచ్చారు. తాత్కాలిక హెలిప్యాడ్ వద్ద ల్యాండ్ అవుతుండగా గాలి వేగానికి ప్లాస్టిక్ కవర్లు, చిత్తు కాగితాలు తదితర చెత్త పైకి లేచింది. అవి హెలికాప్టర్ రెక్కలకు తాకితే ప్రమాదం సంభవించే అవకాశం ఉండడంతో పైలట్ ల్యాండింగ్‌ను కొద్దిసేపు నిలిపివేశారు. పోలీసులు చెత్తాచెదారం తొలగించే వరకు గాలిలోనే చక్కర్లు కొట్టింది. ఆతర్వాత హెలికాప్టర్ సురక్షితంగా ల్యాండయ్యింది. ఇది పోలీసుల నిర్లక్ష్యమేనని ఆయన అభిమానులు ఆరోపించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరలైంది.



నాగరిక ప్రపంచంలో వివక్షకు తావులేదు. ఆడ, మగ అనే తేడా చూపడం నైతిక సూత్రాల ప్రకారమే కాదు, చట్ట ప్రకారమూ ముమ్మాటికీ నేరమే. బాలికలకు విద్యను నిరాకరించడం, వారికి చదువుకొనే అవకాశాలు దూరం చేయడం రాక్షసత్వమే అనిపించుకుంటుంది. ఇస్లామిక్ దేశమైన ఇరాన్‌లో ఇప్పుడు అచ్చంగా అలాంటిదే జరుగుతోంది. కేవలం విద్యార్థినులను లక్ష్యంగా చేసుకొని విష వాయువుల ప్రయోగానికి పాల్పడుతున్నారు. ఇదంతా ఎవరు చేస్తున్నారు, దీని వెనుక ఉన్న అసలు సూత్రధారులెవరనేది అంతుచిక్కడం లేదు. మరోవైపు దుండగుల దుశ్చర్యపై బాలికల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడేం జరుగుతోందో తెలియక వణికిపోతున్నారు. సమాజంలో అశాంతి నెలకొంటోంది. విష వాయువుల ప్రయోగాల గుట్టును రట్టు చేస్తామని, దోషులను కచ్చితంగా శిక్షిస్తామని ఇరాన్ ప్రభుత్వం హామీ ఇవ్వడం కొంత ఊరట కలిగిస్తోంది.

ఇరాన్‌లో మతోన్మాదుల రాక్షసకాండ..

విద్యపై విషం..

విద్యార్థినులపై ముష్కరుల విష వాయువు ప్రయోగాలు
కఠినంగా శిక్షిస్తామన్న ఇరాన్ అధినేత అయతుల్లా అలీ ఖమేనీ



జరిగింది ఇదీ..

- ఇరాన్‌లో 30 ప్రావిన్స్‌లు ఉండగా, 21 ప్రావిన్స్‌ల్లో 50కి పైగా పాఠశాలల్లో విష వాయువుల ప్రయోగాలు జరిగాయి.
- గత ఏడాది నవంబర్ నుంచి ఇప్పటిదాకా 50కి పైగా పాఠశాలల్లో 700 మంది విద్యార్థినులు ఈ ప్రయోగాల బారినపడినట్లు ప్రభుత్వ అధికారులు నిర్ధారించారు. అయితే, ఇప్పటివరకూ ఎవరూ ప్రాణాలు కోల్పోలేదు.
- బాధితుల్లో శ్వాస సంబంధిత సమస్యలు ఉత్పన్నమయ్యాయి.
- తలనొప్పి, వికారం, వాంతులు, తల తిరగడం, అలసట వంటి లక్షణాలు కనిపించాయి. బాధితులు కాళ్లు, కడుపులో నొప్పితో విలవిల్లాడారు.
- కొందరిలో అవయవాలు తాత్కాలికంగా మొద్దుబారిపోయినట్లు వెల్లడయ్యింది.
- దుండుగులు ప్రయో గించిన వాయువులు
- కుళ్లిన నారింజ పండ్ల వాసన, క్లోరిన్ వాసన, టాయ్‌లెట్లు శుభ్రం చేసుకొనే రసాయనాల వాసన వచ్చినట్లు బాధితులు చెప్పారు.
- ఫాతిమా రెజై అనే 11 బాలిక విష ప్రయోగం కారణంగా చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఇన్ఫెక్షన్ వల్లే మరణించిందని ఆమె కుటుంబ సభ్యులు, చికిత్స అందించిన డాక్టర్ చెప్పారు.

రగిలిన ఉద్యమం..

ఇరాన్‌లో 1979లో జరిగిన ఇస్లామిక్ విప్లవం తర్వాత మహిళలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు. బాలికలు, యువతులపై ఆంక్షలన్నీ దాదాపుగా తొలగిపోయాయి. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లి నిర్భయంగా చదువుకుంటున్నారు. పొరుగున ఉన్న అఫ్గానిస్తాన్ తరహా పరిస్థితులు ఇరాన్‌లో లేవు. బాలికల విద్యాభ్యాసాన్ని, మహిళలు ఉద్యోగాలకు వెళ్లడాన్ని తాలిబన్ ప్రభుత్వం నిషేధించడం పట్ల ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పద్ధతి మార్చుకోవాలని, మహిళలపై ఆంక్షలు ఎత్తివేయాలని తాలిబన్ పాలకులను హెచ్చరించింది కూడా. అలాంటిది ఇరాన్‌లో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. తలపై బురఖా సక్రమంగా ధరించనందుకు 22 ఏళ్ల మహసా అమీనీ అనే యువతిని గత ఏడాది సెప్టెంబర్‌లో ఇరాన్ నైతిక పోలీసులు నిర్బంధించారు. చిత్రహింసలు పెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. మూడు రోజులపాటు కోమాలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడిన అమీనీ సెప్టెంబర్ 16న మృతి చెందింది. దీంతో దేశవ్యాప్తంగా ప్రజాగ్రహం వెల్లువెత్తింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మహిళలు, యువతులు, బాలికలు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వచ్చారు. నైతిక నియమావళి పేరిట తమను అణగదొక్కుతున్నారని, గొంతు నొక్కుతున్నారని, హక్కులు హరిస్తున్నారని ఆరోపిస్తూ నెలల తరబడి ఆందోళన కొనసాగించారు. నైతిక పోలీసు వ్యవస్థను రద్దు చేయాలని నినదించారు. వారి ఆందోళన మహోగ్ర ఉద్యమంగా మారింది. మహిళల ఉద్యమం పట్ల ప్రభుత్వం దిగివచ్చింది. వారి డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. మహిళలంతా శాంతించాలని కోరింది.



ముష్కరుల ఉద్దేశం అదేనా!

మహిళలు, యువతులు, బాలికలు పెద్ద ఎత్తున ఉద్యమించడం, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి, దిగివచ్చేలా చేయడం మతోన్మాదులకు, పిడివాదులకు కంటగింపుగా మారింది. బాలికలను విద్యాసంస్థలకు వెళ్లకుండా, చదువుకోకుండా చేయడమే లక్ష్యంగా కుతంత్రానికి తెరలేపారు. భయభ్రాంతులకు గురిచేసి, ఇళ్లకే పరిమితం చేయడానికి విష వాయువుల ప్రయోగం అనే దొంగదారిని ఎంచుకున్నారు. విద్యార్థినులెవరూ రాకపోతే పాఠశాలలు మూతపడతాయన్నది వారి ఉద్దేశం. ముసుగులు ధరించి, తరగతి గదుల్లోకి హఠాత్తుగా ప్రవేశించడం, విష వాయువులు వదిలి, క్షణాల్లో మాయం కావడం.. కుట్ర మొత్తం ఇలా సాగింది. - సాక్షి, నేషనల్ డెస్క్

క్షమించరాని నేరం



ఇరాన్ పాఠశాలల్లో విష వాయువుల ప్రయోగాలు అంతర్జాతీయంగా సంచలనాత్మకంగా మారాయి. బాలికలపై విష వాయువులు ప్రయోగించడం క్షమించరాని నేరమని ఇరాన్ అధినేత అయతుల్లా అలీ ఖమేనీ చెప్పారు. గుర్తుతెలియని ముష్కరులు ఉద్దేశపూర్వ కంగానే ఈ అకృత్యాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోందని, వారిని బంధించి, చట్టం ముందు నిలబెడతామని, కఠినంగా శిక్షిస్తామని ప్రకటించారు. బాలికలపై ఇలాంటి ప్రయోగాలు చేయడం ఏకంగా మానవత్వంపై జరిగిన నేరమేనని ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ తేల్చిచెప్పారు.

డ్రెస్ కోడ్ ఉల్లంఘిస్తే శిక్షించాల్సిందే



ఇరాన్ న్యాయ వ్యవస్థ అధినేత ఘోలామ్ హుస్సేన్ మొహసెనీ ఏజీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇస్లామిక్ డ్రెస్ కోడ్ ఉల్లంఘించిన మహిళలను కఠినంగా శిక్షించాలని అన్నారు. మహిళలు హిజాబ్ తొలగించడం ఇస్లామిక్ రిపబ్లిక్ పట్ల, దాని విలువల పట్ల శత్రుత్వాన్ని ప్రదర్శించడంతో సమానం అవుతుందని చెప్పారు. అలాంటి అసాధారణ చర్యలకు పాల్పడేవారు శిక్షకు గురి కాక తప్పదని స్పష్టం చేశారు.

8 ఏళ్లప్పుడు మా నాన్న లైంగికంగా వేధించాడు

ఎన్‌సీడబ్ల్యూ సభ్యురాలు ఖుష్బూ సుందర్



చెన్నై/జైపూర్: నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ సుందర్ సంచలన విషయాలు వెల్లడించారు. ఎనిమిదేళ్ల వయస్సులో తన తండ్రే తనను లైంగికంగా వేధించారని చెప్పారు! 'మోజో స్టోరీ' డిజిటల్ వార్తా చానల్ ఇటీవల జైపూర్‌లో నిర్వహించిన 'వుయ్ ది విమెన్' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 'మా నాన్న వల్ల అమ్మ జీవితాంతం ఇబ్బందులు ఎదుర్కొంది. అమ్మను, నన్ను కొట్టేవాడు. లైంగికంగా వేధించేవాడు. ఒక మగవాడిగా దాన్ని జన్మహక్కుగా భావించేవాడు. నాకు 8 ఏళ్లప్పుడే లైంగికంగా వేధించాడు. 15 ఏళ్ల వయస్సులో ఆయన్ను ఎదిరించే ధైర్యం వచ్చింది. ఆపైన ఉన్నవన్నీ తీసేసుకుని మమ్మల్ని వదిలి వెళ్లిపోయాడు' అని గుర్తు చేసుకున్నారు. బాల్యంలో లైంగిక వేధింపులకు గురైతే అది వారిని జీవితాంతం వెంటాడుతూనే ఉంటుందని ఆవేదన వెలిబుచ్చారు.

తిహార్‌కు సిసోడియా

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానంలో అవకతవకల కేసులో అరెస్టైన ఆప్ నేత మనీశ్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని మరో 14 రోజుల పాటు సీబీఐ కోర్టు సోమవారం పొడిగించింది. దాంతో ఆయనను తిహార్ జైలుకు తరలించారు. మార్చి 20 దాకా ఆయన జైల్లోనే ఉంటారు. విపాసన ధ్యానం చేసుకునేందుకు అనుమతించాలన్న సిసోడియా విజ్ఞప్తిని పరిశీలించాల్సిందిగా జైలు వర్గాలకు కోర్టు సూచించింది. ఆయన్ను జైలు నంబర్ 1లో ఉంచారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టైన ఢిల్లీ మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ కూడా తిహార్ జైల్లోనే ఉన్న విషయం తెలిసిందే. సిసోడియా బెయిల్ పిటిషన్ మార్చి 10న విచారణకు రానుంది. ఈ కేసులో అరెస్టయిన ఆడిటర్ బుచ్చిబాబుకు ప్రత్యేక కోర్టు బెయిలు షరతులతో కూడిన బెయిలిచ్చింది.

ఆప్, కాంగ్రెస్ వాగ్యుద్ధం

మరోవైపు సిసోడియా అరెస్టుపై ఆప్, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం జరగడం విశేషం. ఢిల్లీ మద్యం విధానంపై ఆరోపణలు తీవ్రమైనవని, వాటిపై దర్యాప్తు జరిగి తీరాల్సిందేనని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాథే అన్నారు. ఈ విషయంలో తమ పార్టీ వైఖరిలో ఎలాంటి అయోమయమూ లేదని చెప్పారు. కాంగ్రెస్‌తో పాటు ఇతర విపక్ష నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులకు దిగినప్పుడు ఆప్ కనీసం ఖండించను కూడా లేదని ఆక్షేపించారు. కాంగ్రెస్ ఎన్నడూ సహచర విపక్షాలకు దన్నుగా నిలవదంటూ ఆప్ ఎదురుదాడి చేసింది. కేవలం దేశాన్ని మోసగించేందుకు బీజేపీతో అది కేవలం మాటల యుద్ధం చేస్తుంటుందని ఎద్దేవా చేసింది.

భారత్ పార్లమెంట్‌లో మైకుల మూగనోము

బ్రిటిష్ ఎంపీలతో రాహుల్ గాంధీ



లండన్: భారత పార్లమెంట్ దిగువ సభ అయిన లోక్‌సభలో మైక్రోఫోన్లు ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా తరచుగా మూగబోతుంటాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ అన్నారు. బ్రిటన్‌లో భారత సంతతికి చెందిన ప్రతిపక్ష లేబర్ పార్టీ ఎంపీ వీరేంద్ర శర్మ సోమవారం లండన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రిటిష్ ఎంపీలను ఉద్దేశించి రాహుల్ మాట్లాడారు. తాను నిర్వహించిన భారత్ జోడో యాత్ర గురించి ప్రస్తావించారు. ప్రజలను కూడగట్టడానికి ఇదొక రాజకీయ కార్యాచరణగా ఉపయోగపడిందని అన్నారు. భారత లోక్‌సభలో మైకులు పని చేస్తుంటాయి గానీ తరచుగా మొరాయిస్తుంటాయని వ్యాఖ్యానించారు. మాట్లాడేటప్పుడు మధ్యలోనే ఆగిపోతుంటాయని, తనకు చాలాసార్లు ఇలాంటి అనుభవం ఎదురైందని స్పష్టం చేశారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ గురించి పార్లమెంట్‌లో మాట్లాడేందుకు ప్రతిపక్షాలకు ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. చైనా సైన్యంలో భారత భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించిందని, దానిపైనా ప్రశ్నించే అవకాశం ఇవ్వలేదన్నారు. పార్లమెంట్‌లో గతంలో జరిగిన అర్థవంతమైన చర్చలు, సంవాదాలు ఇప్పుడు లేకుండాపోయాయని ఆక్షేపించారు.

బీజేపీ, కాంగ్రెస్‌లకు సమదూరం

వ్యూహం మార్చుకున్న టీఎంసీ

కోల్‌కతా: ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాబట్టలేకపోయిన తృణమూల్ కాంగ్రెస్ రాజకీయ వ్యూహాన్ని మార్చుకుంది. ఇకపై బీజేపీ, కాంగ్రెస్‌లకు సమదూరం పాటించనుంది. అవంటే గిట్టని ప్రాంతీయ పార్టీలతో మరో ఫ్రంట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. 'బీఆర్ఎస్, ఆప్ తదితర పార్టీలతో చర్చలు ప్రారంభించాం. మా వ్యూహమేంటో వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో తెలుస్తుంది' అని టీఎంసీ నేత సుదీప్ బందోపాధ్యాయ్ తెలిపారు. ఓట్లను చీల్చడం ద్వారా బీజేపీకి టీఎంసీ సాయం చేస్తోందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సీపీఎం నేతలు విమర్శలు గుప్పించడంతో, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగుతామంటూ టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఇటీవల ప్రకటించడం తెలిసిందే.

2024లో అమేథీ నుంచి పోటీ చేస్తాం!

లక్నో: 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ లోక్‌సభ స్థానంలో పోటీ చేస్తామని సమాజ్‌వాదీ పార్టీ ప్రకటించింది. అక్కడ పేద మహిళల పరిస్థితి దారుణంగా మారిందని పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. అక్కణ్నుంచి ఎంతోమంది ప్రముఖులు లోక్‌సభకు ఎన్నికవుతున్నప్పటికీ పేదల బతుకులు మాత్రం మారడం లేదని వాపోయారు. ఇక యూపీలోని ఇతర ప్రాంతాల్లో ప్రజల జీవితాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదన్నారు. ''అందుకే, వచ్చే ఎన్నికల్లో అమేథీలో బడా నాయకులు కాకుండా మంచి మనసున్న వ్యక్తులు గెలుస్తారు'' అంటూ సోమవారం ఆయన ట్వీట్ చేశారు. అమేథీలో పేదరికాన్ని నిర్మూలిస్తామని హామీ ఇచ్చారు. ఆ స్థానాన్ని సమాజ్‌వాదీ ప్రతిసారీ కాంగ్రెస్‌కు వదిలేస్తోంది. అక్కడ ప్రస్తుతం కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ ఎంపీగా ఉన్నారు. ఆమె 2019లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఓడించారు.

ఉపాధి, నైపుణ్యాభివృద్ధి

ఆర్థిక వృద్ధికి అవే కీలకం: మోదీ



అహ్మదాబాద్/న్యూఢిల్లీ: భారత్ ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే యువతలో నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడం చాలా కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ నైపుణ్యాభివృద్ధి తాలూకు ఫలాలు యువత, ఆదివాసీలతో పాటు సమాజంలో అన్ని వర్గాలకూ చేరేలా చూసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. మౌలిక, అభివృద్ధి ప్రాజెక్టుల ద్వారా అపారమైన ఉపాధి అవకాశాలను కల్పించడం, ఉత్పత్తి రంగ వృద్ధికి ఊతమివ్వడం, స్వాతంత్ర్యానంతరం నిర్లక్ష్యానికి గురైన ఇతర రంగాల్లోనూ ఉపాధి సృష్టికి కృషి చేయడం తమ లక్ష్యమన్నారు. గుజరాత్ ప్రభుత్వం సోమవారం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన రోజ్‌గార్ మేళాను ఉద్దేశించి మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ''దేశంలో రికార్డు స్థాయిలో 90 వేలకు పైగా స్టార్టప్‌లు పని చేస్తున్నాయి. ఇవి ఉపాధి కల్పించడమే గాక లక్షలాది మంది యువకులకు స్వయం ఉపాధి దిశగా స్ఫూర్తినిస్తున్నాయి. స్టార్టప్‌లకు ప్రభుత్వం ఆర్థిక సాయంతో పాటు అవసరమైన బ్యాంకు గ్యారంటీలు కూడా అందజేస్తోంది'' అని వివరించారు. ''గుజరాత్‌లో గత ఐదేళ్లలో లక్షన్నర మంది యువకులకు ప్రభుత్వోద్యోగాలు లభించాయి. 2023లో మరో పాతిక వేల ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి'' అన్నారు.

ఆరోగ్య రంగంలో ఆత్మనిర్భరత

ఆరోగ్య రంగంలో విదేశాలపై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మోదీ తెలిపారు. ఆరోగ్య, వైద్య పరిశోధనలపై బడ్జెట్ అనంతర వెబినార్‌నుద్దేశించి ఆయన మాట్లాడారు. వైద్య రంగానికి సంబంధించిన ఎలాంటి పరికరాలనూ, టెక్నాలజీని దిగుమతి చేసుకోవాల్సిన అవసరం లేకుండా స్వయంసమృద్ధంగా మార్చాల్సిన బాధ్యత దేశ పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలపై ఉందన్నారు. ఈ దిశగా తామిప్పటికే ఎన్నో చర్యలు తీసుకున్నామన్నారు. స్వాతంత్ర్యానంతరం చాలా ఏళ్లపాటు సమీకృత ధోరణి, దీర్ఘకాలిక విజన్ లేమి దేశ వైద్య రంగ వృద్ధికి ముందరి కాళ్ల బంధంగా ఉండేవన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిందని చెప్పారు. ''నేను ఫార్మా మార్కెట్ రూ.4 లక్షల కోట్లకు విస్తరించింది. ప్రైవేట్ రంగం, వైద్య విద్యా రంగం మధ్య సరైన సమన్వయముంటే ఇది రూ.10 లక్షల కోట్లకు విస్తరించగలదు. కరోనా కల్లోలం సంపన్న దేశాలను కూడా అల్లాడించింది. దాని దెబ్బకు ప్రపంచమంతా ఆరోగ్యంపై దృష్టి పెడుతున్న ఈ తరుణంలో భారత్ మాత్రం మరో అడుగు ముందుకేసి వెల్‌నెస్‌పై దృష్టి పెట్టింది. మనమిప్పుడు ప్రపంచం ముందుంచిన 'ఒక భూమి, ఒకే ఆరోగ్యం' విజన్ అందులో భాగమే. మనుషులకే గాక జంతు, వృక్షజాలాలన్నింటికీ ఒకే తరహాలో సమగ్ర ఆరోగ్య రక్షణ కల్పించడమే దీని ఉద్దేశం. అంతేగాక ఆరోగ్య సేవలు అందుబాటు ధరల్లో ఉండేలా చూడటం కూడా మా ప్రభుత్వ ప్రాథమ్యాల్లో ఒకటి. అందుకే ఆయుష్మాన్ భారత్ పథకం కింద చేపట్టిన చర్యల ద్వారా పేద రోగులకు ఇప్పటికే రూ.80,000 కోట్లు ఆదా అయ్యాయి'' అని చెప్పారు. మార్చి 7ను జన్ ఔషధీ దివస్ జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. 9,000 జన్ ఔషధీ కేంద్రాల వల్ల పేద, మధ్యతరగతి వారికి రూ.20 వేల కోట్ల దాకా ఆదా అయిందన్నారు.

రానున్న వేసవిలో తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేలా ప్రజలతో పాటు వైద్య నిపుణులకు, స్థానిక సంస్థలకు సమగ్ర అవగాహన కల్పించాలని మోదీ సూచించారు.

వేసవిలో జాగ్రత్త: మోదీ

వేసవి సన్నద్ధత దిశగా చేపట్టిన చర్యలను ఆయన సారథ్యంలో ఉన్నత స్థాయి సమీక్షలో అధికారులు వివరించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను దీటుగా ఎదుర్కొనేందుకు ఆహార ధాన్యాల నిల్వలను ఎఫ్‌సీఐ వీలైనంతగా పెంచాలని మోదీ సూచించారు. వచ్చే వర్షాకాలంలో సాధారణ వర్షపాతం నమోదవుతుందన్న అంచనాలను మోదీ దృష్టికి తెచ్చారని ప్రధాని కార్యాలయం పేర్కొంది.

పాక్‌లో ఆత్మాహుతి దాడి.. 9 మంది పోలీసులు మృతి

కరాచీ: పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో సోమవారం జరిగిన ఆత్మాహుతి దాడిలో 9 మంది పోలీసులు మృతి చెందగా మరో 13 మంది గాయపడ్డారు. సిబి మేళా బందోబస్తు విధుల్లో పాల్గొని క్వెట్టాకు తిరిగి వస్తున్న పోలీస్ కానిస్టేబుళ్ల వ్యాన్‌ను బొలాన్ వద్ద ఓ ఉగ్రవాది పేలుడు పదార్థాలతో బైక్‌పై దూసుకువచ్చి ఢీకొట్టాడు. పేలుడు తీవ్రతకు వ్యాను తునాతునకలైంది. ఘటనలో వ్యానులోని 9 మంది కానిస్టేబుళ్లు మృతి చెందగా మరో 13 మంది గాయాలపాలయ్యారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ఘటనకు తమదే బాధ్యతంటూ ఎవరూ ప్రకటించుకోలేదు. గతంలో ఘటనలకు బట్టి బలూచ్ వేర్పాటువాదులు లేక ఇస్లామిక్ తీవ్రవాదుల పని అయి ఉంటుందని అనుమానిస్తున్నారు. తీవ్రవాదులు బహుశా సిబి మేళా ఉత్సవాల భగ్నానికి యత్నించి ఉంటారని అనుమానిస్తున్నారు. ఇరాన్, అఫ్గానిస్తాన్ సరిహద్దుల్లో ఉన్న బలూచిస్తాన్‌లో తరచూ హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

'ఉమేశ్' కేసులో మరో నిందితుని ఎన్‌కౌంటర్

ప్రయాగ్‌రాజ్/లక్నో: ఉమేశ్ పాల్ హత్య కేసులో మరో నిందితుడు విజయ్ చౌధరి అలియాస్ ఉస్మాన్ పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. కౌండియారా పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోథి, బెల్వా మధ్య సోమవారం ఉదయం 5.30 గంటల సమయంలో పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఉస్మాన్ తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడని ఎస్‌హెచ్‌వో రాజేశ్ కుమార్ మౌర్య చెప్పారు. 2005 నాటి బీఎస్పీ మాజీ ఎమ్మెల్యే రాజు పాల్ హత్య కేసులో ఉమేశ్ పాల్ కీలక సాక్షిగా ఉన్నాడు. ఫిబ్రవరి 24వ తేదీన దుండగులు జరిపిన కాల్పుల్లో ఉమేశ్, అతడి ఇద్దరు భద్రతా సిబ్బంది చనిపోయారు. దీని వెనుక గ్యాంగ్‌స్టర్, రాజకీయ నాయకుడు అతిక్ అహ్మదే కారణమని పోలీసులు చెప్పారు. అయితే, ఇంట్లో ఉన్న ఉస్మాన్‌ను పోలీసులు పట్టుకెళ్లి కాల్చి చంపారని అతడి భార్య సుహానీ ఆరోపించింది. మరో నిందితుడు అర్బాజ్ కూడా ఫిబ్రవరి 27న ఎన్‌కౌంటర్లో చనిపోయాడు.

బిహార్ మాజీ సీఎం రబ్రీని ప్రశ్నించిన సీబీఐ

పట్నా/న్యూఢిల్లీ: బిహార్ మాజీ సీఎం రబ్రీదేవిని పట్నాలోని ఆమె నివాసంలోనే సోమవారం సీబీఐ అధికారులు సోమవారం ఐదు గంటల పాటు ప్రశ్నించారు. ఆమె భర్త, కేంద్ర రైల్వే శాఖ మాజీ మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌ను మంగళవారం ప్రశ్నించనున్నారు. లాలూ రైల్వే మంత్రిగా ఉండగా ఉద్యోగాలు ఇచ్చినందుకు ప్రతిఫలంగా అభ్యర్థుల నుంచి భూములు తీసుకున్నారనే ఆరోపణలపై సీబీఐ విచారణ జరుపుతోంది.

కుమారుడు, కోడలిపై కోపంతో గవర్నర్‌కు రూ.కోటి ఆస్తి రాసిచ్చిన వృద్ధుడు

ముజఫర్‌పూర్: వృద్ధాప్యంలో ఉన్న తనను కుమారుడు, కోడలు తనను సరిగ్గా పట్టించుకోకపోవడంతో ఉత్తరప్రదేశ్‌లో వ్యక్తి సంచలన నిర్ణయం తీసుకున్నాడు. రూ.కోటి విలువైన తన ఇంటిని, భూమిని రాష్ట్ర గవర్నర్‌కు రాసిచ్చాడు. తన మరణం తర్వాత ఆ భూమిలో పాఠశాల లేదా ఆసుపత్రి నిర్మించాలని కోరాడు. ముజఫర్‌నగర్ జిల్లాలోని బైరాల్ గ్రామానికి చెందిన 80 ఏళ్ల నాథూసింగ్ ఖతోలీలో వృద్ధాశ్రమంలో ఉంటున్నాడు. రూ.కోటి విలువైన ఇంటిని, 10 బిఘాల భూమిని యూపీ గవర్నర్‌కు అప్పగించాలంటూ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో అఫిడవిట్ సమర్పించాడు. విల్లును రిజిస్టర్ చేయించాడు. కొడుకు, కోడలు తనను దారుణంగా అవమానిస్తున్నందుకే వృద్ధాశ్రమంలో ఉండాల్సి వస్తోందని వాపోయాడు!

భార్యను చంపి 5 ముక్కలుగా నరికి..

బిలాస్‌పూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బిలాస్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తి తన భార్యను చంపి, మృతదేహాన్ని ఐదు ముక్కలుగా నరికి, ఇంట్లోని ఖాళీ నీళ్ల ట్యాంకులో పడేశాడు. సక్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉలాస్‌పూర్ ప్రాంతంలో ఓ వ్యక్తి నకిలీ నోట్లను ముద్రిస్తున్నాడనే అనుమానంతో ఓ ఇంట్లో సోదాలు జరిపారు. బాత్‌రూం మూలన ఉన్న ట్యాంకులో టేప్ వేసి పాలిథీన్ కవర్‌లో చుట్టిన శరీర భాగాలు కనిపించడంతో షాక్‌కు గురయ్యారు. అక్రమ సంబంధం అనుమానంతో భార్యను జనవరి 6న గొంతు పిసికి చంపినట్లు విచారణలో అతడు వెల్లడించాడు. అనంతరం కట్టర్‌తో మృతదేహాన్ని ఐదు ముక్కలు కోసి, కొనుక్కొచ్చిన ట్యాంకులో పడేసినట్లు తెలిపాడు. ఇంట్లో నకిలీ నోట్లు, కలర్ ప్రింటర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

భూమిపైకి 'మేఘాట్రోఫిక్-1' పునరాగమనం!

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): నియంత్రిత పునరాగమన పద్ధతిలో సరికొత్త ప్రయోగానికి 'ఇస్రో' సిద్ధమైంది. 2011 అక్టోబర్ 12న పీఎస్ఎల్వీ–సీ18 రాకెట్ ద్వారా పంపించిన మేఘాట్రోఫిక్ ఉపగ్రహం కాలపరిమితికి మించి పనిచేసి, ప్రస్తుతం అంతరిక్షంలో నిరుపయోగంగా మారింది. దాదాపు 1,000 కిలోల బరువైన మేఘాట్రోఫిక్–1 (ఎంటీ–1) ఉపగ్రహాన్ని ఉష్ణమండలంలోని వాతావరణం, వాతావరణ పరిస్థితులపై అధ్యయనం కోసం ఇస్రో, ఫ్రాన్స్ అంతరిక్ష సంస్థ (సీఎన్ఈఎస్) సంయుక్తంగా తయారుచేసి ప్రయోగించాయి. దీని కాలపరిమితి మూడేళ్లు. కానీ, 2021 దాకా సేవలందించింది. ప్రస్తుతం వ్యర్థంగా మారిన ఈ ఉపగ్రహంలో 125 కిలోల ద్రవ ఇంధనముంది. ఇది అంతరిక్షంలో పేలిపోయి ఇతర ఉపగ్రహాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని ఇస్రో అంచనా వేసింది. ఈ నేపథ్యంలో దానిని సురక్షితంగా భూమిపైకి తీసుకొచ్చి, పసిఫిక్ మహాసముద్రంలో కూల్చేందుకు మంగళవారం సరికొత్త ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టనున్నారు. భూమిపైకి మేఘాట్రోఫిక్-1 రీఎంట్రీ కోసం అందులో ఉన్న ఇంధనం సరిపోతుందని ఇస్రో సైంటిస్టులు చెబుతున్నారు.



26న ఎల్వీఎం3–ఎం3 ప్రయోగం

లాంచ్ వెహికల్ మార్క్3–ఎం3 (ఎల్వీఎం3–ఎం3) ప్రయోగాన్ని ఈ నెల 26న నిర్వహించేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన నెట్‌వర్క్ యాక్సెస్ అసోసియేట్ లిమిటెడ్, ఇండియన్ భారతి ఎంటర్‌ప్రైజెస్ సంయుక్త భాగస్వాములుగా వన్‌వెబ్ ఇండియా–2 పేరుతో 5,796 కిలోల బరువైన 36 కమ్యూనికేషన్ ఉపగ్రహాలను రెండోసారి వాణిజ్యపరంగా ప్రయోగిస్తున్నాయి. సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ 'షార్'లోని రెండో ప్రయోగ వేదిక దీనికి వేదిక కానుంది. షార్‌లోని వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రెండు దశల రాకెట్ అనుసంధానం పూర్తి చేశారు. క్రయోజనిక్ దశ మాత్రమే పెండింగ్‌లో ఉంది. ప్రయోగించబోయే 36 ఉపగ్రహాలు ఇప్పటికే షార్‌కు చేరుకున్నాయి. వీటికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. హీట్‌షీల్డ్‌లో అమర్చే పనులు జరుగుతున్నాయి.


మా నాన్న పెళ్లి ఆపండి!

రెండో పెళ్లి చేసుకుంటున్నాడంటూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన చిన్నారి

పట్నా: 'పోలీసంకుల్.. మా నాన్న రెండో పెళ్లి చేసుకుంటున్నాడు. మీరే ఎలాగైనా ఆపాలి..' అంటూ ఓ బాలిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. బాలిక ధైర్యాన్ని అందరూ మెచ్చుకుంటున్నారు. బిహార్‌లోని షియోహర్‌లో ఇప్పుడు ఇదే 'టాక్ ఆఫ్ ది టౌన్'అయ్యింది. షియోహర్‌కు చెందిన మనోజ్ కుమార్ రాయ్‌కు నలుగురు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. అందరూ 12 ఏళ్ల లోపు వారే. సుమారు రెండేళ్ల క్రితం భార్య చనిపోయింది. దీంతో, అతడు రెండో పెళ్లికి సిద్ధమయ్యాడు. తనకున్న సుమారు అరెకరం (ఎకరానికి 32 కఠాస్ సమానం) భూమిని ఇచ్చేందుకు కాబోయే భార్యతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. శనివారం సాయంత్రం స్థానిక గుడిలో పెళ్లి జరగాల్సి ఉంది. అయితే, మనోజ్ కూతుళ్లలో ఒకరైన పదేళ్ల చోటీ కుమారి కొందరు గ్రామస్తులతో కలిసి శనివారం ఉదయం పిప్రాహి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. 'మా నాన్న మళ్లీ పెళ్లి చేసుకుంటున్నాడు. ఇక మమ్మల్నెవరు చూసుకుంటారు? మా నాన్న లేకుంటే మాకు దిక్కెవ్వరు? ఉన్న భూమినంతా ఆమెకే ఇచ్చేస్తే మేమెలా బతకాలి? ఎలాగైనా, ఈ పెళ్లిని మీరే ఆపాలి'అని బిగ్గరగా ఏడ్చుకుంటూ పోలీసులకు మొరపెట్టుకుంది. చిన్నారి వినతిపై పోలీసులు మానవతా దృక్పథంతో స్పందించారు. గ్రామ సర్పంచి, ఇతర ప్రముఖులను పిలిపించారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. గుళ్లో పెళ్లి ఏర్పాట్లలో ఉన్న మనోజ్‌ను స్టేషన్‌కు పిలిపించారు. రెండో పెళ్లిని రద్దు చేసుకునేందుకు, పిల్లల్ని సరిగ్గా చూసుకునేందుకు ఒప్పించారు. ఈ మేరకు బాండ్ పేపర్‌పై అతడితో సంతకం చేయించారు. అనంతరం, తన కూతురు చోటీ కుమారిని తీసుకుని మనోజ్ కుమార్ ఇంటికి వెళ్లాడు. బాలిక ధైర్యాన్ని చూసి పట్టణవాసులంతా శెభాష్ అంటున్నారు.

సాక్షి విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

మంగళవారం : 7 : మార్చి : 2023



నేడు గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారు కొలువున్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ మంగళవారం సాయంత్రం 5 గంటలకు దేవస్థాన ఘాట్‌రోడ్డు నుంచి ప్రారంభమవుతుంది.



నయన మనోహరం

కూచిపూడి(మొవ్వ): కృష్ణాజిల్లా కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళా వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు కనుల విందుగా సాగుతున్నాయి.



కల్యాణం..కమనీయం

మంగళగిరి పట్టణంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది.

న్యూస్‌రీల్

నేడు నెమలిలో వేణుగోపాలుని కల్యాణం



నెమలి(గంపలగూడెం): ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రసిద్ధిపొందిన గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో 66వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం స్వామి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ శ్రీరామ వర ప్రసాదరావు, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో పూర్తి చేశారు. ఆలయం నుంచి పెళ్లి కుమారుడైన శ్రీ వేణుగోపాలుడిని గరుడ వాహనంపై.. పెళ్లి కుమార్తెలు రుక్మిణీదేవి, సత్యభామలను ప్రత్యేక వాహనంలో కల్యాణ వేదిక వద్దకు తీసుకొస్తారు. రాత్రి 11 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం జరుగుతుంది. ఆంధ్ర, తెలంగాణ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. భక్తుల సౌకర్యార్థం తిరువూరు, తెలంగాణలోని మధిర ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్ సర్వీసులను ఏర్పాటు చేశారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి నూజివీడుకు చెందిన భక్తులు సోమవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. నూజివీడు పాతపేటకు చెందిన బీఎస్ఎస్టీ సాయి అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,01,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను దాతకు అందజేశారు.

పవిత్రంగా హోలీకా దహన్



గుణదల(విజయవాడ తూర్పు): ప్రజలందరూ సంతోషంగా ఉత్సాహంతో నిర్వహించుకునే పండుగ హోలీ. ఇది ప్రతి ఒక్కరికీ సంబరమే. ముఖ్యంగా యువతీ యువకులు పరుగులు తీస్తూ రంగులు చిమ్ముకుంటూ హోలీ ని నిర్వహించుకుంటారు. మంగళవారం హోలీ పండుగను పురస్కరించుకుని ఆ సంబరాలు సోమవారం రాత్రే మొదలయ్యాయి. విజయవాడ గురునానక్ కాలనీలో సోమవారం రాత్రి హోలీకా దహన్ అనే కార్యక్రమం నిర్వహించారు. సిక్కులంతా ప్రతి హోలీ పండుగ ముందు రోజు రాత్రి పవిత్రంగా ఈ హోలీకా దహన్ జరపడం ఆచారంగా వస్తోంది. దీనిలో భాగంగా సిక్కులంతా ఒక్క చోట చేరి ఆవు పిడకలను గుట్టగా వేసి ముందుగా ప్రార్థిస్తారు. అనంతరం భోగి మంటలను తలపించేలా ఆ పిడకలను కాలుస్తారు. ఈ ఆచారంతో తమ జీవితాల్లో ఆనందం ఉంటుందని వారి నమ్మకం. అనంతరం హోలీ పండుగ సంబరాలు మొదలు పెడతారు. వేడుకల్లో సిక్కులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పీజీ సీట్లకు పచ్చ జెండా

- సిద్ధార్థ మెడికల్ కాలేజీలోని ఐదు విభాగాల్లో 41 పీజీ వైద్య సీట్లు
- మెడికల్ కాలేజీలోని ఐదు విభాగాల్లో పెరిగిన సీట్లు
- 2023–24 విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు
- అనుమతి మంజూరు చేసిన ఎన్‌ఎంసీ
- ఇతర విభాగాల్లోనూ మరిన్ని సీట్లు వచ్చే అవకాశం



సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యకు అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. 'నాడు–నేడు' పథకం ద్వారా మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టింది. ఎన్నడూ లేని విధంగా వైద్య నిపుణులను, మానవ వనరులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫలితంగా రోగులకు అత్యున్నత స్థాయి వైద్యం అందుతోంది. వైద్య విద్యార్థులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. అదే క్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు కూడా పెరుగుతున్నాయి. తాజాగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని సిద్ధార్థ వైద్య కళాశాలలో పీజీ సీట్ల పెంపునకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కళాశాలలోని ఐదు విభాగాల్లో పెరిగిన పీజీ 41 సీట్లకు 2023–24 విద్యాసంవత్సరం నుంచి అడ్మిషన్లకు అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీచేసింది. గతంలో 105 పీజీ సీట్లు ఉండగా, ఇప్పుడు పెరిగిన 41 సీట్లకు కూడా అడ్మిషన్లకు అనుమతించింది. ఇంత పెద్ద ఎత్తున ఒకేసారి పీజీ సీట్లు రావడం ఇదే తొలిసారి అని పలువురు వైద్యులు చెబుతున్నారు. సిద్ధార్థ వైద్య కళాశాలలోని మరిన్ని విభాగాల్లో ఎన్‌ఎంసీ తనిఖీలు చేయాల్సి ఉంది. అవి పూర్తయితే, ఇంకా సీట్లు పెరిగే అవకాశం ఉంది.

తనిఖీల్లో సంతృప్తి

సిద్ధార్థ వైద్య కళాశాలలోని 8 విభాగాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ సీట్లు కోసం 20 రోజుల కిందట ఎన్‌ఎంసీ తనిఖీలు చేసింది. ఒక్కో విభాగానికి ఇద్దరు చొప్పున ప్రొఫెసర్లు తనిఖీలకు వచ్చారు. ఆయా విభాగాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, టీచింగ్ సిబ్బంది, లైబ్రరీ, సెమినార్ హాలు, చికిత్స కోసం వస్తున్న ఓపీ, ఐపీ రోగుల వివరాలను సేకరించారు. సిద్ధార్థ వైద్య కళాశాల, ప్రభుత్వాస్పత్రిలో పోస్టు గ్రాడ్యుయేషన్ సీట్ల మంజూరుకు సంబంధించి మెరుగైన వసతులు ఉన్నాయని భావించిన ఎన్‌ఎంసీ తనిఖీల బృందం సంతృప్తి వ్యక్తం చేస్తూ నివేదిక ఇచ్చింది. దీంతో పీజీ సీట్లను పెంచడంతోపాటు అడ్మిషన్లకు అనుమతిస్తూ ఎన్‌ఎంసీ ఉత్తర్వులు జారీ చేసింది

మరికొన్ని విభాగాల్లో తనిఖీలు జరగాలి

ప్రస్తుతం ఎనస్థీషియా, జనరల్ సర్జరీ, గైనకాలజీ, టీబీ-సీడీ, మైక్రోబయాలజీ, పాథాలజీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ విభాగాల్లో తనిఖీలు పూర్తయ్యాయి. వాటిలో జనరల్ సర్జరీ, ఆప్తమాలజీ, టీబీ-సీడీ (చెస్ట్ వ్యాధులు) విభాగాల తనిఖీల ఫలితాలు పెండింగ్‌లో ఉండగా, మిగిలిన ఐదు విభాగాలకు అదనపు సీట్లు మంజూరయ్యాయి. పీడియాట్రిక్స్, న్యూరాలజీ, న్యూరోసర్జరీ విభాగాల్లో ఎన్‌ఎంసీ తనిఖీలు చేయాల్సి ఉంది. త్వరలోనే ఆ విభాగాల్లో కూడా తనిఖీలు చేసి సీట్లు మంజూరు చేసే అవకాశం ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

మంజూరైన అదనపు పీజీ సీట్లు

ఎనస్థీషియా	10
గైనకాలజీ	11
ఈఎన్‌టీ	5
మైక్రోబయాలజీ	6
పాథాలజీ	9
రిజల్ట్ పెండింగ్‌లో ఉన్నవి	
జనరల్ సర్జరీ	12
ఆప్తమాలజీ	5
టీబీ-సీడీ	3
ఎన్‌ఎంసీ తనిఖీలు పూర్తయితే వచ్చే సీట్లు	
పిడియాట్రిక్	4
న్యూరాలజీ	5
న్యూరోసర్జరీ	5

అన్ని విభాగాల్లో సీట్లు సాధిస్తాం



సిద్ధార్థ వైద్య కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు అన్ని మౌలిక వసతుల అందుబాటులో ఉన్నాయి. మెరుగైన విద్యాబోధనకు నిరంతరం కృషి చేస్తున్నాం. ప్రస్తుతం 41 సీట్లు పెరగడం ఆనందంగా ఉంది. మిగిలిన విభాగాల్లో కూడా తనిఖీలు త్వరలోనే పూర్తయి సీట్లు మంజూరవుతాయని భావిస్తున్నాం. కళాశాలలో అన్ని విభాగాలకు పీజీ సీట్లు సాధిస్తాం.

– డాక్టర్ కంచర్ల సుధాకర్, ప్రిన్సిపాల్, సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల

కళాశాలలో సౌకర్యాల కల్పనతోనే...

ఒకప్పుడు అరకొర సౌకర్యాలు, వైద్యుల కొరతతో రోగులకు కనీస సేవలు కూడా అందే పరిస్థితి లేదు. అయితే, గత నాలుగేళ్లలో ప్రభుత్వాస్పత్రి రూపురేఖలు మారిపోయాయి. పూర్తి స్థాయిలో వైద్యుల నియామకాలు చేపట్టారు. వైద్య విద్యార్థులు, రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుతం రూ.170 కోట్లతో 'నాడు–నేడు' పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇవి పూర్తయితే అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) సీట్లు కూడా 175 నుంచి 250కి పెరిగే అవకాశం ఉందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

సమ్మిట్‌తో పారిశ్రామిక ప్రగతి

విజయోత్సవంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



సమ్మిట్ విజయోత్సవంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కోస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించేలా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ జరిగిందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వెలంపల్లి ఆధ్వర్యంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయోత్సవం జరిగింది. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ కార్యకర్తలతో కలిసి కేక్ కోశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ అంబానీలు, దాల్మియా, జీఎంఆర్ వంటి దిగ్గజ పారిశ్రామికవేత్తలను ఒకే వేదిక మీదకు తెచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఎల్లో మీడియా చంద్రబాబు భజనమాని కళ్లు తెరవాలన్నారు. కార్యక్రమంలో మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, దుర్గగుడి చైర్మన్ రాంబాబు, సోమినాయుడు, పుణ్యశీల తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జుల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల జోనల్ ఇన్‌చార్జిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సోమవారం ప్రకటన విడుదల చేశారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల జోనల్ యువజన విభాగ ఇన్‌చార్జిగా మచిలీపట్నంకు చెందిన పేర్ని వాకా సాయికృష్ణమూర్తి, రైతు విభాగానికి అవనిగడ్డకు చెందిన కె.నరసింహారావు, బీసీ విభాగానికి విజయవాడ ఈస్ట్‌కు చెందిన కె.దుర్గారావు, వైఎస్సార్‌టీయూసీ విభాగానికి నంబూరు ప్రదీప్‌కుమార్, పంచాయతీరాజ్ విభాగానికి జగ్గయ్యపేటకు చెందిన మార్గపూడి గాంధీ, ఎస్టీ విభాగానికి విజయవాడకు చెందిన మానుపాటి చిరంజీవి, మైనార్టీ విభాగానికి మచిలీపట్నంకు చెందిన షేక్ సిలార్‌దాదా, విద్యార్థి విభాగానికి గుంటూరు పశ్చిమకు చెందిన బి.విఠల్, వికలాంగుల విభాగానికి గుడివాడకు చెందిన మధుకిరణ్, సేవాదళ్ విభాగానికి విజయవాడకు చెందిన షేక్ అమిత్, డాక్టర్స్ విభాగానికి షేక్ మహబూబ్, వాణిజ్య విభాగానికి విజయవాడకు చెందిన నాగేశ్వరరావు, సాంస్కృతిక విభాగానికి గుంటూరు తూర్పుకు చెందిన షేక్ హసన్, ప్రచార విభాగానికి గన్నవరానికి చెందిన శివరామకృష్ణ, మహిళ విభాగానికి విజయవాడకు చెందిన కొత్తపల్లి రజిని, గ్రీవెన్స్ విభాగానికి నందిగామకు చెందిన మూలె నాగిరెడ్డి, చేనేత విభాగానికి విజయవాడకు చెందిన వానపల్లి త్రిమూర్తులను నియమించారు.

'రాశి'గా పోసిన ఆశలు

ఆశాజనకంగా 'పచ్చ బంగారు' దిగుబడులు

- పసుపు దుంప తవ్వకం పనులు మొదలు
- ఆశించిన ధర వస్తే సాగు సంబరమే
- మార్కెట్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్న రైతులు



రాశిగా పోస్తున్న పసుపు కొమ్ములు



విత్తనం కొమ్ము, శిల్ల వేరుచేస్తున్న కూలీలు

కంకిపాడు: పచ్చ బంగారం మార్కెట్‌కు చేరుతోంది. పంట కాలం పూర్తి కావటంతో రైతులు పసుపు దుంప తవ్వకం పనుల్లో నిమగ్నమయ్యారు. దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో అన్నదాతలు పచ్చ బంగారానికి ఆశించిన ధర వస్తే సాగు పసిడిమయం అవుతుందని భావిస్తున్నారు.

వాణిజ్య పంటల్లో ప్రధాన పంటల్లో పసుపు పంట కూడా ముఖ్యమైంది. ఈ ప్రాంత రైతాంగం పచ్చ బంగారంగా పిలుస్తారు. తొలకరి వర్షాలతో పసుపుదుంప నాటే పనులను చేపడతారు. ఫిబ్రవరి మాసాంతంతో పంట కాలం పూర్తి కావటంతో పసుపు ఆకుతీత, దుంప తవ్వకం పనులను రైతులు చేపడుతున్నారు.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో..

ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా పసుపు సాగు జరుగుతోంది. కృష్ణాజిల్లాలో అత్యధికంగా ఈ వ్యవసాయ సీజన్‌లో 2100 హెక్టార్లలో సాగు జరిగినట్లు అంచనా. కంకిపాడు, తోట్లవల్లూరు, పెనమలూరు, ఉయ్యూరు, పామర్రు, మొవ్వ, చల్లపల్లి, అవనిగడ్డ, మోపిదేవి, తదితర మండలాల్లో రైతులు సాగు చేపట్టారు. అలాగే ఎన్టీఆర్ జిల్లాలో 500 హెక్టార్లలో సాగు జరిగినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. గంపలగూడెం, నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు, ఎ.కొండూరు, తదితర మండలాల్లో పసుపు సాగు చేపట్టారు. అన్ని చోట్ల కస్తూరి, మైదుకూరు, టేకూరుపాడు, శేలం, ప్రగతి, దుగ్గిరాల, మొదలైన విత్తన రకాలను రైతులు సాగుకు వినియోగించారు.

మార్కెట్‌కు 'పసుపు'..

పంట కాలం పూర్తికావటంతో గడిచిన నాలుగురోజులుగా రైతులు పసుపు దుంప తవ్వకం పనులను చేపట్టారు. ఇప్పటికే పసుపు ఆకుతీత పనులు పూర్తి చేసి, పసుపు దుంప ఉడికించేందుకు అవసరమైన ముడి సరుకుగా పంట పొలాల్లోనే నిల్వ చేసుకున్నారు. దీంతో పాటుగా దుంప తవ్వకాలు చేపట్టారు. విత్తనం కొమ్ము, శిల్లను కూలీలతో వేరు చేయించి రాశులుగా పోస్తున్నారు. ఎద్లు, పొలుగుల సాయంతో దుంపను తవ్వించి కూలీలతో వేరు చేయిస్తున్నారు.

ఎండు కొమ్ములపై ఆశలు..

వాతావరణ పరిస్థితులు ఈ సీజన్‌లో అనుకూలించాయి. తెగుళ్ల బెడద కూడా తక్కువగానే ఉంది. ఎకరాకు పచ్చి పసుపు 65 పుట్లు (పుట్టు అంటే 225 కిలోలు) నుంచి 70 పుట్లు వస్తుందని అంచనా వేస్తున్నారు. పచ్చి పసుపు పంటకు ప్రస్తుతం ఆశించిన ధర లేదు. దీంతో రైతులు దుంపను ఉడికించి ఎండు పసుపు మార్కెట్‌కు తరలించేందుకు అవసరమైన సన్నాహాలు చేసుకుంటున్నారు. ఎండు పసుపు కొమ్ములు 25 నుంచి 30 క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. గత వ్యవసాయ సీజన్‌లో ప్రభుత్వం దళారులు బారిన పడకుండా క్వింటాకు రూ. 6,850 చొప్పున మద్దతు ధర నిర్ణయించి రైతుల నుంచి కొనుగోళ్లు చేసి బాసటగా నిలిచింది. ఈ సీజన్‌లో ఎండు కొమ్ములు సిద్ధమయ్యే నాటికి ఆశించిన ధర మార్కెట్‌లో లభిస్తే సాగు లాభదాయకంగా ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు



మార్చి నెలాఖరు నుంచి ఉడికించి ఎండబెట్టిన పసుపు కొమ్ములు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయి. విత్తనం, శిల్ల కొమ్ములు సిద్ధమవుతాయి. ప్రభుత్వం గత సీజన్‌లో రూ. 6,850 మద్దతు ధర ప్రకటించి నిర్దేశిత ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించి పంట సేకరించారు. ఇప్పటి వరకూ ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ఉత్తర్వులు వెలువడగానే పంట సాగు, దిగుబడి అంచనాలు, సేకరణ లక్ష్యాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందించి చర్యలు తీసుకుంటాం.

–మురళీకిషోర్, డీఎం, మార్క్‌ఫెడ్, కృష్ణాజిల్లా

ఆశించిన ధర వస్తే లాభం



ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా పసుపు ధర రూ 5 వేలు ఉంది. ఈ రేటుకు పంటను విక్రయిస్తే పెట్టుబడులు కూడా చేతికి రావు. ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించి రైతుల నుంచి సేకరిస్తే బయటి వ్యాపారులు కూడా రేటు పెంచి కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తారు. ఆశించిన ధర వస్తే సాగు లాభదాయకంగా ఉంటుంది. ప్రభుత్వంపై నమ్మకం ఉంది. మంచి ధర అందించి రైతులను ఆదుకుంటుందని విశ్వసిస్తున్నాం.

–దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రైతు, చలివేంద్రపాలెం

అర్జీలు పరిష్కరించాలనే దృక్పథం ఉండాలి



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

- కలెక్టర్ ఢిల్లీరావు
- స్పందనలో 90 అర్జీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యలను పరిష్కరించాలనే దృక్పథం అధికారుల్లో ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనజరిగింది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్, డీఆర్వో కె.మోహన్‌కుమార్ ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. స్పందనలో వినతి పత్రం సమర్పిస్తే పరిష్కారమవుతాయనే ఆలోచనతో అర్జీదారుడు వస్తారన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పరిష్కారం చూపాలని చెప్పారు. ఏపీ సేవా డాష్ బోర్డు, జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌లో జిల్లాకు చెందిన అర్జీలు పెండింగ్ లేకుండా అధికారులు పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు.

అర్జీలు ఇవి..

సోమవారం జరిగిన స్పందనలో 90 అర్జీలు నమోదయ్యాయి. వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖలో 35, పోలీస్ 10, మున్సిపల్ 7, ఏపీసీపీడీసీఎల్ 2, దేవదాయ శాఖ 1. పంచాయతీరాజ్ 7, పశుసంవర్ధక శాఖ 2, సర్వే అండ్ సెటిల్‌మెంట్ 3, విద్యా శాఖ 1, మత్స్య శాఖ 4, వైద్య ఆరోగ్య శాఖ 4, పౌర సరఫరాల శాఖ 07, గనులు, భూగర్భ శాఖ 1, ఉపాధి కల్పన 1, ఖజాన 2, ఏపీఎస్ ఆర్టీసీ 1, విభిన్న ప్రతిభావంతుల శాఖ 2 అర్జీలు వచ్చాయి. జిల్లాలోని డివిజనల్ అధికారులు, ఆయా మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వర్చువల్‌గా మాట్లాడిన కలెక్టర్ ఆయా స్థాయిలో వినతులను అక్కడికక్కడే పరిష్కరించారు. స్పందన కార్యక్రమంలో డీఎస్ఓ కోమలి పద్మ, ఐసీడీఎస్ పీడీ జి. ఉమాదేవి, డీఎంఅండ్ హెచ్‌వో ఎం.సుహాసిని, పశుసంవర్ధక శాఖ జేడీ కె. విద్యాసాగర్, డీసీఓ శైలజ, డీఆర్‌డీఏ పీడీ కె. శ్రీనివాసరావు, గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి కె. అనురాధ, ఉద్యాన శాఖ జిల్లా అధికారి బాలాజీ కుమార్, హౌసింగ్ పీడీ శ్రీదేవి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎం. విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో కొత్త లడ్డూ పోటు

- తిరుమల తరహాలో పోటు నిర్మాణం
- పోటు పరిశీలనకు దుర్గగుడి అధికారులు
- నూతన భవనంలో ఏర్పాటుకు సూచన



దుర్గగుడిలో లడ్డూ ప్రసాదం తయారుచేసేది ఇక్కడే..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో కొత్తగా నిర్మించే లడ్డూ పోటును తిరుమల తిరుపతి దేవస్థానంలో స్వామి వారి లడ్డూ తయారీ తరహాలోనే చేసేందుకు కార్యచరణ సిద్ధమవుతోంది. దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా దేవస్థానం లడ్డూ, పులిహోర తయారీ కేంద్రాలతో పాటు అన్న ప్రసాద వితరణ భవనాలను కొత్తగా నిర్మించనున్నారు. వీటిని తిరుమల తరహాలో నిర్మించాలని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ భావిస్తున్నారు. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్‌కు, దుర్గగుడి ఈవో భ్రమరాంబకు సూచించారు. తిరుమల లడ్డూ పోటు పరిజ్ఞానాన్ని దుర్గగుడిలో ఉపయోగించేందుకు దేవస్థాన అధికారులు ప్రయత్నాలు చర్యలు తీసుకున్నారు. దీని కోసం దుర్గగుడి ఈవో భ్రమరాంబ, ఇంజినీరింగ్ అధికారులు, దేవస్థాన ఏఈవోలతో పాటు స్థపతి సోమవారం మధ్యాహ్నం విజయవాడ నుంచి తిరుమలకు బయలుదేరారు. వారు మంగళవారం పూర్తిగా తిరుమలలోనే ఉండి లడ్డూ తయారీని అధ్యయనం చేయనున్నారు. దీనిపై మంత్రికి, కమిషనర్‌కు రిపోర్టును అందజేయనున్నారు. ఆ తర్వాత ప్రభుత్వం అనుమతులతో కొత్తగా లడ్డూ పోటు నిర్మించే అవకాశాలు ఉన్నాయని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

దుర్గగుడి అభివృద్ధి పనులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 72 కోట్లు కేటాయించిన సంగతి తెలిసింది. వీటి నుంచి సుమారు రూ. 22 కోట్లతో లడ్డూ ప్రసాదం తయారీ పోటు నిర్మాణానికి అంచనాలను సిద్ధం చేశారు. మహామండపం సమీపంలో మూడు అంతస్తుల భవనంలో అన్నదానం చేసేలా ప్రణాళికలు వేశారు. దానికి రూ.30 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. మహా మండపం వద్దే లడ్డూ తయారీ పోటు నిర్మించనున్నారు.

భవిష్యత్తు అవసరాల దృష్ట్యా..!

ఇంద్రకీలాద్రిపై నిత్యం సుమారు 30 వేల లడ్డూలను విక్రయిస్తారు. శుక్ర, ఆదివారాలు 40 నుంచి 50 వేల లడ్డూలను విక్రయిస్తుంటారు. దసరా ఉత్సవాల్లో పది రోజుల్లో సుమారు 22 లక్షలు, భవానీ దీక్షల్లో 5 రోజులలో సుమారు 15 లక్షల లడ్డూల విక్రయాలు జరుగుతాయి. ఇక అన్నదానం విషయానికి కొస్తే నిత్యం 3 నుంచి 4 వేల మందికి, శుక్రవారం, ఆదివారాల్లో రోజుకు 5 వేల మందికి అన్నదానం జరుగుతుంది. ఇక దసరా ఉత్సవాల్లో రోజూ పది వేల మందికి, భవానీ దీక్షలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భవానీలకు అన్న ప్రసాదం, పులిహోర, దద్దోజనం వితరణ జరుగుతూనే ఉంటుంది. ఆ ఉత్సవాలతో పాటు దేవస్థానం భవిష్యత్తు అవసరాలు తీరేలా నూతన లడ్డూ పోటు, అన్నదానం విభాగాలను నిర్మించాలని దేవస్థాన అధికారులు భావిస్తున్నారు.

వైభవంగా శేష వాహన ఉత్సవం



గంపలగూడెం(తిరువూరు): మండలంలోని నెమలి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గ్రామోత్సవం సందర్భంగా పెండ్లి కుమారుడైన వేణుగోపాలుడు శేష వాహనంపై పురవీధుల్లో సంచరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శేష వాహనం తమ ఇళ్ల ముంగిటకు రాగానే భక్తులు నీళ్లు వారబోసి, టెంకాయలు కొట్టారు. భాజాభజంత్రీలు, సన్నాయి మేళాలతో శేషవాహన ఉత్సవం అట్టహాసంగా కొనసాగింది. నవ కుంభరోహణ, బలిహరణ తదితర పూజలను ఆలయ ప్రధాన అర్చకుడు తిరునగర గోపాలచార్యులు, అర్చకుడు పరాశరం వెంకటరమణాచార్యులు, అర్చక బృందం వైభవంగా జరిపించారు. బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా వేణుగోపాల స్వామి, రుక్మిణీదేవి, సత్యభామ అమ్మవార్ల ఎదురు కోలు ఉత్సవాన్ని మూడు రోడ్ల కూడలిగా ఉన్న గాంధీ సెంటర్లో కోలాహలంగా నిర్వహించారు. హే కృష్ణా.. ముకుందా.. పరంధామా అంటూ భక్తులు స్వామిని కీర్తిస్తూ ఆలయం నుంచి గాంధీసెంటర్ వరకు ప్రత్యేక వాహనాలపై దేవతామూర్తులను తోడ్కొని వచ్చారు. తదుపరి పెండ్లికుమారుడు, పెళ్లి కుమార్తెల తాలూకు బంధువులుగా పలువురు దంపతులు పీటలపై కూర్చుని ఈ ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ డి.శ్రీరామవర ప్రసాదరావు, పాలకవర్గ సభ్యులు నూకల నాగలక్ష్మణరావు, వెంకటకృష్ణ, రాధాకృష్ణ, వీర ప్రసాద్, నరసింహారావు పాల్గొన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన మహా రుద్రయాగం



శతచండీ సహిత మహారుద్రయాగంలో శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దుర్గగుడి అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఐదు రోజులుగా నిర్వహించిన శత చండీ సహిత మహా రుద్రయాగం సోమవారం వైభవంగా ముగిసింది. ఉదయం మండపారాధన, రుద్రహవనం, చండీహోమం, మూల మంత్ర హవనాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతిని ఆలయ వైదిక కమిటీ సభ్యుడు కోట ప్రసాద్ దంపతులతో ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈఓ భ్రమరాంబ, స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు లింగంభట్ల బద్రీనాథ్‌బాబు, మల్లేశ్వరశాస్త్రి, వైదిక కమిటీ సభ్యుడు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. పూర్ణాహుతి అనంతరం ఆలయ చైర్మన్, ఈఓలకు పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం మహా రుద్రయాగాన్ని దిగ్విజయంగా నిర్వహించామన్నారు. ప్రజలందరికీ మేలు కలగాలని, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యం, కార్యసిద్ధి లభించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కమిషనర్ హరిజవహర్‌లాల్ ఉత్తర్వుల మేర ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఐదు రోజుల పాటు 58 మంది వైదిక, అర్చకులు నిర్వహించిన మహా రుద్రయాగాన్ని ఉదయం, సాయంత్రం వేళ వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారని పేర్కొన్నారు. ఆలయ పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, కేసరి నాగమణి, బుద్ధా రాంబాబు, దేవిశెట్టి బాలకృష్ణ, అనుమోలు ఉదయలక్ష్మి, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమా, ఏఈఓ ఎన్.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతలు ముగ్గురి అరెస్టు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్థానిక హనుమాన్‌పేటలోని గోరా పార్క్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని గవర్నర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద సంచుల్లో నింపి ఉన్న 850 గ్రాముల గంజా యిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను గవర్నర్‌పేట పోలీసు స్టేషన్‌లో సీఐ సురేష్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఆయన కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి జిల్లా మణుగూరు గ్రామానికి రాకేష్ విజయవాడలోని పిన్ని వద్ద ఉంటూ బీసెంట్ రోడ్డులో సేల్స్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. గుణదలకు చెందిన జాడ రోహిత్ కుమార్ సేల్స్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. వారిద్దరు స్నేహితులు. వారికి రిక్షాకార్మికుడుగా జీవిస్తున్న జమ్ముల శ్రీను గంజాయి తీసుకొచ్చి ఇచ్చేవాడు. అలా ముగ్గురికీ పరిచయం ఏర్పడింది. సులువుగా డబ్బులు సంపాదించేందుకు ముగ్గురూ కలిసి గంజాయి విక్రయించడం ప్రారంభించారు. విశాఖ ఏజెన్సీ నుంచి కొందరు వ్యక్తుల ద్వారా గంజాయి తీసుకొచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా గవర్నర్‌పేట పరిసర ప్రాంతాల్లో యువతకు విక్రయిస్తున్నారు. ఈ సమాచారం పోలీసులకు తెలిసింది. ఆ ముగ్గురు గంజాయితో హనుమాన్‌పేటలోని గోరా పార్క్ వద్దకు వచ్చారని తెలుసుకున్న ఎస్ఐ ఫణీంద్ర పోలీసు సిబ్బందితో వెళ్లి వారిని అరెస్టుచేసి, 850 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం నిందితులు ముగ్గురినీ కోర్టుకు తరలించారు. సమావేశంలో ఎస్ఐలు ఫణీంద్ర, విశ్వనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సురేష్

హస్తకళాకారులను ప్రోత్సహించాలి



ప్రదర్శనలో వస్త్రాలను పరిశీలిస్తున్న విజయలక్ష్మి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారత సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపమైన లేపాక్షి హస్త కళాకృతులు ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని లేపాక్షి చైర్ పర్సన్ బి.విజయలక్ష్మి అన్నారు. లేపాక్షి ఉత్పత్తులను ఆదరించి హస్తకళాకారులను ప్రోత్సహించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బందరు రోడ్డులోని బాపు మ్యూజియంలో నిర్వహిస్తున్న లేపాక్షి థిమేటిక్ ఎగ్జిబిషన్‌ను సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వతో కలిసి విజయలక్ష్మి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వినియో గదారులను ఆకర్షించేలా పేద కళాకారులు రూపొందించిన లేపాక్షి కళాకృతుల ప్రదర్శన నగర ప్రజలను విశేషంగా ఆకర్షిస్తోందన్నారు. దళారీ వ్యవస్థకు తావు లేకుండా ఉత్పత్తిదారులే నేరుగా విక్రయిస్తున్నందున మార్కెట్ విలువ కంటే తక్కువ ధరకే ఉత్పత్తులు లభిస్తాయన్నారు. ప్రభుత్వం హస్త కళాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా హస్తకళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు విజయలక్ష్మి తెలిపారు. లేపాక్షి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.విశ్వ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హస్త కళాకారులను ప్రోత్సహించేందుకు ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తోందన్నారు. నూతన డిజైన్‌లపై శిక్షణ, పెన్షన్లు, రుణాలు ఇస్తోందని వివరించారు. నేత వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్స్, బ్లాక్ మెటల్ వస్తువులు, నిర్మల్ పెయింటింగ్స్ వంటి రకాల వస్తువులు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు లేపాక్షి హస్తకళా ప్రదర్శన కొనసాగుతుందని పేర్కొన్నారు. లేపాక్షి మేనేజర్లు ఎం.సురేష్, రామకృష్ణ, రాష్ట్ర బీసీ సంక్షేమ ప్రధాన కార్యదర్శి బి.చంద్రమౌళి, సిబ్బంది టి.రాజశేఖర్, పి.శివ పాల్గొన్నారు.

వైద్యులు మానవత్వంతో సేవలందించాలి

గుంటూరు మెడికల్: వైద్యులు మానవత్వంతో సేవలు అందించాలని ప్రముఖ గుండె మార్పిడి శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణగోఖలే అన్నారు. గుంటూరు వైద్య కళాశాల జింకాన ఆడిటోరియంలో అవార్డ్స్ ప్రదానోత్సవం సోమవారం జరిగింది. వైద్య కళాశాలలో చదువుతూ పీజీ, యూజీ పరీక్ష ఫలితాల్లో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానాలు పొందిన పలువురికి మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. డాక్టర్ గోపాలకృష్ణగోఖలే మాట్లాడుతూ.. వైద్యులు నిజాయితీగా ఉండాలని సూచించారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతీదేవి మాట్లాడుతూ వైద్య విద్యార్థులంతా కష్టపడి ఉన్నత స్థానాలు అధిరోహించాలన్నారు. వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ వైద్య విద్యార్థులు చేస్తున్న సేవలను కొనియాడారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ విద్యార్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసేందుకు తల్లిదండ్రులు ఎంతో కష్టపడతారని, డాక్టర్ కోర్సు పూర్తి అవగానే విద్యార్థుల కంటే తల్లిదండ్రులే ఎక్కువగా ఆనందపడతారని చెప్పారు. గుంటూరుకు చెందిన డాక్టర్ ఎస్.భాగ్యలక్ష్మి 2019 బ్యాచ్‌లో గైనకాలజీలో అత్యధిక మార్కులు సాధించినందుకు గోల్డ్‌మెడల్, ప్రశంసా పత్రం అందుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి, డాక్టర్ చంద్రకళ పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులకు అండగా సంక్షేమ వేదిక



మాట్లాడుతున్న డాక్టర్ కుందా శ్రీధర్

సత్యనారాయణపురం (విజయవాడ సెంట్రల్): బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో పేద బ్రాహ్మణులకు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని డాక్టర్ కుందా శ్రీధర్ అన్నారు. బ్రాహ్మణ సంక్షేమ వేదిక సర్వసభ్య సమావేశం సత్యనారాయణపురంలోని కుందా హాస్పిటల్ ప్రాంగణంలో సోమవారం జరిగింది. ముఖ్య అతిథి శ్రీధర్ మాట్లాడుతూ.. బ్రాహ్మణ సంక్షేమ వేదిక విజయవాడలో నిర్వహించే సేవా కార్యక్రమాల్లో తన వంతు సహాయ సహకారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే తమ హాస్పిటల్‌లో పేద బ్రాహ్మణులకు రాయితీతో వైద్యసేవలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. బ్రాహ్మణ సంక్షేమ వేదిక వ్యవస్థాపక కార్యదర్శి బాలశ్రీనివాసులు మాట్లాడుతూ.. నగరంలో బ్రాహ్మణ సంక్షేమ పథకాలను విస్తరించడానికి ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశామన్నారు. సమాజంలో అన్ని రంగాల్లో వెనుకబడిన బ్రాహ్మణులు ఐక్యమత్యంతో రాజకీయాలలో బలపడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామీణ ఆలయాల్లో పురోహితులు తగ్గిపోయారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రతి నెలా వివాహ పరిచయ వేదికలు నిర్వహించి ఉచితంగా వివాహసమాచారాన్ని అందిస్తామని తెలిపారు. వివాహం కాని బ్రాహ్మణ యువత తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. రాజకీయ విశ్లేషకుడు రమణమూర్తి, శ్రీ కంఠ గురుపీఠం వ్యవస్థాపకుడు కామేశ్వరశర్మ, నగర కన్వీనర్ కుందా శ్రీకృష్ణ, ఆంజనేయులు, శ్రీనివాస్, వెంకట్, సదాశివ శాస్త్రి పాల్గొన్నారు.

స్వర్ణభారత్ ట్రస్ట్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు

ఉంగుటూరు(గన్నవరం): మండలంలోని ఆత్కూరు గ్రామంలో ఉన్న స్వర్ణభారత్ ట్రస్ట్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో శిక్షణ పొందేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ పరదేశి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలలు పాటు ఈ కోర్సు కొనసాగుతుందని పేర్కొన్నారు. రోజూ ప్రాక్టికల్స్, చివరి పది రోజులు స్టార్ హోటళ్లలో శిక్షణ ఇస్తామని వివరించారు. కనీస విద్యార్హత 10వ తరగతి అని, 18 నుంచి 35 ఏళ్లలోపు యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రాలతో అందజేసి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 93479 56659, 90322 22852 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విజయవాడ నగరపాలక సంస్థ
షార్టు టెండరు-కం-బహిరంగ వేలము ప్రకటన

ఆర్.సి.యస్. 5-100217/2015-E.No. 27332 తేది : 06-03-2023

2023 సంవత్సరము మామిడికాయల సీజన్ నందు విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని మామిడికాయల విక్రయదారుల నుండి 'అడ్మినిస్ట్రేటివ్ సెస్' ఛార్జీలను వసూలు చేసుకొను హక్కును టెండర్-కం-బహిరంగవేలము ద్వారా లీజుకిచ్చుటకు గాను టెండర్లు ఆహ్వానించబడుచున్నవి.

షెడ్యూల్ వివరములు

వ. నెం	లీజు వివరములు	లీజు వసూలు చేసుకొను ప్రదేశము (Area)	ఆఫీసు వారు నిర్ణయించిన కనీస లీజు మొత్తము రూ.	ధరావత్తు (E.M.D.) రూ.	టెండరు షెడ్యూల్ ఖరీదు ఒక్కింటికి రూ.	లీజు కాలపరిమితి
1	2	3	4	5	6	7
1.	2023 సంవత్సరము మామిడికాయల సీజన్ నందు అడ్మినిస్ట్రేటివ్ సెస్ వసూలు చేసుకొను హక్కు ఇచ్చుట కొరకు	విజయవాడ నగర పరిధి లో (సర్కిల్-I, II & III ఏరియాల లో)	16,66,666/-	4,16,700/-	5,000/-	CESS వసూలు చేసు కొను హక్కును లీజుదారుడు లీజు సైకమును పూర్తిగా చెల్లించిన తదుపరి మార్చి 2023 నుండి జూలై 2023 వరకు

టెండరు షెడ్యూల్ జారీ చేయు కాలవ్యవధి : ది. 07-03-2023 నుండి 13-03-2023 వరకు (ఉ. 11.00 గం॥ల నుండి సా. 4.00 గం॥ల వరకు)

టెండరు దాఖలు చేయు సమయము : ది. 14-03-2023 ఉ. 11.00 గం॥ల నుండి మ. 2.00 గం.ల వరకు

బహిరంగ వేలము నిర్వహించు సమయము : ది. 14-03-2023 సా॥ 4.00 గం॥లకు

టెండరు షెడ్యూలు పొందుటకు, దాఖలు చేయు మరియు బహిరంగ వేలము నిర్వహించు ప్రదేశము : ఎస్టేట్ సెక్షన్, సత్యనారాయణపురం లోని సర్కిల్-II కార్యాలయము ఆవరణ.

ఇతర వివరముల కొరకు సత్యనారాయణపురంలోని సర్కిల్-II కార్యాలయము ఆవరణలో గల ఎస్టేట్ సెక్షన్ నందు ఆఫీసు పనిచేయు వేళలలో పొందవచ్చును.

– కమీషనరు

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

చిలకలపూడి(మచిలీపట్నం): పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో అదనపు తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు రోజూ సాయంత్రం వేళ అల్పాహారం పంపిణీ చేస్తామని కృష్ణా డీఈఓ తాహెరా సుల్తానా సోమవారం తెలిపారు. విద్యార్థులు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాఠశాలలో ఉండి చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక సహకారంతో ఉమ్మడి జిల్లాలో టెన్త్ విద్యార్థులకు 32 రోజుల పాటు గోధుమ రవ్వతో అల్పాహారం, శనగలు పంపిణీ చేస్తామని వివరించారు. ఇప్పటికే గోధుమ రవ్వ, శనగలను ఉప విద్యాశాఖాధికారుల కార్యాలయాలకు పంపించామని తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన శివప్రసాద్

కంచికచర్ల(నందిగామ): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని కీసర గ్రామానికి చెందిన కస్తాల శివ ప్రసాద్ టోల్‌ప్లాజాలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తుంటాడు. గ్రామంలోనే పాలు తీసుకువద్దామనుకుని పాల కేంద్రం వద్దకు బైక్‌పై వెళ్లి వచ్చే క్రమంలో జాతీయ రహదారిని దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శివప్రసాద్‌ను నేషనల్ హైవే అంబులెన్స్ వాహన సిబ్బంది నందిగామలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మండలంలోని కీసర టోల్‌ప్లాజా వద్ద ఆదివారం రాత్రి సమయంలో ఆగివున్న ట్రక్కు ఆటోను బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న గండేపల్లి గ్రామానికి చెందిన ఎన్.గోపీచంద్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సమాచారం అందుకున్న నేషనల్ హైవే అంబులెన్స్ వాహన సిబ్బంది క్షతగాత్రుడిని వైద్యం కోసం నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దొంగ నోట్ల కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

విజయవాడ స్పోర్ట్స్: దొంగ నోట్ల మార్పిడి కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి డి.లక్ష్మి సోమవారం తీర్పు చెప్పారు. కడప జిల్లా వేముల మండలం చాగలేరు గ్రామానికి చెందిన బొగ్గుల భాస్కరరెడ్డి, నందలూరు మండలం రాచపల్లి గ్రామానికి చెందిన యలమరాజు విజయరామరాజు 2014 డిసెంబర్ 17వ తేదీన విజయవాడ రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా సత్యనారాయణపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.4.19 లక్షల దొంగ నోట్లను పోలీసులు గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చారు. దర్యాప్తు జరుగుతున్న సమయంలోనే విజయరామరాజు అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ జి.కల్యాణి కోర్టులో వాదనలు వినిపించారు. ముగ్గురు సాక్షులను విచారించిన అనంతరం మరో నిందితుడు బొగ్గుల భాస్కరరెడ్డిపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

భర్త, అత్త వేధింపులతో యువతి ఆత్మహత్య

మధురానగర్(విజయవాడసెంట్రల్): భర్త, అత్త వేధింపులకు తాళలేక ఒక యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుడివాడకు చెందిన డి.లక్ష్మి ద్వితీయ కుమార్తె దివ్య(21)తో విజయవాడ న్యూ ఆర్ఆర్‌పేటకు చెందిన కె.విజయ్‌కు 2019లో వివాహమైంది. దివ్య, విజయ్ దంపతులకు కుమారుడు జన్మించాడు. వివాహమైన కొత్తలో దివ్యను అత్తింటివారు బాగానే చూసుకున్నారు. తరువాత నుంచి ఆమెను భర్త, అత్త శారీరకంగా, మానసికంగా వేధించటం ప్రారంభించారు. విజయ్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని దివ్యను కొట్టడంతోపాటు చనిపోవాలంటూ బెదిరించేవాడు. దివ్యతో విజయ్ ఆదివారం గొడవపడి కొట్టి, చావమంటూ బయటకు వెళ్లిపోయాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన దివ్య భర్త బయటకు వెళ్లగానే చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దివ్య తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు 498ఏ, 323, 306 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాలికతో అసభ్య ప్రవర్తన.. నిందితుడికి ఐదేళ్ల జైలు

కంకిపాడు(గన్నవరం): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. మండలంలోని కోలవెన్ను గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన ధయాన కోటేశ్వరరావు మాట్లాడాలని పిలిచి, అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో 2015 అక్టోబర్ 15వ తేదీన కేసు నమోదైంది. నిందితుడు ధయాన కోటేశ్వరరావును పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. నిందితుడిపై 376 ఆర్/డబ్ల్యూ 511, 341, 354 ఐపీసీ, పోక్సో 2012 సెక్షన్‌ల కింద కేసు నమోదుచేశారు. విజయవాడ కోర్టు ఆఫ్ ది స్పెషల్ జడ్జి ఫర్ ట్రయల్ ఆఫ్ అఫెన్సెస్ అండర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి డాక్టర్ ఎస్.రజని ఈ కేసు పూర్వాపరాలు పరిశీలించారు. స్పెషల్ పీపీ జి.నాగిరెడ్డి, సిఎంఎస్ సిబ్బంది పర్యవేక్షణలో 11 మంది సాక్షులను విచారించారు. నిదితుడిపై నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

క్లుప్తంగా

మహిళలకు ఆటల పోటీలు

కృష్ణలంక(విజయవాడతూర్పు):అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం తూర్పు నియోజకవర్గం పరిధిలోని స్వయం సహాయక సంఘం మహిళలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. రాణిగారితోట, 18వ డివిజన్‌లోని సిమెంట్ గోడౌన్స్‌లో మెప్మా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముగ్గుల పోటీలు, లెమన్ స్పూన్ మ్యూజికల్ చైర్స్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. పీవో యూసీడీ శకుంతల, జోనల్ కమిషనర్ కృష్ణారావు, సీడీవోలు, సోషల్ వర్కర్స్, సీవోలు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్):మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధి ఆధారిత ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ కోర్సులో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన కళాశాలలోని స్కిల్ హబ్‌లో నూతన కోర్సును ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఇంటర్ డిప్లమో, డిగ్రీ పూర్తిచేసిన వారు కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. ఈ నెల 10వ తేదీన ఎంట్రన్స్ ఎగ్జామ్ నిర్వహించి కోర్సును ప్రారంభిస్తామన్నారు. ఈ కోర్సు పూర్తిచేసిన వారికి ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ యువకులు రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

నేడు విజయ ఫార్మసీలో మహిళా లీగ్-2023 పోటీలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళా ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర స్థాయిలో మహిళా లీగ్ -2023 పోటీలు ఫైనల్స్‌ను (మహిళ అధ్యాపకులకు) మంగళవారం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, ఏపీటీఐ ఉమెన్స్ ఫోరం కన్వీనర్ కె.పద్మలత తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 130 కళాశాలల నుంచి మహిళా అధ్యాపకులు పాల్గొంటారని వివరించారు. టీచింగ్, సైంటిఫిక్, కల్చరల్ విభాగాల్లో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 8 జోన్లలో జోనల్ లెవల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జోనల్ లెవల్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళా అధ్యాపకులకు మంగళవారం ఫైనల్ పోటీలు నిర్వహిస్తారు.

భక్తులకు 2 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధం



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన తిరునాళ్ల వేడుకలకు అంతా సిద్ధమైంది. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే ఐదు రోజుల ఉత్సవాలకు సంబంధించి భక్తులకు 2 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేశారు. అవసరమైతే అప్పటికప్పుడు ప్రసాదాలు తయారు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు అన్నారు. ఉత్సవాలు జరిగే ఐదు రోజులు రాత్రి సమయంలో ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల విజయానికి అందరూ సహకరించాలని కోరారు.

గాయపడ్డ మహిళ మృతి

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ ఘటనపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు... ఈ నెల నాలుగో తేదీన విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన మాలపాటి సీతమ్మ (47) పాయకాపురానికి చెందిన గొట్టిపాటి దుర్గాప్రసాద్ ద్విచక్రవాహనంపై నెప్పల్లి గ్రామం నుంచి విజయవాడ వైపు వెళ్తున్నారు. వారి వాహనం గోసాల సెంటరుకు చేరుతున్న క్రమంలో కంకిపాడు నుంచి విజయవాడ వైపు వస్తున్న కారు వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై నుంచి సీతమ్మ, దుర్గాప్రసాద్ కిందపడ్డారు. సీతమ్మ తలకు బలమైన గాయాలు కావడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందింది. ఆస్పత్రి వర్గాల సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

26న నగర కమిటీ మహాసభ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):ఈ నెల 26 తేదీన ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం విజయవాడ నగర కమిటీ మహాసభను నగరంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రవిచంద్ర చెప్పారు. మహాసభ విజయవంతం కావాలని కోరుతూ సోమవారం మొగల్రాజపురం సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ దగ్గర ప్రచారం నిర్వహించారు. రవిచంద్ర మాట్లాడుతూ ఐఎఫ్‌టీయుకు అనుబంధంగా ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం ఉందన్నారు.

ఈ మహాసభలో ఆటో కార్మికుల సమస్యలపై చర్చిస్తామన్నారు. ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నగర అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, సంఘం సభ్యులు డి.శ్రీధర్ బాబు, వై.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణతే లక్ష్యంగా తరగతులు

- పదో తరగతి విద్యార్థులపై శ్రద్ధ
- ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్న అధికారులు
- జిల్లాలో పరీక్షలకు హాజరుకానున్న 30 వేల మంది విద్యార్థులు



కొత్తపేట హిందూ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న ఎన్టీఆర్ జిల్లా విద్యార్థుల ఉత్తీర్ణతే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు అత్యంత కీలకమైనవి. హైస్కూల్ పూర్తి చేసుకొని, వివిధ రంగాలను ఎంచుకొని ఇంటర్మీడియట్‌లో చేరేందుకు పదో తరగతి చాలా ముఖ్యమైన పరీక్ష కావటంతో అధికారులు, ఉపాధ్యాయులు చాలా శ్రద్ధ చూపుతూ చర్యలు చేపడుతున్నారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మరింత సమర్థవంతంగా సిద్ధమయ్యేందుకు ప్రభుత్వ విద్యాశాఖ నూతన టైంటేబుల్‌ను రూపొందించింది. దాని ప్రకారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ సబ్జెక్ట్‌ల వారీగా నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధనా తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ తయారు చేసిన స్టడీ మెటీరియల్‌తో పాటుగా వివిధ ఉపాధ్యాయ సంఘాల రూపొందించిన మెటీరియల్‌తో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

జిల్లా నుంచి హాజరుకానున్న 30 వేల మంది

ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 450 విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. సుమారు 220 వరకూ జిల్లా పరిషత్ హైస్కూల్స్ ఉండగా, సుమారు 50 వరకూ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగే విద్యాసంస్థలు ఉన్నాయి. అలాగే మిగిలినవి ఎయిడెడ్, ప్రైవేట్ యజమాన్యాల పరిధిలో ఉన్నాయి. వీటి నుంచి త్వరలో జరిగే పరీక్షకు 30 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ నెల తొమ్మిది నుంచి 17వ తేదీ వరకూ ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతుండగా, ఏప్రిల్ మూడో తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇటీవల వరకూ జరిగిన పరీక్షల ఆధారంగా గ్రేడ్‌ల వారీగా విభజించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్‌తో వారు ఉత్తీర్ణులయ్యే విధంగా తీర్చిదిద్దుతున్నారు. ఎప్పటికప్పుడు విద్యాశాఖ అధికారులు సైతం పర్యవేక్షణ చేస్తున్నారు.



స్టడీ మెటీరియల్ బాగుంది

అధికారులిచ్చిన స్టడీ మెటీరియల్ చాలా బాగుంది. స్టడీ మెటీరియల్ ద్వారా చాలా అంశాలపై పట్టు సాధించేందుకు వీలుగా ఉంది. ఉపాధ్యాయులు సైతం మా పట్ల చాలా శ్రద్ధ చూపించి తీర్చిదిద్దుతున్నారు. కె.అక్షయ



మంచి మార్కులే లక్ష్యం

మంచి మార్కులే లక్ష్యంగా చదువుతున్నాము. ఏడాది మొత్తం చదివిన చదువుతో మంచి మార్కులు సాధించాలని నిర్ణయించుకున్నాను. దానికి తోడు ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న తరగతులు చాలా ఉపకరిస్తున్నాయి. అశోక్‌కుమార్



సాయంత్రం వరకూ తరగతులు

మా పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ తరగతులు నిర్వహిస్తున్నారు. మోడల్ ప్రశ్నాపత్రాలతో పరీక్షకు హాజరయ్యే విధంగానే వివిధ టెస్టులు నిర్వహించి లోటుపాట్లను గుర్తిస్తున్నారు. దాంతో మాకు చాలా నమ్మకం పెరిగింది. విజయశ్రీ

సంక్షేమ పథకాలతో ఎంతో లబ్ధి

గడప గడపకు మన ప్రభుత్వంలో లబ్ధిదారులు



పింఛను లబ్ధిదారులతో మాట్లాడుతున్న అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): సంక్షేమ పథకాల అమలుతో ఎంతో లబ్ధి పొందుతున్నామని పలువురు ఆనందం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాణిగారితోట, 18వ డివిజన్ 83 వార్డు సచివాలయాల పరిధిలోని బాలస్వామి వీధిలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలతో తాము అందుకున్న ఆర్థిక ప్రయోజనాల గురించి వివరించి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. జింక ఈడుజోన్దలు అనే వృద్ధుడు మాట్లాడుతూ తన కుటుంబానికి వైఎస్సార్ ఆసరా, జగనన్న అమ్మఒడి, ఇంటి స్థలం పథకాల ద్వారా రూ.6 లక్షల 37 వేలు లబ్ధి చేకూరిందని చెప్పారు. ఇంత మొత్తంలో లబ్ధి ఏ ప్రభుత్వంలో పొందలేదని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఆనందం వ్యక్తం చేశారు. భువనేశ్వరి అనే మహిళ మాట్లాడుతూ ఆసరాతో కొండంత అండ లభించిందన్నారు. ఓబులమ్మ మాట్లాడుతూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా 1వ తేదీన ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు తెలిపారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ స్థానిక కార్పొరేటర్, వీఎంసీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో కలిసి 404 గడపలను సందర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సంక్షేమ పథకాల లబ్ధి వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

పారిశ్రామిక అభివృద్ధితో యువతకు ఉపాధి

అవినాష్ మాట్లాడుతూ రాష్ట్రానికి విస్తృతంగా పరిశ్రమలను ఆహ్వానించి వారికి తగిన మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పారిశ్రామికాభివృద్ధితో చదువుకున్న యువతకు రాష్ట్రంలోనే ఉద్యోగాలు లభిస్తాయన్నారు. డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి



ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న డాక్టర్ ఇండ్ల స్వప్న తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు):విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలని నేత్ర వైద్యురాలు ఇండ్ల స్వప్న తెలిపారు. మహాత్మాగాంధీరోడ్డులోని సెయింట్ జాన్స్ పాఠశాల 38వ వార్షిక బహుమతి ప్రదానోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, విద్యేతర సామర్థ్యాలు, క్రీడారంగాల్లో రాణించిన చిన్నారులకు బహుమతులు అందచేశారు. వందశాతం హాజరు ఉన్న విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందచేశారు. డాక్టర్ ఇండ్ల స్వప్నతో పాటు, విజయవాడ రూరల్ ఎంఈఓ ఎ.వెంకటరత్నం అతిథులుగా హాజరై చిన్నారులకు బహుమతులు అందచేశారు. పాఠశాల ప్రెసిడెంట్ టి.మోనికాసుమన్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్‌లు ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. చిన్నారులకు చక్కని ప్రోత్సహమిస్తూ, వివిధ రంగాల్లో వారిని తీర్చిదిద్దేలా శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు, సిబ్బందిని అభినందించారు. రాబోయే విద్యాసంవత్సరంలో చిన్నారులు మరిన్ని విజయాలు సాధిస్తారని ఆకాంక్షించారు.

పవర్ లిఫ్టింగ్‌లో పేట విద్యార్థిని ప్రతిభ



తిరుపతమ్మను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: 10 వ అంతర్ కృష్ణాజిల్లా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాల విద్యార్థి ఎం.తిరుపతమ్మ రెండు బంగారు పతకాలను సాధించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వై.అంకయ్య, కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు ఆమెను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పట్టణంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం క్రీడా వికాస కేంద్రంలో నిర్వహించిన 10 వ అంతర్ కృష్ణాజిల్లా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఎక్విప్‌డ్, అన్ ఎక్విప్‌డ్ విభాగం జూనియర్, సీనియర్ విభాగంలో 57 కేజీల కేటగిరిలో తిరుపతమ్మ రెండు గోల్డ్ మెడల్స్ సాధించి, జూనియర్, సీనియర్ విభాగంలో స్ట్రాంగ్ ఉమెన్‌గా నిలిచిందన్నారు. ఆమెకు కోచ్‌గా గంటా వెంకటేశ్వర్లు వ్యవహరించారని తెలిపారు. కళాశాల సెక్రటరీ కె.సాయిబాబు, ఏవో కె.సత్యనారాయణరావు, పీడీ.జి.రవి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

సైన్స్ ఎక్స్‌పో ప్రతిభావంతులకు అభినందనలు



బహుమతులు సాధించిన విద్యార్థులతో వైస్ ప్రిన్సిపల్ తరుణ్

గుణదల(విజయవాడ తూర్పు): ఆంధ్ర లయోల కళాశాలలో ఇటీవల జరిగిన సైన్స్ ఎక్స్‌పోలో తమ పాఠశాల విద్యార్థులు మంచి కనబరచి బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ కె.రామభారతి తెలిపారు. పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు ఆంధ్ర లయోలా కళాశాలలో సైన్స్ ఎక్స్ పో జరిగిందన్నారు. బయోలాజికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ అంశాల్లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. బయోలాజికల్ సైన్స్‌లో సస్టైనబుల్ మెన్సురేషన్, ప్రాజెక్టుకు గాను మైత్రేయి (9వ తరగతి), షణ్ముఖ ప్రియ (8వ తరగతి), నిత్య శ్రీ (8వ తరగతి) లకు మొదటి బహుమతి లభించిందన్నారు. ఫిజికల్ సైన్సెస్‌లో రీసైకిల్ బ్యాటరీస్ ఈ బైక్ ప్రాజెక్టుకు జూనియర్స్ విభాగంలో షణ్ముఖ సాయి (9వ తరగతి), లాలిత్య (9వ తరగతి), అనన్య (9వ తరగతి)లకు బహుమతులు సాధించారని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ తరుణ్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు.

ఘనంగా షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్):మారుతీ వ్యాయామశాల సత్రావారివీధిలోని షిరిడీ సాయిబాబా మందిరం 17వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కాకడ హారతితో వేడుకలు ప్రారంభమయ్యాయి. 6 గంటలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, 8 గంటలకు స్వామివారికి సహస్ర గులాబీపూజ చేశారు. లోక కళ్యాణార్థం లక్ష్మీగణపతి సాయిమూల మంత్రహోమం, దత్త హోమం, నవగ్రహ హోమం, నక్షత్రహోమంలను వేదపండితులు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. సుమారు రెండువేల మంది భక్తులు బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ట్రస్టీ ఎం.దుర్గాప్రసాద రామకోటేశ్వరరావు శర్మ, ఎం.ప్రశాంత్ విశ్వనాథ్ శర్మ, అర్చక స్వామి కోమందూరి రఘురామ్ పర్యవేక్షించారు.

మర్లపాలెం వద్ద రైల్వే ఫ్లై ఓవర్ పనులు ప్రారంభం



మర్లపాలెం వద్ద పిల్లర్లపై ఏర్పాటు చేస్తున్న గడ్డర్లు

గన్నవరం: మండలంలోని చిన్నఅవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు నిర్మిస్తున్న ఎన్‌హెచ్-16 జాతీయ రహదారి బైపాస్ నిర్మాణంలో కీలకమైన మర్లపాలెం వద్ద రైల్వే ఫ్లైఓవర్ పనులు ప్రారంభమయ్యాయి. హౌరా-చెన్నై రైల్వే మార్గంపై ఫ్లైఓవర్ నిర్మాణం కోసం గతంలోనే రైల్వేట్రాక్‌కు ఇరువైపులా పిల్లర్ల నిర్మాణం చేశారు. ఈ పిల్లర్లపై ఐరన్ గడ్డర్ల ఏర్పాటు ద్వారా రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. విజయవాడ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు చిన్నఅవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు 30 కిలోమీటర్ల పొడవునా ఆరు లైన్ల రహదారి నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే 75 శాతం బైపాస్ నిర్మాణం పూర్తి కాగా, కీలకమైన మర్లపాలెం, గొల్లపూడి సమీపంలో రైల్వేట్రాక్‌లపై ఫ్లైఓవర్ల నిర్మాణ పనులను మెగా ఇంజినీరింగ్ సంస్థ ప్రారంభించింది. విద్యుద్దీకరణ కలిగిన ఈ ట్రాక్‌పై ఫ్లైఓవర్ల నిర్మాణానికి రైల్వేశాఖ నుంచి అనుమతులు రావడంతో పనులను వేగవంతం చేస్తున్నారు. మర్లపాలెం రైల్వేట్రాక్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం కోసం ట్రాక్‌కు ఇరువైపులా రెండు వరుసలుగా నాలుగు పిల్లర్లను నిర్మించారు. ప్రస్తుతం ఈ పిల్లర్లపై భారీ క్రేనులతో ఐరన్ గడ్డర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ గడ్డర్ల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తిచేసి రోడ్డు నిర్మాణం చేసేందుకు ఎన్‌హెచ్ఏఐ, రైల్వే శాఖ అధికారులు, మెగా ఇంజనీరింగ్ సంస్థ సమన్వయంతో ముందుకు వెళ్తున్నారు.

స్పందన సమస్యలు పెండింగ్ ఉంచొద్దు

మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్

పటమట(విజయవాడతూర్పు):నగరంలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి వస్తే వాటిని పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన స్పందనలో నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 24 అర్జీలు రాగా అందులో పట్టణ ప్రణాళిక విభాగంపై -9, ఇంజినీరింగ్ -3, యు.సి.డి-3, పబ్లిక్ హెల్త్ విభాగం -6, రెవెన్యూ-2, జాయింట్ డైరెక్టర్ (అమృత్) -1 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నగరపాలక సంస్థ ద్వారా కల్పిస్తున్న మౌలిక సదుపాయాల్లో ఎలాంటి అవాంతరాలు రాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చే అర్జీలు, పరిష్కరించిన వాటి వివరాలను ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని సూచించారు. అదనపు కమిషనర్ (జనరల్) యం.శ్యామల, అధనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజనీర్ యం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, పట్టణ సాధికారత విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి) శకుంతల, డిప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) డి.వెంకటలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ కె.బి.ఎన్.ఎస్ లతా, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, ఏ.డి.హెచ్ శ్రీనివాసు, మేనేజర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శరవేగంగా రహదారుల అభివృద్ధి

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



దేవినేని నెహ్రూ విగ్రహానికి పూల మాల వేస్తున్న అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు):నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్‌లలో రహదారుల అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. 2వ డివిజన్ గుణదల కుమ్మరిబజార్ ప్రాంతంలో ఓ వీధికి సంగెపు కోటి నాగులు పేరును ఖరారు చేసి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత తన తండ్రి దేవినేని రాజశేఖర్ నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అవినాష్ మాట్లాడుతూ ఈ డివిజన్‌కు గతంలో కార్పొరేటర్‌గా పనిచేసిన సమయంలో కోటి నాగులు ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. అయన చేసిన అభివృద్ధికి చిహ్నంగా ఈ రోడ్డుకు కోటి నాగులు పేరును పెట్టామన్నారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు, యూజీడీ వంటి సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు అంబడిపూడి నిర్మలాకుమారి, భీమిశెట్టి ప్రవల్లిక, మాజీ కార్పొరేటర్ కోటినాగులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి భక్తులకు సేవలు అందించండి

కలెక్టర్ ఢిల్లీరావు



జిల్లా కలెక్టర్‌కు అమ్మవారి చిత్రం పటం అందజేస్తున్న దుర్గగుడి పాలక మండలి సభ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసే భక్తుల మనోభావాలకు అనుగుణంగా సేవలందించి ఆలయ ప్రతిష్టను మరింత ఇనుమడింప చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆలయ పాలక మండలి సభ్యులకు సూచించారు. నూతన పాలక మండలి సభ్యులు సోమవారం కలెక్టర్ ఢిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మట్లాడుతూ రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో రెండో స్థానంలో ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఎంతో విశిష్టతను సంతరించుకుందని చెప్పారు. ఆలయ దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో నమ్మకంతో నూతన పాలక మండలి సభ్యులను నియమించారని పేర్కొన్నారు. పాలక మండలి సభ్యులు సమన్వయంతో పని చేసి ఆలయ అభివృద్ధికి, భక్తుల మౌలిక వసతుల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి పాలక మండలి తీసుకునే నిర్ణయాలకు జిల్లా యంత్రాంగం పక్షాన పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. భక్తులకు త్వరగా అమ్మవారి దర్శన భాగ్యం కల్పించేలా కృషి చేయాలన్నారు. పాలక మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు, సభ్యులు కేసరి నాగమణి, కట్టా సాంబయ్య, బుద్దా రాంబాబు, దేవిశెట్టి బాలకృష్ణ, అనుమోలు ఉదయ లక్ష్మి ఉన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం



మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ రాజారామ్

మధురానగర్(విజయవాడసెంట్రల్):విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, 5వ ముఖ్య మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పి.రాజారామ్ సూచించారు. ముత్యాలంపాడు అజయ్ హైస్కూల్లో సోమవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మహిళల కోసం ఉన్న చట్టాలు వాటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలో వివరించారు. మారుతున్న కాలానుగుణంగా మహిళల కోసం ఎన్నో చట్టాలను చేసిందని వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి మహిళ ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడు చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ప్యానల్ న్యాయవాది పగిడిపల్లి రాము, పాఠశాల ప్రిన్సిపాల్ ఏపుగంటి లక్ష్మీఅపర్ణ మాట్లాడారు. కెఎస్ జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగం ప్రమాదకరం



మాట్లాడుతున్న శేఖర్‌బాబు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):మాదకద్రవ్యాలను తీసుకోవటం నిప్పుతో చెలగాటమాడటమేనని నవజీవన్ బాలభవన్ ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ గోళ్ళమూడి శేఖర్‌బాబు అన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో పాతబస్తీలోని మహ్మదాలీపురం నగర పాలక సంస్థ హైస్కూల్లో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే ప్రమాదాల గురించి అవగాహన సదస్సు సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖరబాబు మాట్లాడుతూ మత్తు పదార్థాల వ్యసనం అనేది చాలా ప్రమాదమన్నారు. మత్తు పదార్థాలు సేవించినా, కలిగి ఉన్నా రెండూ నేరమేనని చెప్పారు. మాదకద్రవ్యాలు వినియోగం వలన శారీరకంగా, మానసికంగా, సామాజిక పరంగా, ఆర్థికపరంగా నష్టపోతారన్నారు. మత్తు పదార్థాలు పీల్చేవారి మానసిక స్థితి క్రమేణా అధ్వానమవుతుందన్నారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

పెనమలూరు: కోడిపందేలు ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేశారు. సీఐ ఆర్.గోవిందరాజు కథనం మేరకు.. పెదపులిపాక గ్రామ పరిధిని ప్లాట్‌లలో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేశారు. 9 మందిని అరెస్టు చేసి, వారి వద్ద 9 బైక్‌లు, ఆరు సెల్ ఫోన్‌లు, రెండు పుంజులు, రెండు కత్తులు, రూ.2700 స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా...

10న సీబీఐ విచారణకు హాజరవుతా

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



వేంపల్లె: ఈ నెల 10న హైదరాబాద్‌లో సీబీఐ విచారణకు హాజరవుతానని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చెప్పారు. సోమవారం విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. సీబీఐ అధికారులు ఆదివారం మూడోసారి నోటీసులిచ్చారని.. ఆ మేరకు 10న హాజరై వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తానన్నారు. తన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి కూడా 12న కడప సెంట్రల్ జైలు వద్ద విచారణకు హాజరై సీబీఐ అడిగే ప్రశ్నలకు సమాధానం ఇస్తారని తెలిపారు.

పోలీసుల అదుపులో పరమేశ్వరరెడ్డి?

పులివెందుల : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అనుమానితుడు కసనూరు పరమేశ్వరరెడ్డి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. వివేకా హత్య కేసులో ఏ3 నిందితుడిగా ఉన్న గజ్జెల ఉమాశంకర్‌రెడ్డి భార్య స్వాతిపై శనివారం పరమేశ్వరరెడ్డి, అతడి కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డిలు దాడి చేసిన విషయం విదితమే. ఆదివారం స్వాతి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తండ్రీకుమారుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సోమవారం పులివెందులలోని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పరమేశ్వరరెడ్డికి వైద్య పరీక్షలు నిర్వహించారని, మంగళవారం కోర్టుకు హాజరుపరిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

టీడీపీ హయాంలోనే బీసీల అభివృద్ధి

టీడీపీ నేత నారా లోకేశ్



పీలేరు : టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీల అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ నాయకుడు నారా లోకేశ్ అన్నారు. సోమవారం నారా లోకేశ్ యువగళం పాదయాత్ర అన్నమయ్య జిల్లా పీలేరులోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమైంది. వేపులబైలు పంచాయతీ మదరసా వద్ద బీసీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా, నిధులు కేటాయించింది శూన్యమని ఆరోపించారు. అనంతరం కలికిరి వరకు పాదయాత్ర నిర్వహించారు. కలికిరి సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్‌రెడ్డి తన అనుచరులతో లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరకు పిప్పితో కాసుల పంట

బ్రికెట్ల తయారీ ద్వారా రైతులకు అదనపు ఆదాయం

- మెజారిటీ రైతులు బెల్లం తయారీకే ఉపయోగిస్తున్నారు
- పిప్పిని బ్రికెట్ల రూపంలోకి మార్చి రెస్టారెంట్లు, హోటళ్లకు విక్రయం
- కప్పులు, ప్లేట్లు కూడా తయారు చేసే అవకాశం
- టన్నుకు రూ.5,000 నుంచి రూ.5,500 వరకు ఆదాయం
- ఫలించిన అనకాపల్లి బెల్లం పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తల కృషి



బ్రికెటింగ్ టెక్నాలజీ ద్వారా అభివృద్ధి చేసిన అత్యాధునిక యంత్ర పరికరం

సాక్షి, అమరావతి : చెరకు పిప్పి.. అదో వ్యర్థ పదార్థం, ఎందుకూ పనికిరాదు అనుకున్నాం ఇన్నాళ్లూ.. కానీ, ఇప్పుడు ఈ వ్యర్థ పదార్థాన్నే శాస్త్రవేత్తలు కాసులు కురిపించే ముడిసరుకుగా తేల్చారు. చెరకు రైతులకు అదనపు ఆదాయం చేకూరుస్తుందని నిరూపించారు. ఈ పిప్పిని బ్రికెట్స్ (ఓ మోస్తరు కర్రలు లాంటివి) మాదిరిగా తయారుచేస్తే వంట చెరుకుగానే కాకుండా ఇంధన కొరతకు ప్రత్యామ్నాయంగా.. శుభకార్యాల్లో ఉపయోగించే కప్పులు, ప్లేట్లులా కూడా తయారుచేసి వాడుకోవచ్చని వారంటున్నారు.

చెరకు పిప్పి, ఎండుటాకులను బ్రికెటింగ్ టెక్నాలజీ ద్వారా ఈ బ్రికెట్స్‌ను తయారుచేసి రైతులకు అదనపు ఆదాయం లభించేలా అనకాపల్లి చెరకు పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు ఆధునిక యంత్ర పరికరాన్ని అభివృద్ధి చేశారు. సాధారణంగా.. పంట కోసిన తర్వాత వృక్ష సంబంధిత వ్యర్థ పదార్థాలను 'బయోమాస్' అంటారు. వీటిని మెజారిటీ రైతులు వంట చెరుకుగా వినియోగిస్తారు. సహజ రూపంలో నిల్వ చేయాలంటే వీటికి ఎక్కువ స్థలం అవసరం. వీటి రవాణా ఖర్చులూ ఎక్కువే కాదు.. వీటి నుంచి వచ్చే ఉష్ణశక్తి తక్కువే.

టన్ను పిప్పి నుంచి 35 టన్నుల బ్రికెట్స్

వంద టన్నుల చెరకు నుంచి సుమారు 30 టన్నుల పిప్పి, 10 టన్నుల ఎండుటాకులు వస్తాయి. పిప్పిలో 70 శాతం, ఎండుటాకుల్లో 50 శాతం వంట చెరకుగా, బెల్లం తయారీ కోసం వినియోగిస్తారు. మిగిలిన వాటిని వృథాగా వదిలేయడం లేదా పంట పొలాల్లో కాల్చేయడం చేస్తుంటారు. అదే బ్రికెటింగ్ టెక్నాలజీ ద్వారా వంద టన్నుల పిప్పి, ఎండుటాకుల నుంచి 35 టన్నుల బ్రికెట్స్ తయారుచెయ్యొచ్చని శాస్త్రవేత్తలు నిరూపించారు. ఇక సహజ రూపంలో ఈ పిప్పిని వంట చెరుకుగా వినియోగిస్తే కిలోకి 1,200 నుంచి 1,300 కిలో కేలరీల ఉష్ణశక్తి మాత్రమే వెలువడుతుంది. అదే బ్రికెట్స్ రూపంలోకి మార్చి మండిస్తే కిలోకి ఏకంగా 4,452 కిలో కేలరీల ఉష్ణశక్తి వెలువడుతుండడం ఈ బ్రికెట్స్ ప్రత్యేకత. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ నిల్వచేయడమే కాదు.. వీటిని సులభంగా, చౌకగా కూడా తరలించొచ్చు. అంతేకాదు.. ఇవి మండినప్పుడు పొగ రాకపోవడంవల్ల చుట్టుపక్కల వారికి ఇబ్బంది ఉండదు. పైగా.. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కన్నా ఇవి భూమిలో సులభంగా కలిసిపోతాయి.

ఎలా తయారు చేయాలంటే..

- ▲ బ్రికెటింగ్ యంత్రం ద్వారా ఇతర వృక్ష సంబంధిత వ్యర్థ పదార్థాలను బైండరుతో కలిపి బ్రికెట్లుగా తయారుచేసుకోవచ్చు.
- ▲ అదే చెరకు పిప్పికైతే బైండర్ అవసరం లేకుండానే బ్రికెట్స్ తయారుచెయ్యొచ్చు.
- ▲ ముందుగా చెరకు పిప్పిని 7–12 శాతం తేమ వరకు బాగా ఎండబెట్టాలి.
- ▲ తరువాత పిప్పిని చిన్నచిన్న ముక్కలుగా చేసి బ్రికెటింగ్ యంత్రంలోని హేమర్ మిల్లు ద్వారా పొడిచేసి బేరల్ ద్వారా పంపించి ఒత్తిడికి గురిచేయాలి.
- ▲ బ్రికెటింగ్ మిషన్‌లోని డై సైజును బట్టి బ్రికెట్ల పరిమాణం ఉంటుంది.
- ▲ బ్రికెట్లుగా తయారుచేయడం వలన చెరకు పిప్పి పరిమాణం 90 శాతం వరకు తగ్గుతుంది.
- ▲ సులభంగా నిల్వచేసుకుని సీజన్‌లో బెల్లం తయారీకి ఉపయోగించవచ్చు లేదా విక్రయించుకోవచ్చు.



చెరుకు పిప్పి ద్వారా తయారు చేసిన బ్రికెట్లు

ఇంధన కొరతకు ప్రత్యామ్నాయం



ఇంధన కొరతకు ప్రత్యామ్నాయంగా ఈ బ్రికెట్స్‌ను ఉపయోగించవచ్చు. వంట చెరకు కోసం చెట్లు నరకనవసరం లేదు. వ్యర్థ పదార్థాల నుంచి ఉష్ణశక్తిని వెలికితీసే శాస్త్రీయ పద్ధతిలో వీటిని తయారు చేసుకునేలా అభివృద్ధి చేశాం. ఈ యంత్రం సామర్థ్యాన్ని బట్టి రూ.11 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఉంటుంది. ఈ బ్రికెటింగ్ టెక్నాలజీని ఉపయోగించి చిన్నచిన్న పరిశ్రమలను సైతం ఏర్పాటుచేసుకోవచ్చు.

– డాక్టర్ పీవీకే జగన్నాథరావు, సీనియర్ శాస్త్రవేత్త, అనకాపల్లి చెరకు పరిశోధనా కేంద్రం

మార్కెట్‌లో బ్రికెట్లకు మంచి గిరాకీ

ప్రస్తుతం రెస్టారెంట్లు, హోటళ్లలో వరి ఊకనే ప్రధాన వంట చెరకుగా ఉపయోగిస్తున్నారు. ఇక నుంచి ఈ బ్రికెట్లను ఉపయోగించవచ్చు. ప్రస్తుతం ఈ బ్రికెట్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. టన్ను చెరకు రూ.2,850 ధర పలుకుతుంటే ఈ బ్రికెట్స్ మాత్రం టన్నుకు ఏకంగా రూ.5వేల నుంచి రూ.5,500 వరకు పలుకుతున్నాయి. చెరకు పిప్పిని బ్రికెట్స్‌గానే కాదు.. శుభకార్యాలకు ఉపయోగించేలా కప్పులు, ప్లేట్లను కూడా తయారుచెయ్యొచ్చు. చెరకు పిప్పిని బాగా ఎండబెట్టి, మెత్తని పొడిలా చేసి ఎటువంటి రసాయనాలు కలపకుండా నేరుగా మౌల్డింగ్ యంత్రం ద్వారా మనకు కావాల్సిన రూపంలో తయారుచేసుకోవచ్చు.

నీటి విడుదల ఆపాలని తెలంగాణ అధికారుల దౌర్జన్యం

- నిరాకరించిన ఏపీ అధికారులు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి జలవిద్యుత్ కేంద్రం నుంచి కుడి కాలువకు విడుదల చేస్తున్న నీటిని ఆపాలని సాగర్ ప్రాజెక్టు తెలంగాణ ఈఈ మల్లిఖార్జున అధికారులతో కలిసి వచ్చి దౌర్జన్యానికి పాల్పడినట్లు మాచర్ల హోఅండ్‌ఎం ఈఈ వై శ్రీహరి సోమవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా నీటి యాజమాన్య బోర్డు కేటాయించిన టీఎంసీలు పూర్తయినా నీటిని ఎందుకు వాడుతున్నారని వెంటనే ఆపివేయాలని ఈఈ మల్లిఖార్జున పరుషంగా మాట్లాడారన్నారు. కుడి జలవిద్యుత్ కేంద్రం ఈఈ ప్రసాద్ ఇరిగేషన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాగు, సాగునీటి కోసం నీటి విడుదలను కొనసాగిస్తున్నామని తెలంగాణ అధికారులకు తెలిపారు. ఆంధ్రాకు మరో 50టీఎంసీల నీటి అవసరాలు ఉన్నాయని జలవిద్యుత్ కేంద్రం నుంచి నీటి విడుదల ఆపడం కుదరదని ఆంధ్రప్రదేశ్ అధికారులు తెగేసి చెప్పడంతో తెలంగాణ అధికారులు వెనుదిరిగారు.

'పది' ప్రీ ఫైనల్ పరీక్షలకు పేపర్లు ముద్రించి ఇవ్వాలి

నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 10వ తరగతి విద్యార్థులకు పూర్తిస్థాయి ప్రశ్నపత్రం అందించే ప్రీ ఫైనల్ పరీక్షలకు పరీక్షా పేపర్ అందించకుండా ఆన్‌లైన్‌లో పంపి బోర్డ్ మీద రాయాలని ఆదేశించడం సరికాదని, వెంటనే డీసీఈబీల ద్వారా ముద్రించిన ప్రశ్న పత్రాలను అందజేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో కోరారు. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఫార్మేటివ్ పరీక్షలకు ప్రశ్నపత్రాలను ముద్రించకుండా ఆన్‌లైన్‌లో పంపిస్తామనడం భావ్యం కాదన్నారు. ప్రశ్నపత్రాలను ఫొటోస్టాట్ తీసి లేదా బోర్డుపై రాసి పరీక్ష పెట్టమని హెచ్‌ఎంలపై ఒత్తిడి తీసుకురావడం మంచిది కాదని తెలిపారు.

రెచ్చగొట్టి రచ్చ చేసిన టీడీపీ

- పోలీసులపై టీడీపీ కార్యకర్తల రాళ్ల దాడి
- కానిస్టేబుల్ సహా ఇద్దరికి గాయాలు



టీడీపీ కార్యకర్తల రాళ్ల దాడిలో గాయపడిన కానిస్టేబుల్ రామాంజినేయులు

అనంతపురం (శ్రీకంఠం సర్కిల్): వైఎస్సార్‌సీపీ అభిమానిని రెచ్చగొట్టి.. రచ్చ రాజేసిన టీడీపీ కార్యకర్తలు పోలీసులపై రాళ్ల దాడికి తెగబడ్డారు. అనంతపురం టవర్ క్లాక్ వద్ద సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్‌తో పాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. టీడీపీ కార్యకర్తల చేష్టలతో టవర్ క్లాక్ వద్ద ఉద్రిక్తత తలెత్తింది. వివరాల్లోకి వెళితే.. గుంటూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ అభిమాని కల్లం హరికృష్ణారెడ్డిపై టీడీపీ తృతీయ శ్రేణి నాయకుడు సజ్జ అజయ్ సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యల్ని పోస్ట్ చేశాడు. అజయ్‌కు వత్తాసు పలుకుతూ కొందరు టీడీపీ కార్యకర్తలు 'నువ్వు మగాడివైతే అనంతపురం రా' అంటూ హరికృష్ణారెడ్డిని రెచ్చగొట్టారు. వారి సవాల్‌ను స్వీకరించిన హరికృష్ణారెడ్డి సోమవారం రాప్తాడులోని టీడీపీ కార్యాలయం వద్దకు వెళ్లాడు. టీడీపీ నాయకులు ఆలయ భూమిని ఆక్రమించి కార్యాలయం కట్టిన విషయాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రస్తావించాడు. అక్కడి నుంచి అనంతపురం టవర్ క్లాక్ వద్దకు వస్తున్నట్లు సోషల్ మీడియాలో వీడియోను పోస్ట్ చేశాడు. అప్పటికే అతని కోసం చూస్తున్న టీడీపీ కార్యకర్తలు రాళ్ల దాడికి సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అయినప్పటికీ కొందరు టీడీపీ నేతలు దొడ్డిదారిన కార్యకర్తలను అక్కడికి పంపి గొడవలకు ఆజ్యం పోయాలని చూశారు. హరికృష్ణారెడ్డి టవర్ క్లాక్ వద్దకు రాగానే పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుంటుండగా.. టీడీపీ కార్యకర్తలు పోలీసులపై రాళ్లు, చెప్పులు విసిరారు. ఈ ఘటనలో అనంతపురం రూరల్ కానిస్టేబుల్ రామాంజనేయులు తలకు తీవ్ర గాయమైంది. పక్కనే ఉన్న మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. అప్రమత్తమైన పోలీసులు వారిని అక్కడి నుంచి తరిమేశారు. పోలీసులపై రాళ్లు రువ్విన ఆత్మకూరుకు చెందిన గోవర్ధన్‌తోపాటు మరికొందరిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడమే కాకుండా పోలీస్ హెచ్చరికలను సైతం ఖాతరు చేయకుండా దాడులకు తెగబడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని డీఎస్పీ జి.ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇలాంటి దాడులకు పాల్పడితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే క్యాన్సర్‌కు కార్పొరేట్ వైద్యం



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి రజని, డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, ఉన్నతాధికారులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వాస్పత్రుల్లోనే క్యాన్సర్‌కు కార్పొరేట్ వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. క్యాన్సర్ బాధితులకు మెరుగైన చికిత్స అందించడం కోసం ప్రభుత్వ వైద్య రంగంలో తీసుకువస్తున్న మార్పులు, ఇంకా చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై మంగళగిరిలోని వైద్యశాఖ ప్రధాన కార్యాలయంలో సోమవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు, కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ.. 2030 నాటికి రాష్ట్రానికి చెందిన ఏ ఒక్క రోగి క్యాన్సర్ చికిత్స కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ విషయంలో సమున్నత లక్ష్యాలతో సీఎం జగన్ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా దాదాపు 400 క్యాన్సర్ ప్రొసీజర్స్‌కు ఉచితంగా చికిత్స అందజేస్తున్నామన్నారు. ఇందుకోసం ఏటా రూ.400 కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో క్యాన్సర్ చికిత్స అందించేందుకు వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.118 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. విశాఖ, కర్నూలులో ప్రాంతీయ క్యాన్సర్ ఆస్పత్రులు వచ్చే సెప్టెంబర్ కల్లా అందుబాటులోకి వస్తాయని వివరించారు. గ్రేస్ లాంటి స్వచ్ఛంద సంస్థలు క్యాన్సర్ నిర్మూలనకు కృషి చేస్తున్నాయని, ఆయా సంస్థల సేవలు వినియోగించుకునేలా అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. నేషనల్ క్యాన్సర్ గ్రిడ్‌తో అనుసంధానమై సమాంతరంగా ఏపీ చాప్టర్ పేరుతో కేవలం మన రాష్ట్రం మాత్రమే క్యాన్సర్‌కు వైద్యం అందిస్తున్నదని తెలిపారు. విశాఖపట్నంలోని హోమీ బాబా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ కేంద్రంగా ఈ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. క్యాన్సర్‌ను నోటిఫైబుల్ డిసీజ్‌గా ప్రకటించిన దేశంలోనే మూడో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని డాక్టర్ నోరి దత్తాత్రేయుడు చెప్పారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్ పాల్గొన్నారు.



బాబు వదిలేశారు.. జగన్ నిర్మిస్తున్నారు

పీఎంజీఎస్‌వై కింద టీడీపీ ప్రభుత్వంలోకంటే ఇప్పుడే ఎక్కువగా గ్రామాలకు కొత్త రోడ్లు

ఇటీవల రాజ్యసభలో గణాంకాలతో సహా వివరించిన కేంద్రం

2017 నుంచి రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలు వెల్లడి

- ఈ పథకం కింద కేంద్రం ఇచ్చే నిధులు 60 శాతం
- రాష్ట్రం 40 శాతం కలిపి రోడ్లు నిర్మించాలి
- కేంద్రం నిధులనూ ఖర్చు చేయని బాబు సర్కారు
- 2017–18, 2018–19లో కేంద్రం రూ. 470 కోట్లు ఇస్తే, రూ. 393 కోట్లే ఖర్చు
- 2019 తర్వాత రాష్ట్రానికి కేంద్రం ఇచ్చింది రూ. 579 కోట్లు
- రాష్ట్రంలో జగన్ సర్కారు ఖర్చు చేసింది రూ.1,244 కోట్లు
- బాబు హయాంలో వదిలేసిన రోడ్లతో కలిపి 2,271 కిలోమీటర్ల నిర్మాణం

సాక్షి, అమరావతి : ప్రధాన్ మంత్రి గ్రామ్ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) పథకం కింద మేం ఇచ్చిన నిధులకు రాష్ట్రం వాటా కలిపి గ్రామీణ ప్రాంతాలకు రోడ్లేయమని కేంద్రం చెబితే.. రాష్ట్రం నిధులు కలపలేదు సరికదా.. అక్కడి నుంచి వచ్చిన నిధులు కూడా ఖర్చు చేయలేదు చంద్రబాబు ప్రభుత్వం. గ్రామీణ ప్రాంతాలకు రోడ్లూ వేయలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అదే పథకం కింద కేంద్రం నుంచి వచ్చిన నిధులకు రాష్ట్రం వాటా కలిపి రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో మంచి రోడ్లు వేసింది. స్వయంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల రాజ్యసభలో వెల్లడించిన వాస్తవమిది. పీఎంజీఎస్‌వై ద్వారా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే కొత్త రోడ్ల నిర్మాణం ఎక్కువగా జరిగిందని కేంద్రం తేల్చి చెప్పింది. రాష్ట్రంలో గ్రామాలను సమీప పట్టణాలకు కలిపే గ్రామీణ లింకు రోడ్ల నిర్మాణానికి కేంద్రమిచ్చిన నిధులను అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఖర్చు చేయని విషయాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఇటీవల రాజ్యసభ లో గణాంకాల సహితంగా వెల్లడించింది. పీఎంజీఎస్‌వైలో రాష్ట్రంలో కొత్త రోడ్ల నిర్మాణానికి అయ్యే ఖర్చులో కేంద్రం 60శాతం, రాష్ట్రం 40 శాతం భరించాలి. అయితే, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా 2017–18, 2018–19 ఆర్థిక సంవత్సరాల్లో రాష్ట్రంలో పీఎంజీఎస్‌వై కింద కేంద్రం రూ.470 కోట్లు నిధులిచ్చింది. దీనికి రాష్ట్ర వాటా 40 శాతం కలిపి మొత్తం రూ.783 కోట్లతో కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, అప్పటి చంద్రబాబు ప్రభుత్వం రెండేళ్లలో కేవలం రూ. 393 కోట్ల మేరకే కొత్త రోడ్లకు ఖర్చు చేసినట్టు కేంద్రం రాజ్యసభకు తెలియజేసింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత మూడేళ్లలో కేంద్రమిచ్చిన నిధులకు రాష్ట్ర వాటా 40 శాతం కలిపి మొత్తాన్ని రోడ్ల నిర్మాణానికి ఖర్చు చేసినట్టు వివరించింది. 2019–20 ఆర్థిక సంవత్సరం నుంచి 2021– 2022 వరకు మూడేళ్లలో రాష్ట్రంలో పీఎంజీఎస్‌వై కింద కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ రూ. 579 కోట్లు రాష్ట్రానికి ఇవ్వగా, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా 40 శాతం కలిపి మొత్తం రూ. 1,244.45 కోట్లతో రాష్ట్రంలో కొత్త రోడ్లు నిర్మించినట్టు కేంద్రం పేర్కొంది.

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ రాజ్యసభకు సమర్పించిన గణాంకాల ప్రకారం.. అప్పటి టీడీపీ ప్రభుత్వం, ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో ఐదేళ్లలో పీఎంజీఎస్‌వై కింద రాష్ట్రంలో రోడ్ల నిర్మాణానికి కేంద్రం విడుదల చేసిన నిధులు, రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చు (రూ. కోట్లలో..)

చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు

ఆర్థిక సంవత్సరం	కేంద్రం ఇచ్చిన నిధులు	రాష్ట్రం చేసిన ఖర్చు
2017–18	226.16	136.25
2018–19	243.88	257.43
మొత్తం	470.04	393.68

(కేంద్రం రెండేళ్లలో రూ. 470.04 కోట్లు ఇవ్వగా, చంద్రబాబు ప్రభుత్వం ఖర్చు చేసింది రూ. 393.68 కోట్లు మాత్రమే. కేంద్ర నిధులకు రాష్ట్ర వాటా కలపకపోగా, కేంద్రం ఇచ్చిన నిధులనూ ఖర్చు చేయలేదన్న విషయాన్ని ఈ లెక్కలు తేటతెల్లం చేస్తున్నాయి.)

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక..

ఆర్థిక సంవత్సరం	కేంద్రం ఇచ్చిన నిధులు	రాష్ట్రం చేసిన ఖర్చు
2019–20	476.27	338.84
2020–21	53.20	396.75
2021–22	50.00	508.86
మొత్తం	579.47	1,244.45

(వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన నిధులకు రాష్ట్ర వాటా మొత్తం కలిపి ఖర్చు చేయడంతో పాటు గత టీడీపీ ప్రభుత్వం పెండింగ్ నిధులను కూడా ఖర్చు చేసింది. ఇందుకు కేంద్రం వెల్లడించిన ఈ గణాంకాలే నిదర్శనం)

పీఎంజీఎస్‌వైతోనే ఈ మూడేళ్లలో 2,271 కిలోమీటర్ల కొత్త రోడ్లు



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక కేంద్రం పీఎంజీఎస్‌వై పథకంలో రాష్ట్రానికి ఇప్పటివరకు 2,308 కిలోమీటర్ల మేర 298 రోడ్లను కొత్తగా మంజూరు చేసింది. అందులో ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ నాటికి 1,490 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం పూర్తి చేసింది. అంతే కాకుండా గత టీడీపీ ప్రభుత్వం ఇదే పథకంలో నిర్మించకుండా పెండింగ్‌లో పెట్టిన దాదాపు 781 కిలోమీటర్ల రోడ్లను సైతం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మొదలు పెట్టి ఇప్పటికే పూర్తి చేసింది. మొత్తంగా రాష్ట్రంలో ఒక్క పీఎంజీఎస్‌వై పథకంలోనే 2,271 కిలోమీటర్ల కొత్త రోడ్లను వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్మించింది. కేంద్ర నిధులకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు రాష్ట్ర వాటాను కలుపుతుండటంతో మరికొద్ది రోజుల్లోనే మరో 907 కిలోమీటర్ల మేర అదనంగా రోడ్లను మంజూరు చేసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

దేశంలో బాల్యవిద్య బలహీనమే!

పూర్వ బాల్యవిద్యకు దూరంగా 3.7 కోట్ల మంది పిల్లలు

- దేశ జీడీపీలో 0.1 శాతం మాత్రమే నిధుల కేటాయింపు
- అమెరికా, యూకే, ఈక్వెడార్‌లో 1.17 శాతం వరకు వ్యయం
- 0–6 ఏళ్ల వయసులో అత్యధిక స్థాయిలో మానసిక వికాసం
- రాష్ట్రంలో సీఎం జగన్ చొరవతో బాలల కోసం ప్రత్యేక బడ్జెట్
- ఏటా రూ.16 వేల కోట్లకు పైగా ఖర్చు
- అంగన్‌వాడీలను స్కూళ్లకు అనుసంధానించి ప్రీ ప్రైమరీ విద్యకు శ్రీకారం



సాక్షి, అమరావతి: ఆరేళ్ల లోపు పిల్లల్లో మెదడు ఎదుగుదల అధికంగా ఉంటుంది. ఆ వయసులో మానసిక వికాసానికి సాన పెట్టాలి. అయితే దేశంలో ఇప్పటికీ 3.7 కోట్ల మందికి పైగా బాలలు పూర్వ బాల్య విద్యకు దూరమైనట్లు 'సేవ్ ద చిల్డ్రన్' సంస్థ తాజా నివేదిక వెల్లడించింది. నేటి బాలలే రేపటి పౌరులు అనే నినాదం సత్ఫలితాలనివ్వాలంటే పూర్వ బాల్యవిద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరముందని పేర్కొంది.

విద్యాహక్కు చట్టం–2009, నేషనల్ ఈసీసీఈ పాలసీ–2013, జాతీయ నూతన విద్యావిధానం–2020లో పూర్వ బాల్య విద్య ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే పూర్వ బాల్య విద్యకు తగినన్ని నిధులు కేటాయించాలి. 3- 6 ఏళ్ల వయసు వారి విద్యాభ్యాసాన్ని పాఠశాల విధానంలో చేర్చేలా ప్రీ ప్రైమరీ విధానాన్ని ప్రవేశపెట్టాలని నూతన విద్యావిధానం సిఫార్సు చేసింది. 2011 జనాభా లెక్కల నివేదిక పూర్వ బాల్య విద్యకు అర్హులైన బాలలు దేశంలో 10 కోట్ల మంది ఉన్నారు. ప్రస్తుతం పూర్వ బాల్య విద్య, ప్రాథమిక విద్యకు దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 0.1 శాతం నిధులు మాత్రమే కేటాయిస్తుండగా కనిష్ఠంగా 1.6 నుంచి 2.2 శాతం వరకు పెంచాలి. అమెరికా, యూకే, ఈక్వెడార్ లాంటి దేశాల్లో 1.17 శాతం వరకు నిధులు కేటాయిస్తున్నారు.

రాష్ట్రంలో బాల్య విద్య భేష్



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక విద్యారంగ సంస్కరణలు చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్వ బాల్య విద్య, ప్రాథమిక విద్యకు ప్రాధాన్యమిచ్చారు. జాతీయ నూతన విద్యావిధానం కంటే ముందే రాష్ట్రంలో పూర్వ ప్రాథమిక విద్యకు రూపకల్పన చేశారు. అంగన్‌వాడీలను స్కూళ్లతో అనుసంధానించి పీపీ-1, పీపీ-2 తరగతులతో ఫౌండేషన్ స్కూళ్లకు శ్రీకారం చుట్టారు. పూర్తిగా బాలల కోసమే ప్రత్యేక బడ్జెట్ పెట్టి ఏటా రూ.16 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. 2021–22లో సీఎం జగన్ ప్రభుత్వం రూ.16,748.47 కోట్లతో తొలిసారిగా బాలల బడ్జెట్ ప్రవేశపెట్టింది. 2022 – 23లో ఇందుకోసం రూ.16,903 కోట్లు కేటాయించారు.

• తెలంగాణ

జయరామ్‌ హత్య కేసులో దోషి రాకేష్‌రెడ్డి

- నిర్ధారించిన నాంపల్లిలోని న్యాయస్థానం
- 9వ తేదీన శిక్ష ఖరారు చేయనున్న కోర్టు
- మిగిలిన 11 మంది నిర్దోషులని ప్రకటన



బంజారాహిల్స్‌ (హైదరాబాద్‌): ప్రవాస భారతీయుడు, పారిశ్రామికవేత్త చిగురుపాటి జయరాం హత్య కేసులో ప్రధాన నిందితుడైన కె.రాకేష్‌రెడ్డి హంతకుడని న్యాయస్థానం నిర్ధారించింది. ఈ మేరకు నాంపల్లిలోని మొదటి అదనపు మెట్రోపాలిటన్‌ సెషన్స్‌ కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. రాకేశ్‌రెడ్డికి ఈ నెల 9న శిక్షను ఖరారు చేయనుంది. ఇదే కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురు పోలీసు అధికారులు సహా 11 మందిని నిర్దోషులుగా న్యాయస్థానం ప్రకటించింది. ఆర్థిక విభేదాల నేపథ్యంలో జయరామ్‌ను హత్య చేయాలని రాకేష్‌ పథకం వేశాడు. హనీట్రాప్‌ ద్వారా 2019 జనవరి 30న జయరామ్‌ను జూబ్లీహిల్స్‌ రోడ్‌ నంబర్‌ 10లోని తన ఇంటికి రప్పించాడు. అక్కడే ఆయన్ను నిర్బంధించి విడుదల చేయడానికి రూ.5 కోట్లు డిమాండ్‌ చేసి.. రూ.6 లక్షలు తీసుకున్నాడు. స్టాంపు పేపర్లు, తెల్ల కాగితాలపై జయరామ్‌తో బలవంతంగా సంతకాలు చేయించుకున్న రాకేష్‌.. ఆపై దారుణంగా చంపేశాడు. మృతదేహాన్ని కారులోకి వేసుకుని ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ శివార్లలో పడేసి వచ్చాడు. దీన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించడానికి ప్రయత్నించాడు. కేసు దర్యాప్తు పూర్తి చేసిన అధికారులు నాంపల్లి కోర్టులో 320 పేజీల అభియోగపత్రం దాఖలు చేశారు. ఇందులో 73 మందిని సాక్షులుగా చేర్చారు. కేసు విచారణ దాదాపు నాలుగేళ్ల పాటు సాగింది.

గొంతుకోసుకుని వైద్యురాలి ఆత్మహత్యాయత్నం

నిర్మల్‌టౌన్‌: గొంతుకోసుకుని ఓ వైద్యురాలు ఆత్మహత్యకు యత్నించిన ఘటన నిర్మల్‌ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి చెందిన డాక్టర్‌ మీనా(36) నిర్మల్‌లో ఆరు నెలలుగా ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తోంది. ఎన్‌రెడ్డి కాలనీలో ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో కుటుంబ కలహాల కారణంగా సోమవారం ఉదయం ఇంట్లో ఆమె గొంతుకోసుకుంది. తర్వాత ఆమెనే స్వయంగా ఆసుపత్రి సిబ్బందికి ఫోన్‌ చేసి విషయం చెప్పింది. దీంతో వైద్యురాలి ఇంటికి చేరుకున్న సిబ్బంది వెంటనే అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు నిర్మల్‌ సీఐ మల్లేశ్‌ తెలిపారు.

చిట్టి చేతులతో లక్ష మొక్కలు!

12 ఏళ్ల వయసులోనే పర్యావరణ స్పృహ

- సొంత ఖర్చులతో సూళ్లూరుపేట బాలిక కృషి
- పాఠశాలలు, గ్రామాల్లో ప్లకార్డులతో అవగాహన

సూళ్లూరుపేట రూరల్‌ (తిరుపతి జిల్లా): పర్యావరణాన్ని పరిరక్షించుకుందామంటూ 12 ఏళ్ల బాలిక చేపట్టిన కార్యక్రమం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ''సేవ్‌ వాటర్‌.. సేవ్‌ అగ్రికల్చర్‌.. సేవ్‌ సాయిల్‌..'' నినాదంతో సూళ్లూరుపేటకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని గీతిక ఇప్పటివరకు లక్ష మొక్కలను నాటడం గమనార్హం. విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

సొంత ఖర్చులతో ఓపిగ్గా..

గీతిక తండ్రి వెంకటేషన్‌ రైల్వే ఉద్యోగి కాగా తల్లి భారతి సచివాలయంలో మహిళ పోలీసుగా పని చేస్తున్నారు. సూళ్లూరుపేటలోని సాయినగర్‌లో నివసించే గీతికకు చిన్నతనం నుంచే పర్యావరణంపై మక్కువ ఏర్పడింది. గత నాలుగేళ్లుగా సొంత డబ్బులతో యాదముడి ఇంటిగ్రేటెడ్‌ రూరల్‌, అర్బన్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ పేరుతో మొక్కలను నాటుతోంది. భూతాపం నుంచి భూమిని కాపాడి పర్యావరణాన్ని రక్షించేందుకు మొక్కలను నాటుదామంటూ పాఠశాలలు, గ్రామాల్లో విద్యార్థులు, రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఓపిగ్గా గంటల తరబడి ప్లకార్డులతో నిలుచుని తన లక్ష్యం దిశగా సాగుతోంది. పల్లెలే కాకుండా చెన్నై లాంటి మహా నగరంలోనూ గీతిక చేసిన ప్రయత్నాలను అభినందిస్తూ జాతీయ, అంతర్జాతీయ అవార్డులు ప్రకటించారు. తమ కుటుంబానికి ఆర్థికంగా భారమే అయినప్పటికీ ఆ చిన్నారి ప్రయత్నాలకు తల్లిదండ్రులు సహకారం అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు.



గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తూ



చెన్నై ప్రాంతంలో ప్లకార్డులతో గంటల కొద్ది నిలబడి అవగాహన కల్పిస్తున్న బాలిక

గీతిక సాధించిన అవార్డులు

బెంగళూరు, బిహార్‌, హైదరాబాద్‌కు చెందిన ఎన్‌జీఓలు, సామాజిక సేవా సంస్థల నుంచి పలు అవార్డులు.

- 2020 చైల్డ్‌ ఎన్విరాన్‌మెంట్‌ అవార్డు, యంగ్‌ క్లైమేట్‌ యాక్టివిస్ట్‌ అవార్డు
- 2021లో గ్లోబల్‌ కిడ్‌ అచీవర్‌ అవార్డు, ఇండియన్‌ ఐకాన్‌ అవార్డు, ఫేమ్‌ ఐకాన్‌ అవార్డు
- 2022లో సూళ్లూరుపేట ఎస్‌ఎస్‌ఎస్‌ సంస్థ ద్వారా ఏపీజే అబ్దుల్‌కలాం అవార్డు
- 2022లో ఇంటర్‌నేషనల్‌ ఎక్స్‌లెన్స్‌, ఎన్విరాన్‌మెంటల్‌ వారియర్‌ అవార్డులు.
- 2022లో ఇంటర్నేషనల్‌ సోషల్‌ సర్వీస్‌ ఐకాన్‌ అవార్డు, విశ్వగురు వరల్డ్‌ రికార్డు సంస్థ ద్వారా నేషనల్‌ అవార్డు, ప్రశంసా పత్రం.
- ఢిల్లీలో 2023 జనవరిలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్‌ ఎన్విరాన్‌మెంటల్‌ అవేర్‌నెస్‌ అవార్డు

యూట్యూబ్‌ వీడియోలు చూసి.. సొంతంగా కాన్పు చేసుకున్న బాలిక

- అనంతరం శిశువును గొంతు పిసికి చంపేసిన వైనం

నాగ్‌పూర్‌: యూట్యూబ్‌ వీడియోలు చూసి 15 ఏళ్ల బాలిక సొంతంగా కాన్పు చేసుకుంది. అనంతరం శిశువు ఏడుపు ఎవరికీ వినిపించకూడదని గొంతు పిసికి చంపింది. ఈ ఘటన మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. 9వ తరగతి చదువుకుంటున్న ఓ బాలికకు ఇన్‌స్టాగామ్‌లో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. మెసెంజర్‌ ద్వారా మాట్లాడుకునేవారు. ఒక రోజు అతడు చెప్పిన చోటుకు వెళ్లింది. అక్కడ అతడు బలవంతంగా బాలికకు మద్యం తాపించి, అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక గర్భం దాల్చింది. ఈ విషయం బయట పడకుండా పలు జాగ్రత్తలు తీసుకుంది. కూతురు ఎప్పుడూ చాటింగ్‌తోనే గడపడం నచ్చని తల్లి ఆమె సెల్‌ఫోన్‌ను పగులగొట్టింది. సొంతంగా కాన్పు చేసుకోవడం ఎలాగో తల్లి సెల్‌ఫోన్‌లో యూట్యూబ్‌ వీడియోల ద్వారా తెలుసుకుంది. శుక్రవారం ఇంట్లో ఒంటరిగా ఉండగా ప్రసవం అయ్యింది. తనకున్న పరిజ్ఞానంతో సొంతంగా కాన్పు చేసుకుని, శిశువును కనింది. శిశువు ఏడుపు ఎవరికీ వినిపించకూడదని బెల్టుతో గొంతు పిసికి చంపేసింది. అనంతరం శవాన్ని సంచిలో కట్టి, డాబాపై పడేసింది. ఇంటికి వచ్చిన తల్లి ఆరా తీసి అసలు విషయం తెలుసుకుంది. కూతురును వెంటబెట్టుకుని ఆమె పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. తనపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి పేరు ఠాకూర్‌ అని మాత్రమే తెలుసని, మిగతా వివరాలేవీ తెలియవని చెప్పింది. సెల్‌ఫోన్‌ నంబరు కూడా తెలియకపోవడంతో పోలీసులు ఠాకూర్‌ అనే వ్యక్తి ఆచూకీ కోసం పలు కోణాల్లో విచారణ జరుపుతున్నారు.

జూనియర్లపై సీనియర్‌ విద్యార్థుల దాడి

అచ్చంపేట రూరల్‌: నాగర్‌కర్నూల్‌ జిల్లా అచ్చంపేట సాంఘిక సంక్షేమ ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాలలో సీనియర్‌ విద్యార్థులు జూనియర్‌ విద్యార్థులపై దాడికి దిగారు. శనివారం రాత్రి ఆరో తరగతి విద్యార్థులు ఇద్దరిపై.. అదే గురుకులంలో ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు దాడి చేశారు. ఆదివారం సాయంత్రం 6, 7, 8 తరగతులకు చెందిన మరో 20 మంది విద్యార్థులను సదరు ఇంటర్‌ విద్యార్థులు రక్త గాయాలయ్యేలా కొట్టారు. ఆరో తగరతి విద్యార్థి ఎడమ చెంపపై రక్త గాయమైంది. 2 రోజులుగా విద్యార్థులను గదిలో బంధించి చితకబాదారు. దీనిపై సోమవారం గాయపడిన విద్యార్థులు తల్లిదండ్రులకు ఫోన్‌ ద్వారా సమాచారమిచ్చారు. దీంతో వారు గురుకులానికి చేరుకుని ప్రిన్సిపల్‌, ఉపాధ్యాయులు, అధ్యాపకులను నిలదీశారు. పాఠశాల, కళాశాలకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై రామకృష్ణయ్య అనే ఉపాధ్యాయుడు మండిపడ్డారు. ఆర్‌సీవో వనజ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

• తెలంగాణ

నవీన్‌ హత్య కేసులో వారూ నిందితులే...

- హరిహర కృష్ణకు హసన్‌, నిహారిక సహకారం
- కేసు దర్యాప్తులో గుర్తించిన పోలీసులు.. అరెస్ట్‌

సాక్షి, హైదరాబాద్‌/నాగోల్‌: తెలంగాణలో సంచలనం సృష్టించిన బీటెక్‌ విద్యార్థి నేనావత్‌ నవీన్‌ హత్యకు ట్రయాంగిల్‌ లవ్‌ కారణమని అబ్దుల్లాపూర్‌మెట్‌ పోలీసులు తేల్చారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన పేరాల హరిహర కృష్ణకు హత్యానంతరం అతడి స్నేహితుడు పి.హసన్‌ (21), ప్రియురాలు కట్టా నిహారిక (20) సహకరించినట్లు నిర్ధారించారు. వారిద్దరినీ అరెస్టు చేసినట్లు ఎల్బీ నగర్‌ డీసీపీ సాయిశ్రీ సోమవారం వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హరిహర కృష్ణ, నవీన్‌, హసన్‌, నిహారిక దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ కాలేజీలో ఇంటర్‌ చదివారు. అప్పట్లో నిహారిక, నవీన్‌ ప్రేమించుకున్నారు. ఆ తర్వాత హరిహర కృష్ణ పీర్జాదీగూడలోని ఓ కాలేజీలో, నవీన్‌ నార్కెట్‌పల్లిలోని మహాత్మాగాంధీ వర్సిటీలో బీటెక్‌లో చేరారు. కొన్నాళ్లుగా యువతి హరిహర కృష్ణతో సన్నిహితంగా ఉంటోంది. ఈ విషయం తెలిసిన నవీన్‌ ఆమెను ప్రశ్నించాడు. నవీన్‌ మళ్లీ నిహారికకు దగ్గరవుతున్నాడనే విషయం తెలుసుకున్న హరిహర కృష్ణ అతడిని అంతం చేయాలని పథకం వేశాడు. ఇందులో భాగంగానే గత నెల 17న గెట్‌ టు గెదర్‌ పేరుతో నవీన్‌ను రప్పించి తన ద్విచక్ర వాహనంపై అబ్దుల్లాపూర్‌మెట్‌ పరిధిలోని ఓ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లాడు. దారిలో కొనుగోలు చేసిన మద్యాన్ని సేవించాక నవీన్‌ను గొంతు నులిమి చంపాడు. ఆపై వెంట తెచ్చుకున్న పెద్ద కత్తితో అతడి తల, మొండెం, చేతులు, కాళ్లు, గుండె వేరు చేశాడు. అక్కడ నుంచే మృతదేహం ఫొటోలను నిహారికకు వాట్సాప్‌ ద్వారా పంపాడు. నవీన్‌ గుండె, తల, ఇతర శరీర భాగాలను ఓ బ్యాగ్‌లో వేసుకొని తుర్కయాంజాల్‌ జేఎన్‌యూఆర్‌ఆర్‌ఎం కాలనీలో ఉండే హసన్‌కు ఫోన్‌ చేసిన హరిహరకృష్ణ అతనికి హత్య విషయం చెప్పాడు. వెంటనే అబ్దుల్లాపూర్‌మెట్‌ రావాల్సిందిగా కోరగా నిరాకరించిన హసన్‌.. హరిహరకృష్ణనే తన ఇంటికి రావాలని సూచించాడు. దీంతో అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో హసన్‌ ఇంటికి వెళ్లి నవీన్‌ శరీర భాగాలను పారేయడంలో సహకరించాల్సిందిగా కోరారు. అందుకు అంగీకరించిన హసన్‌ అతడితో కలిసి మన్నెగూడ వరకు వెళ్లి నవీన్‌ శరీర భాగాలతో కూడిన బ్యాగ్‌ను అక్కడ పారేయడానికి సహకరించాడు. ఆ రోజు రాత్రి హసన్‌ ఇంట్లోనే ఉన్న హరిహర కృష్ణ స్నానం చేయడంతోపాటు రక్తం మరకలతో ఉన్న వస్త్రాలు విడిచి హసన్‌ ఇచ్చినవి వేసుకున్నాడు.

ప్రీతి కేసు ఎటువైపు?

- ఆమె ఆత్మహత్య చేసుకుందా? ఇంకేమైనా జరిగిందా?
- ఎఫ్‌ఎస్‌ఎల్‌ నివేదిక వస్తేనే స్పష్టత



సాక్షి, వరంగల్‌: తెలంగాణలో సంచలనం సృష్టించిన వైద్యవిద్యార్థిని ప్రీతి మృతి ఆత్మహత్యానా ఇతరత్రా ఏమైనా జరిగిందా? అనే అనుమానంపై ఇంకా స్పష్టత రావట్లేదు. ఓ వైపు ప్రీతిది హత్యేనంటూ ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తుండగా, ఇంకోవైపు టాక్సికాలజీ రిపోర్టు అధికారికంగా వెల్లడించకపోవడం, ఎఫ్‌ఎస్‌ఎల్‌ రిపోర్టు వస్తేనే స్పష్టమైన కారణాలు తెలుస్తాయని పోలీసులు భావిస్తుండటంతో కేసు చిక్కుముడి వీడేందుకు ఇంకెన్ని రోజులు పడుతుందో అంతుబట్టడంలేదు. నిందితుడైన ఎం.ఎ.సైఫ్‌ను 4 రోజులు కస్టడీలో విచారించిన మట్టెవాడ పోలీసులు.. మరో 2 రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ కోర్టులో పిటిషన్‌ వేశా రు. దీనిపై విచారణను కోర్టు మంగళవారానికి వాయిదా వేయడంతో నిందితుడిని ఖమ్మం జైలుకు తరలించారు.

ఇంకా క్లారిటీ రాలేదా?

ప్రీతితో గొడవకు దారితీసిన పరిస్థితులతోపాటు ఆమెను వేధించడానికి ఎవరెవరి సహాయాన్ని తీసుకున్నాడన్న దానిపై నిందితుడు సైఫ్‌ను పోలీసులు ప్రశ్నించారు. టెక్నికల్‌ డేటాను కూడా సైఫ్‌ ముందుంచి వివరాలు రాబట్టినట్లు తెలిసింది. విష రసాయనాలు ఏమీ తీసుకోలేదని టాక్సికాలజీ రిపోర్టు చెబుతోందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలోనే సైఫ్‌ను మరో 2 రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతో పిటిషన్‌ వేశారు. ఈ 4 రోజుల కస్టడీలోనూ సైఫ్‌ పోలీసులకు చెప్పిన సమాచారం అసమగ్రంగా ఉండటంతో మళ్లీ కస్టడీకి కోరినట్లు తెలుస్తోంది.

కీలకంగా ఎఫ్‌ఎస్‌ఎల్‌ రిపోర్ట్‌

ప్రీతి కేసులో వేధింపులు, ర్యాగింగ్‌ జరిగినట్టు పోలీసులు నిర్ధారించినా ఇప్పటికీ త్రిసభ్య కమిటీ సమర్పించిన నివేదికలోని అంశాలను ఎక్కడా ప్రస్తావించలేదు. తాజాగా టాక్సికాలజీ రిపోర్టులో ఏ విష రసాయనం తీసుకున్నట్టు లేదని నివేదిక వచ్చిందని చక్కర్లు కొడుతున్న వార్తలతో అసలు ప్రీతిది ఆత్మహత్య కాదా...మరేమైనా జరిగిందా అనే దిశగా పోలీసు విచారణ మారినట్టు తెలిసింది. ప్రీతి ఆత్మహత్య కేసును కాస్త అనుమానాస్పద మృతిగా మార్చే అవకాశం కూడా లేకపోలేదు. ఎఫ్‌ఎల్‌ఎస్‌ ఇచ్చే నివేదిక కీలకం కానుంది.

జిల్లా వార్తలు

నయన మనోహరం కూచిపూడి నృత్యం



నృత్య భంగిమలో వాణీ రమణ శిష్య బృందం



శ్రావణ్‌ కుమార్‌ శిష్య బృందం

కూచిపూడి(మొవ్వ): శ్రీ గంగా బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వార్ల 260వ కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణా జిల్లా మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళావేదికపై సాగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు కనులవిందుగా సాగుతున్నాయి. కళారత్న డాక్టర్‌ వేదాంతం రాధేశ్యాం నిర్వహణలో ఐదవ రోజైన సోమవారం సాగిన వేద పారాయణం, భక్తి రంజిని, నృత్య ప్రదర్శనలు, నృత్యరూపకాలు ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. మచిలీపట్నం ఈఈ మన్నెం భాస్కరరావు, కళారత్న డాక్టర్‌ వేదాంతం రాధేశ్యామ్‌, మంత్రాల ప్రసాద్‌, పార్థసారధి, తోట దుర్గా ప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రదర్శనల్లో ముందుగా ఘనాపాటి వేదాంతం దత్తాత్రేయ చేసిన వేద పారాయణం, ముత్రూరి పావని ఆలపించి గాత్రకచేరి, భక్తి రంజిని కార్యక్రమాలు భక్తి భావాన్ని పరిమళింపచేశారు. ప్రొద్దుటూరుకు చెందిన టి శ్రావణ్‌ కుమార్‌, బృందం రాగ తరుణి, స్నేహిత, కీర్తిక, హనీషా యామినీ, రుద్ర శ్రీ, సాయి వర్షిణి, వెన్నెల, భవ్య శ్రీ, కనకదుర్గ, లహరి, శ్రియ, శ్రీలితిక, కమలి, తుల్యశ్రీ, హుమైరా, సాయిహిత శ్రీలు శ్రీ బాలా త్రిపుర సుందరీ.., వయ్యారముగా రారా..., వందే శ్రీ మాతరం అనే అంశాలకు చక్కటి హస్త పాద విన్యాలతో, నాట్య భంగిమలతో ప్రదర్శనలను చేశారు.

కేంద్ర సంగీతనాటక అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్‌ వసంత్‌కిరణ్‌ రాయసం, శిష్యులు అతిరసజీవ్‌, వైష్ణవి ముకుందన్‌, దేవేష్‌, సిద్ధేంద్ర చొక్కలింగంలే అంబా పరాకు, పిబరే రామరసం, కూచిపూడి తల్లికి.. అంశాలకు లయబద్ధంగా పాదాలు కదుపుతూ, చక్కని హావభావాలతో ప్రదర్శించి ప్రేక్షకుల కరతాళ ధ్వను లందుకున్నారు. శ్రీజ్ఞానసరస్వతి డాన్స్‌ అకాడమీ నిర్వాహకులు వాణీరమణ, వారి శిష్య బృందం సంస్కృతి, టీనా, నందిక, అంజలా దేవి, పవిత్రలు దశావతార శబ్దం, గోవర్ధనగిరి ధార.. అంశాలకు అనుగుణంగా అభినయం, భావ వ్యక్తీకరణతో అలాగే వాణీ రమణ తమ విద్యార్థులతో కలిసి కూచిపూడి నాట్యానికే ప్రత్యేక మైన తరంగ నృత్యాన్ని ప్రదర్శించి అలరించారు.

చివరిగా కళారత్న, కళానిధి డాక్టర్‌ వేదాంతం రామలింగ శాస్త్రి నృత్యదర్శకత్వంలో నర్తనశాల కూచిపూడి నృత్యరూపకం ప్రత్యేకార్షణగా నిలిచింది. కీచకుడుగా డాక్టర్‌ వేదాంతం రామలింగ శాస్త్రి, ద్రౌపతిగా వి సుశీల, ధర్మరాజుగా తేజ, భీముడుగా ఎన్‌ బాల సుబ్రమణ్యం, బృహన్నలగా వేదాంతం మోహన సత్య శ్రీనివాస వాగ్దేవి ప్రసాద్‌, వినాయకుడుగా రోహిత్‌ అద్భుతంగా నర్తించి ప్రదర్శనకు జీవం పోశారు. వీరికి గానం వేదాంతం వెంకట దుర్గాభవాని, సంగీతం శ్రీదండిభొట్ల శ్రీనివాస వేంకట శాస్త్రి సహకరించారు. శ్రీ గంగా బాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు నాట్యాచార్యులను, కళాకారులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు, ప్రసంశా పత్రాలను అందచేశారు.

ఈ నెలాఖరు వరకు ధాన్యం కొనుగోళ్లు

అవనిగడ్డ: ఆగిపోయిన ధాన్యం కొనుగోలు సేకరణను పునరుద్ధించారు. వైఎస్సార్‌సీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య(నాని), మాజీ మంత్రి కొడాలి నాని, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయశాఖ కమిషనర్‌, సీఎంవో కార్యాలయ ముఖ్య కార్యదర్శి ధనుంజయ రెడ్డిని కలిసి ధాన్యం కొనుగోలు సేకరణను పునరుద్ధించాలని కోరారు. జిల్లాలో చాలా చోట్ల మినుము సాగు వల్ల కుప్ప నూర్పిళ్ళు జరగలేదని అందువల్ల ధాన్యం కొనుగోలు సేకరణ చేపట్టాలని కోరగా, సీఎం సంబంధిత అధికారులతో మాట్లాడి నిలిచి పోయిన ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభించి మార్చి నెలాఖరు వరకూ కొన సాగించాలని ఆదేశించారు. సీఎం నిర్ణయం వల్ల రైతులకు మేలు జరుగుతుందని, వరికుప్ప నూర్పిళ్ళు చేపట్టి దళారుల ప్రమేయం లేకుండా మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవాలని ఎమ్మెల్యే సింహాద్రి రైతులకు సూచించారు.



సీఎంతో ధాన్యం కొనుగోళ్లపై మాట్లాడుతున్న పేర్ని నాని, ఎమ్మెల్యే సింహాద్రి

రైతులకు వెన్నుదన్నుగా ప్రభుత్వం

- నిషేధిత భూముల సమస్య పరిష్కరించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే
- రాష్ట్రంలో అత్యధికంగా లబ్ధి పొందింది కోడూరు మండల అన్నదాతలే
- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- రైతులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ



రైతులకు విముక్తి పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రైతాంగానికి వెన్నుదన్నుగా ఉంటూ వారికి ఉపయోగపడే చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిషేధిత భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించడంతో లబ్ధిపొందిన రైతులకు విముక్తి ధ్రువీకరణ పత్రాలను సోమవారం అందించారు. కృష్ణాజిల్లా కోడూరులోని టీటీడీ కల్యాణ మండపం వద్ద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్‌ షేక్‌ లతీఫ్‌పాషా అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 35,669 ఎకరాల భూమికి షరతులు తొలగించగా, అందులో కృష్ణా జిల్లాలోనే 18,384 ఎకరాల భూమికి సంబంధించి 12,014 మంది రైతులు లబ్ధిపొందారని రమేష్‌బాబు చెప్పారు. రాష్ట్రంలో అత్యధికంగా కోడూరు మండలంలో 6,947 రైతులకు సంబంధించి 9,594 ఎకరాల భూమికి షరతుల సమస్య తొలగిందన్నారు. గత టీడీపీ పాలకులు తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వద్ద 2016 నుంచి ఇప్పటి వరకు రైతులు తమ భూములపై హక్కు కోల్పోవడంతో పాటు భూముల క్రయవిక్రయాలు జరగక తీవ్ర ఇబ్బందులు పడ్డ విషయాన్ని రమేష్‌బాబు గుర్తు చేశారు. నిషేధిత భూముల సమస్య పరిష్కరించిన ఘటన జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, రైతులు ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. అనంతరం రైతులకు విముక్తి పత్రాలను రమేష్‌బాబు అందించారు.

భక్తుల ఇలవేల్పు తిరుపతమ్మ





విద్యుత్‌ దీప కాంతుల మధ్య తిరుపతమ్మ ఆలయం (ఇన్‌సెట్‌) శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మవారు

- నేటి నుంచి పెనుగంచిప్రోలు చిన తిరునాళ్ల
- విద్యుత్‌ దీప కాంతులతో వెలుగులీనుతున్న ఆలయం

పెనుగంచిప్రోలు: భక్తుల ఇలవేల్పుగా విరాజిల్లుతున్న పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి చిన తిరునాళ్ల ఉత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఈనెల 11వ తేదీ వరకు జరిగే ఈ తిరునాళ్లకు కృష్ణా, ఖమ్మం, గుంటూరు, ప్రకాశం, నల్గొండ జిల్లాల నుంచే కాక ఉభయ గోదావరి, తెలంగాణలోని హైదరాబాద్‌, రంగారెడ్డి జిల్లాల నుంచి భక్తులు తరలి వస్తారు. ఆలయ ఈఓ జీవీడీఎన్‌ లీలాకుమార్‌, చైర్మన్‌ ఇంజం చెన్నకేశవరావు భక్తులకు అవసరమైన సౌకర్యాలు పర్యవేక్షణ చేస్తున్నారు. ఆలయాన్ని విద్యుత్‌ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. మార్చి7 న ఉదయం 5.59 గంటలకు పాల్గుణ శుద్ధ పౌర్ణమిన అఖండ జ్యోతి స్థాపనతో ఉత్సవాలు మొదలవనున్నాయి. మార్చి 8న, రాత్రి 6.01 గంటలకు గ్రామంలో ఉత్సవమూర్తుల రథోత్సవం, మార్చి 9న సాయంత్రం 6.04 గంటలకు చిన తిరునాళ్లల్లో ప్రధాన ఘట్టమైన అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడు గ్రామం నుంచి పసుపు– కుంకుమల బండ్లు పెనుగంచిప్రోలు ఆలయానికి చేరుకుంటాయి. మార్చి 10 రాత్రి 8.26 గంటలకు 90 అడుగుల దివ్య ప్రభోత్సవం, మార్చి 11 ఉదయం 5.30 గంటల నుంచి భక్తుల బోనాల సమర్పణతో తిరునాళ్ల ఉత్సవాలు ముగుస్తాయి.

ఇవీ ఏర్పాట్లు...

తిరునాళ్ల ఐదు రోజుల ఉత్సవాలకు మునేరు నీరు లేనందున షవర్‌ బాత్‌లు 400 ఏర్పాటు చేస్తున్నారు. తాత్కాలిక టాయిలెట్లు 24, వాటర్‌ ట్యాంక్‌లు, చేతి పంపులు, మునేరులో తాత్కాలిక కేశఖండన శాల, చలివేంద్రం, ఆలయం చుట్టూ చలివేంద్రాలు, వాటర్‌ ప్యాకెట్స్‌ అందుబాటులో ఉంచుతున్నారు.

దండాలమ్మా.. నాంచారమ్మా!

- విశ్వనాథపల్లికి తరలివస్తున్న భక్తజనం
- కోలాహలంగా సాగుతున్న అమ్మవారి ప్రధాన జాతర
- నేడు రెండు లక్షల మందికి పైగా భక్తులు రాక



కోడూరు: కృష్ణాతీరంలో భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ జాతర కోలాహలంగా సాగుతోంది. జాతరలో రెండవ రోజైన సోమవారం సుదూర ప్రాంతాలకు చెందిన యాత్రికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. గుంటూరు, ప్రకాశం జిల్లా భక్తులు అమ్మవారి పుట్టింటివారు కావడంతో అక్కడ మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పాలపొంగళ్లు, నైవేధ్యాలను ఆలయం వద్దే తయారు చేసి అమ్మవారికి సమర్పించారు. లారీలు, ట్రాక్టర్లు, ఆటోలకు రంగులద్ది ప్రదక్షణలు చేయించి భక్తి భావం చాటుకున్నారు. జాతరను పురస్కరించుకొని ఆలయాన్ని కళ్లు మిరుమిట్లు కొలిపే విద్యుత్‌ దీప కాంతులతో అలంకరించారు. అమ్మవారి భారీ విద్యుత్‌ చిత్రపటాన్ని ఏర్పాటు చేయగా నది రహదారిలో విద్యుత్‌ ప్రభను కూడా ఏర్పాటు చేశారు. నాంచారమ్మ తల్లి మూలమూర్తికి చేసిన అలంకారం భక్తులను ముగ్ధులను చేసింది. బంగార, వెండి ఆభరణాలతో పాటు వివిధ రకాల పుష్పాలు, చెరుకుగడలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయం మొత్తం పూల తోరణాలు, అరటి పిలకలు వేసి భక్తులకు స్వాగతం పలికారు. పలువురు చిన్నారులను ఊయలలో వేసి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో ప్రధాన ఘట్టమైన మంగళవారం నాడు రెండు లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికార యంత్రాంగం అంచనా వేస్తున్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో విశ్వనాథపల్లి స్పెషల్‌ పేరుతో ప్రత్యేక బస్సు సర్వీసులు నడపుతున్నారు. ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కృష్ణాజిల్లా జాయింట్‌ కలెక్టర్‌ అపరాజితసింగ్‌



పోటీలను ప్రారంభిస్తున్న జేసీ అపరాజితసింగ్‌, ఇతర అధికారులు.

కోనేరుసెంటర్‌: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ అపరాజితసింగ్‌ అన్నారు. ఈ నెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణాజిల్లా మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పోలీసు పోలీస్‌పరేడ్‌ గ్రౌండ్‌లోని ఇండోర్‌ స్టేడియంలో జిల్లాలోని వివిధ శాఖల జిల్లా మహిళా అధికారులకు షటిల్‌ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జేసీ పోటీలను ప్రారంభించి అధికారులతో కలిసి షటిల్‌ ఆడి అందరినీ అలరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ సమానత్వం కోసం సాంకేతికత, ఆవిష్కరణ ప్రధాన అంశంతో ఈ యేడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మార్చి 8న నిర్వహించటం జరుగుతుందన్నారు. అందుకోసం జిల్లాలోని మహిళా అధికారులకు షటిల్‌ బ్యాట్మింటన్‌, టెన్నీకాయిట్‌, రన్నింగ్‌ వంటి ఆటల పోటీలు నిర్వహించటం అభినందనీయమని చెప్పారు. ఏఎన్‌ఎం, మహిళా పోలీస్‌, అంగన్‌వాడీ టీచర్స్‌ వారి విధుల్లో భాగంగా సాంకేతికతను వినియోగిస్తూ నివేదికలు అందజేయటం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు 8 ప్రధాన సూచికల్లో మహిళా సాధికారతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్‌ పీడీ ఎస్‌.సువర్ణ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్‌ కోచ్‌ ఝాన్సీలక్ష్మీ, సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నాలుగో టెస్టుకూ కెప్టెన్‌గా స్మిత్



బోర్డర్–గావస్కర్ ట్రోఫీ మూడో టెస్టులో ఆస్ట్రేలియాను విజయపథంలో నడిపించిన స్టీవ్ స్మిత్ సారథ్య బాధ్యతలు కొనసాగనున్నాయి. తన తల్లి అనారోగ్యం కారణంగా ఆస్ట్రేలియాకు తిరిగి వెళ్లిన రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ చివరి టెస్టు సమయానికి కూడా తిరిగి రాలేకపోతున్నాడు. దాంతో అహ్మదాబాద్‌లో గురువారంనుంచి జరిగే నాలుగో టెస్టులోనూ స్మిత్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఇండోర్ టెస్టులో విజయం తర్వాత కంగారూ జట్టులో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. వన్డే సిరీస్‌కైనా కమిన్స్ తిరిగి వస్తాడా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు.

దక్షిణాఫ్రికా టి20 కెప్టెన్‌గా మార్క్‌రమ్



దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టుకు టి20 ఫార్మాట్‌లో ఎయిడెన్ మార్క్‌రమ్‌ను కొత్త సారథిగా నియమిస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. ఇప్పటి వరకు టి20ల్లో కెప్టెన్‌గా వ్యవహరించిన తెంబా బవుమా ఘోరంగా విఫలమయ్యాడు. 2014లో అండర్–19 వరల్డ్ కప్ గెలిపించిన మార్క్‌రమ్, ఇటీవల తొలి దక్షిణాఫ్రికా టి20 లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ టీమ్‌ను చాంపియన్‌గా నిలిపాడు. దాంతో ఐపీఎల్ టీమ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా అతడినే సారథిగా ఎంపిక చేసింది.

జ్యోతికశ్రీకి స్వర్ణం



తిరువనంతపురం: జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి దండి జ్యోతికశ్రీ స్వర్ణంతో మెరిసింది. సీనియర్ మహిళల 400 మీటర్ల పరుగులతో జ్యోతిక శ్రీ మొదటి స్థానంలో నిలిచింది. 53.26 సెకన్ల టైమింగ్‌తో రేస్ పూర్తి చేసి ఆమె విజేతగా నిలిచింది. ఈ ఈవెంట్‌లో ఐశ్వర్య (మహారాష్ట్ర – 53.49 సె.), కిరణ్ పహల్ (హరియాణా – 54.29 సె.) రజత, కాంస్యాలు దక్కించుకున్నారు. అండర్–20 విభాగంలో ప్రియా మోహన్ (కర్నాటక – 53.55 సె.) పసిడి పతకాన్ని గెలుచుకుంది.

జాతీయ రికార్డు నమోదు...

ఇదే చాంపియన్‌షిప్ అండర్–16 బాలికల విభాగం 400 మీటర్ల పరుగులో కొత్త జాతీయ రికార్డు నమోదైంది. బెంగాల్‌కు చెందిన రెజోనా మలిక్ హీనా 53.22 సెకన్లలో రేస్ పూర్తి చేసి స్వర్ణం సాధించడంతో పాటు కొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది. గతంలో అంజనా థమ్కే (54.57 సె.) పేరిట ఉన్న రికార్డును హీనా బద్దలు కొట్టింది. ఈ ఈవెంట్‌లో మాన్సి భరేకర్ (మహారాష్ట్ర), నేత్ర (తమిళనాడు) తర్వాతి రెండు స్థానాల్లో నిలిచారు.

బంగ్లాను గెలిపించిన షకీబ్



చిట్టోగ్రామ్: ఇంగ్లండ్ చేతిలో ఇప్పటికే వన్డే సిరీస్ ఓడిన బంగ్లాదేశ్‌కు ఓదార్పు విజయం దక్కింది. సోమవారం జరిగిన మూడో వన్డేలో బంగ్లా 50 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబ్ అల్ హసన్ (71 బంతుల్లో 75; 7 ఫోర్లు – 4/35) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించాడు. ముందుగా బంగ్లాదేశ్ 48.5 ఓవర్లలో 246 పరుగులకు ఆలౌటైంది. ముష్ఫికర్ రహీమ్ (93 బంతుల్లో 70; 6 ఫోర్లు), నజ్ముల్ హొస్సేన్ (71 బంతుల్లో 53; 5 ఫోర్లు) కూడా అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం ఇంగ్లండ్ 43.1 ఓవర్లలో 196 పరుగులకే ఆలౌటైంది. జేమ్స్ విన్స్ (38), ఫిల్ సాల్ట్ (35), క్రిస్ వోక్స్ (34) ఫర్వాలేదనిపించారు. సిరీస్‌ను ఇంగ్లండ్ 2–1తో సొంతం చేసుకోగా...8 వికెట్లు తీసిన ఆదిల్ రషీద్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో వన్డేల్లో షకీబ్ 300 వికెట్లు మైలురాయిని అందుకున్నాడు. జయసూర్య, షాహిద్ అఫ్రిది తర్వాత వన్డేల్లో 300 వికెట్లు తీసి, 6 వేల పరుగులు చేసిన మూడో ఆల్ రౌండర్‌గా అతను గుర్తింపు పొందాడు.

సహజ యమ్లపల్లికి చోటు

ఫెడ్ కప్ కోసం భారత జట్టు ప్రకటన



న్యూఢిల్లీ: ఆసియా ఓషియానియా గ్రూప్ 1 ఫెడరేషన్ కప్ (బిల్లీ జీన్ కింగ్ కప్)లో పాల్గొనే ఐదుగురు సభ్యుల భారత జట్టును అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) ప్రకటించింది. ఈ టీమ్‌లో అంకితా రైనా (ప్రపంచ 241వ ర్యాంకర్), కర్మన్ కౌర్ తాండి (268), రుతుజా భోస్లే (419), వైదేహి చౌదరి (492)తో పాటు హైదరాబాద్‌కు చెందిన సహజ యమ్లపల్లి (454)కి స్థానం లభించింది. నగరానికి చెందిన సహజ అమెరికాలోనే చదువుకుంటూ అక్కడే శిక్షణ తీసుకుంటోంది. హైదరాబాద్‌కే చెందిన భమిడిపాటి శ్రీవల్లి రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపికైంది. వైదేహి ఇటీవలే తన రెండో ఐటీఎఫ్ టైటిల్ గెలుచుకోగా, భారత క్రీడాకారిణుల్లో నాలుగో ర్యాంక్‌లో ఉన్న సహజకు కూడా తొలి సారి అవకాశం లభించింది. 'నిలకడగా రాణిస్తున్న యువ ప్లేయర్లకు మరిన్ని అవకాశాలు ఇవ్వాలని మేం భావించాం. అందుకే వైదేహి, సహజలను ఎంపిక చేశాం. వీరిద్దరు కొంత అనుభవం సాధిస్తే ముున్ముందు తమ సీనియర్లను దాటి మంచి ఫలితాలు సాధించగలరనే నమ్మకం ఉంది' అని ఏఐటీఏ ప్రతినిధి నందన్ బల్ వెల్లడించారు. మరో వైపు ఇతర సహాయక సిబ్బందిని కూడా కొత్తగా ఎంపిక చేశారు. ఇప్పటి వరకు కోచ్‌గా ఉన్న విశాల్ ఉప్పల్‌ను తప్పించి అతని స్థానంలో షాలిని ఠాకూర్ చావ్లాను ఎంపిక చేయగా...కోచ్‌గా రాధిక కనిత్కర్ వ్యవహరిస్తుంది. ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్‌లో ఏప్రిల్ 10నుంచి ఈ టోర్నమెంట్ జరుగుతుంది.

వ్యాక్సిన్ వేసుకోలేదని...



ఇండియన్‌వెల్స్: వరల్డ్ నంబర్‌వన్ టెన్నిస్ స్టార్ నొవాక్ జొకోవిచ్‌ను ఇంకా కరోనా వ్యాక్సిన్ కష్టాలు వీడటం లేదు. అతను వ్యాక్సిన్ వేసుకోలేదనే కారణంతో అమెరికా ప్రభుత్వం తమ దేశంలోకి అడుగు పెట్టేందుకు అతడిని అనుమతించలేదు. దాంతో ప్రతిష్టాత్మక ఇండియన్ వెల్స్ టోర్నమెంట్‌నుంచి అతను తప్పుకున్నాడు. తనకు మినహాయింపు ఇవ్వాలంటూ జొకోవిచ్ చేసిన దరఖాస్తును అక్కడి అధికారులు తిరస్కరించారు. ఇండియన్‌వెల్స్‌తో పాటు మరో పెద్ద టోర్నీ మయామీ ఓపెన్‌కు కూడా జొకోవిచ్ దూరం కానున్నాడు. ఈ రెండు టోర్నీలు మార్చి 19 – ఏప్రిల్ 2 మధ్య జరుగుతాయి.

నేటినుంచి జర్మన్ ఓపెన్

ముల్హీమ్: భారత యువ షట్లర్, గత ఏడాది రన్నరప్ లక్ష్య సేన్ ఈ సారి జర్మన్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. నేటినుంచి జరిగే ఈ టోర్నీలో అతను ఆరో సీడ్‌గా బరిలోకి దిగుతున్నాడు. తొలి రౌండ్‌లో లక్ష్య ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టో పొపోవ్‌తో తలపడతాడు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యతో పాటు మిథున్ మంజునాథ్ బరిలో ఉన్నాడు. అయితే మరో భారత టాప్ ఆటగాడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కిడాంబి శ్రీకాంత్ అనూహ్యంగా ఈ టోర్నీకి దూరమయ్యాడు. సరైన సమయంలో అతనికి వీసా లభించకపోవడంతో శ్రీకాంత్ తప్పుకోవాల్సి వచ్చింది. మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, మాళవిక బన్సోద్, తస్నీమ్ మీర్ బరిలో నిలిచారు. పురుషుల డబుల్స్, మహిళల డబుల్స్‌లలో భారత్‌నుంచి ఒక్క ఎంట్రీ కూడా లేకపోగా...మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమీత్ రెడ్డి – అశ్విన్ పొన్నప్ప ద్వయం పోటీ పడుతోంది.



ప్రైమ్ వాలీబాల్ లీగ్ రెండో సీజన్‌లో విజేతగా నిలిచిన అహ్మదాబాద్ డిఫెండర్స్ జట్టు. కొచ్చిలో జరిగిన ఫైనల్లో అహ్మదాబాద్ 15-7, 15-10, 18-20, 13-15, 15-10 స్కోరుతో బెంగళూరు టార్పెడోస్ జట్టును ఓడించింది.

ముంబై సూపర్ షో

- 9 వికెట్లతో బెంగళూరుపై ఘన విజయం
- హేలీ మాథ్యూస్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- నట్ సీవర్ అర్ధ సెంచరీ
- మహిళల ప్రీమియర్ లీగ్



నట్ సీవర్



హేలీ మాథ్యూస్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ముంబై ఇండియన్స్ ధనాధన్ ఆల్‌రౌండ్ షోతో వరుసగా రెండో విజయం సాధించింది. సోమవారం జరిగిన పోరులో 9 వికెట్ల తేడాతో బెంగళూరు రాయల్ చాలెంజర్స్‌ను చిత్తు చేసింది. బౌలింగ్‌లో 3 వికెట్లు పడగొట్టిన హేలీ మాథ్యూస్ బ్యాటింగ్‌లో (38 బంతుల్లో 77 నాటౌట్; 13 ఫోర్లు, 1 సిక్స్) ఆకాశమే హద్దుగా చెలరేగింది. టాపార్డర్ బ్యాటర్ నట్ సీవర్ బ్రంట్ (29 బంతుల్లో 55 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్) కూడా మెరుపు అర్ధ సెంచరీ సాధించడంతో ఛేదన సులువైంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 18.4 ఓవర్లలో 155 పరుగులకు ఆలౌటైంది. రిచా ఘోష్ (26 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా, సయిక ఇషాక్, అమెలియా కెర్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ముంబై ఇండియన్స్ హేలీ, బ్రంట్‌ల అజేయ అర్ధ సెంచరీలతో 14.2 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 159 పరుగులు చేసింది.

అందరూ అంతంతే!

బెంగళూరు స్కోరైతే 150 దాటింది కానీ... ఏ ఒక్క బ్యాటర్‌ది చెప్పుకోదగ్గ స్కోరుగానీ, ఇన్నింగ్స్‌ను కుదుటపర్చిన భాగస్వామ్యంగానీ లేవు. అదే బెంగళూరు పాలిట శాపమైంది. కెప్టెన్, ఓపెనర్ స్మృతి మంధాన (17 బంతుల్లో 23; 5 ఫోర్లు) మొదలు మేగన్ షట్ (14 బంతుల్లో 20; 3 ఫోర్లు) దాకా ఐదుగురు బ్యాటర్లు రిచా, కనిక ఆహుజా (13 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్), శ్రేయాంక పాటిల్ (15 బంతుల్లో 23; 4 ఫోర్లు) 20 పైచిలుకు పరుగులు చేశారు. అందరు ఇలా వచ్చి అలా షాట్లు బాదేసి పెవిలియన్‌కు వెళ్లినవారే! ఇందులో ఏ ఒక్కరు నిలబడినా, మెరుపుల భాగస్వామ్యం నమోదైనా పరిస్థితి మరోలా ఉండేది. అయితే ముంబై బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టడంలో సమష్టిగా సఫలమయ్యారు.

హేలీ, బ్రంట్ ఫిఫ్టీ–ఫిఫ్టీ

ముంబై ముందున్న లక్ష్యం 156 పరుగులు. అంత సులభమైందేమీ కాదు. కానీ యస్తిక భాటియా (19 బంతుల్లో 23; 4 ఫోర్లు)తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన హేలీ మాథ్యూస్ తొలి ఓవర్ నుంచే ఎదురుదాడికి దిగింది. స్కోరు జోరందుకున్న సమయంలో యస్తికను ప్రీతి బోస్ వికెట్ ముందు దొరకబుచ్చుకుంది. 45 పరుగుల వద్ద తొలి వికెట్ కూలగా, బెంగళూరుకు అదే ఆఖరి ఆనందం అయ్యింది. తర్వాత నట్ సీవర్ వచ్చాక హేలీ వేగం మరో దశకు చేరింది. బెంగళూరు కెప్టెన్ బౌలర్లను మార్చి మార్చి ప్రయోగించినా ఫలితం లేకపోయింది. అటు బ్రంట్, ఇటు హేలీ బౌండరీలను అవలీలగా బాదేస్తుంటే ఆద్యంతం 'పవర్ ప్లే'నే కనిపించింది. పదో ఓవర్లోనే హేలీ 26 బంతుల్లో (8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. 10.2 ఓవర్లోనే జట్టు స్కోరు 100 దాటింది. మేగన్ షట్ వేసిన 12, శ్రేయాంక పాటిల్ వేసిన 13వ ఓవర్లలో బ్రంట్, హేలీలు ఫోర్లతో చెలరేగిపోయారు. దీంతో ఈ రెండు ఓవర్లలోనే ముంబై 40 పరుగులు చేయడంతో లక్ష్యాన్ని 5.4 ఓవర్ల ముందే ఛేదించింది.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: స్మృతి మంధాన (సి) వాంగ్ (బి) హేలీ 23; సోఫీ (సి) అమన్‌జోత్ (బి) సయిక 16; దిశ (బి) సయిక 0; ఎలైస్ పెర్రీ రనౌట్ 13; హీథెర్‌నైట్ (బి) హేలీ 0; రిచాఘోష్ (సి) నట్ సీవర్ (బి) హేలీ 28; కనిక (సి) యస్తిక (బి) పూజ 22; శ్రేయాంక (ఎల్బీ) (బి) నట్ సీవర్ 23; మేగన్ (స్టంప్డ్) యస్తిక (బి) అమెలియా 20; రేణుక (బి) అమెలియా 2; ప్రీతి నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (18.4 ఓవర్లలో ఆలౌట్)** 155. **వికెట్ల పతనం:** 1–39, 2–39, 3–43, 4–43, 5–71, 6–105, 7–112, 8–146, 9–154, 10–155. **బౌలింగ్:** హేలీ 4–0–28–3, నట్ సీవర్ 3–0–34–1, సయిక ఇషాక్ 4–0–26–2, ఇసి వాంగ్ 2–0–18–0, అమెలియా కెర్ 3.4–0–30–2, కలిత 1–0–10–0, పూజ 1–0–8–1.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: హేలీ మాథ్యూస్ నాటౌట్ 77; యస్తిక (ఎల్బీ) (బి) ప్రీతి 23; నట్ సీవర్ నాటౌట్ 55; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (14.2 ఓవర్లలో వికెట్ నష్టానికి)** 159. **వికెట్ల పతనం:** 1–45. **బౌలింగ్:** రేణుక 3–0–28–0, ప్రీతి బోస్ 4–0–34–1, మేగన్ షట్ 3–0–32–0, ఎలైస్ పెర్రీ 1.2–0–18–0, శ్రేయాంక 2–0–32–0, సోఫీ డివైన్ 1–0–11–0.

డబ్ల్యూపీఎల్‌లో నేడు

ఢిల్లీ క్యాపిటల్స్ X లక్నో విజార్డ్స్
రాత్రి గం. 7:30 నుంచి

స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

సినిమా

అమితాబ్‌కి గాయం


● కొన్ని వారాలు విశ్రాంతి



● అమితాబ్

''ఇవాళ జల్సా (అమితాబ్ నివాసం పేరు) కి ఎవరూ రావద్దు. నా శ్రేయోభిలాషులను కలవడానికి కుదరదని చెప్పడానికి నాకు కష్టంగానే ఉంది'' అని అమితాబ్ బచ్చన్ ఆదివారం తన బ్లాగ్‌లో పేర్కొన్నారు. మామూలుగా వారంలో ఓసారి.. ఎక్కువగా ఆదివారం తన అభిమానులను కలుస్తుంటారు ఆయన. అయితే ఈసారి అనుకోకుండా అమితాబ్ ప్రమాదానికి గురికావడంతో కలవలేకపోయారు. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ప్రాజెక్ట్ కె' చిత్రంలో అమితాబ్ బచ్చన్ కీలక పాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో ఈ చిత్రానికి సంబంధించిన షెడ్యూల్ జరుగుతోంది. అమితాబ్ కూడా పాల్గొంటున్నారు. ఓ యాక్షన్ సీన్ చిత్రీకరిస్తున్న సమయంలో అనుకోకుండా జరిగిన ప్రమాదం వల్ల అమితాబ్ పక్కటెముకలకు గాయం అయింది. దీంతో ఆయన కొన్ని వారాలపాటు విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ''శనివారం షూటింగ్ అంతా సజావుగా జరుగుతున్న సమయంలో ప్రమాదం జరిగింది. అయితే అప్పుడు ఏమీ అనిపించలేదు. అమితాబ్ షూటింగ్ ముగించి తన రూమ్‌కి వెళ్లారు. రాత్రి 'రైట్ రిబ్స్' (కుడి పక్కటెముకలు) బాగా నొప్పి అనిపించాయని మర్నాడు మాతో అంటే, డాక్టర్లను పిలిపించాం. సీటీ స్కాన్ తీయాలన్నారు. దాంతో ఆస్పత్రికి తీసుకెళ్లాం. పరీక్షలు చేసి, విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరున అమితాబ్ షూటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. లేకపోతే ఆయన పూర్తిగా కోలుకున్నాకే షూటింగ్‌కి వస్తారు'' అని చిత్రనిర్మాత అశ్వనీదత్ తెలిపారు. ఇక అమితాబ్ తన బ్లాగ్‌లో రాసుకున్న విషయాల్లో ''నొప్పి బాగానే ఉంది. పెయిన్ కిల్లర్స్ ఇచ్చారు. ప్రస్తుతానికి ఊపిరి తీసుకోవడం కాస్త కష్టంగా ఉంది. ఇప్పుడు ముంబైలో నా జల్సాలో విశ్రాంతి తీసుకోవడం తప్ప ఏమీ చేయలేను. ఇది మినహా అంతా బాగానే ఉంది'' అని పేర్కొన్నారు.

ఈ రావణాసురుణ్ణి దాటి వెళ్లాలి!



● రవితేజ

'సీతని తీసుకెళ్లాలంటే సముద్రం దాటితే సరిపోదు... ఈ రావణాసురుణ్ణి దాటి వెళ్లాలి' అని వార్నింగ్ ఇస్తున్నారు రవితేజ. సుధీర్ వర్మ దర్శకత్వంలో రవితేజ హీరోగా నటించిన చిత్రం 'రావణాసుర'. అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజిత పొన్నాడ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో సుశాంత్ కీలక పాత్ర చేశారు. అభిషేక్ నామా, రవితేజ నిర్మించారు. ఏప్రిల్ 7న విడుదలకానున్న ఈ చిత్రం టీజర్‌ని విడుదల చేసింది యూనిట్. 'ప్రతి క్రిమినల్ వాడు చేసిన క్రైమ్ మీద వాడి సంతకం వదిలేసి వెళ్లిపోతాడు.. ఆ సంతకం కోసం వెతకండి..' అంటూ ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్‌గా నటుడు జయరామ్ చెప్పే డైలాగ్‌తో టీజర్ ప్రారంభమై, 'సీతని తీసుకెళ్లాలంటే సముద్రం దాటితే సరిపోదు... ఈ రావణాసురుణ్ణి దాటి వెళ్లాలి' అంటూ రవితేజ చెప్పే డైలాగ్‌తో ముగుస్తుంది. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్ సిసిరోలియో, కెమెరా: విజయ్ కార్తీక్ కన్నన్, సీఈఓ: పోతిని వాసు.

ఎన్టీఆర్‌కి జోడీగా జాన్వీ



● జాన్వీ కపూర్

తెలుగు చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోలందరితో నటించి ఓ వెలుగు వెలిగారు శ్రీదేవి. ఆమె పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ టాలీవుడ్ ఎంట్రీ షురూ అయింది. ఎన్టీఆర్ సినిమాతో జాన్వీ కపూర్ తెలుగులో ఎంట్రీ ఇస్తున్నారు. సోమవారం (మార్చి 6) జాన్వీ కపూర్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ విషయాన్ని చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఎన్టీఆర్ 30' (వర్కింగ్ టైటిల్). నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధా ఆర్ట్స్ పతాకంపై సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. ఈ మూవీలో ఎన్టీఆర్ సరసన జాన్వీ కపూర్ నటిస్తారని ప్రకటించి, ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేసింది చిత్రయూనిట్.

శర్వా 35 షురూ



● శర్వానంద్

హీరో శర్వానంద్ పుట్టినరోజు (మార్చి 6) సందర్భంగా తన 35వ చిత్రంపై అధికారిక ప్రకటన వచ్చింది. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. మార్చి 6న శర్వానంద్ బర్త్ డే సందర్భంగా 'శర్వా 35'(వర్కింగ్ టైటిల్)లోని ఫస్ట్ లుక్స్‌ని చిత్రయూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా టీజీ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ– ''ఒక యూనిక్ పాయింట్‌తో ఫ్యూచరిస్టిక్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుంది. శర్వానంద్‌ను స్టైలిష్ లుక్‌లో చూపిస్తున్నారు శ్రీరామ్ ఆదిత్య. ఈ మూవీ చిత్రీకరణ ప్రారంభమైంది. ఇతర వివరాలు త్వరలోనే తెలియజేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, కెమెరా: విష్ణు శర్మ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కృతి ప్రసాద్, ఫణి కె. వర్మ.

ఇవాళే కలిశారు తొలిసారిగా..



● నాగశౌర్య, మాళవిక

నాగశౌర్య, మాళవికా నాయర్ జంటగా శ్రీనివాస్ అవసరాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. టీజీ విశ్వ ప్రసాద్, పద్మజ దాసరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న రిలీజ్ కానుంది. కళ్యాణీ మాలిక్ సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'ఫలానా అబ్బాయ్ ఫలానా అమ్మాయ్.. ఫలానా అబ్బాయ్ ఫలానా అమ్మాయ్.. ఇవాళే కలిశారు తొలిసారిగా..' అంటూ సాగే రెండో పాటని సోమవారం విడుదల చేశారు. గాయని నూతన మోహన్, కళ్యాణీ మాలిక్ పాడిన ఈ పాటకి భాస్కరభట్ల రవికుమార్ సాహిత్యం అందించారు. ''హీరో, హీరోయిన్ల పరిచయ గీతం ఇది. ఈ చిత్రంలో మూడు పాటలు రాశాను'' అన్నారు భాస్కరభట్ల రవికుమార్. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, కెమెరా: సునీల్ కుమార్ నామ, సంగీతం: కళ్యాణీ మాలిక్, వివేక్ సాగర్ (కాఫీపై సాంగ్).

ప్రేక్షకులు థ్రిల్ అవుతారు

– అజయ్ శ్రీనివాస్



''మా 'సీఎస్ఐ సనాతన్' ట్రైలర్ చూసిన పెద్ద దర్శకులు థ్రిల్లింగ్‌గా ఉందని ప్రశంసించడంతో మా నమ్మకం మరింత పెరిగింది. ప్రేక్షకులు కూడా థ్రిల్ అవుతారు'' అని నిర్మాత అజయ్ శ్రీనివాస్ అన్నారు. ఆది సాయికుమార్, మిషా నారంగ్ జంటగా శివశంకర్ దేవ్ దర్శకత్వం వహించిన చిత్రం 'సీఎస్ఐ సనాతన్'. అజయ్ శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ– ''సీఎస్ఐ అంటే 'క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్' అని అర్థం. ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ వాళ్లు నేర నిర్ధారణ ఎలా చేస్తారు? వారి ఇన్వెస్టిగేషన్ ఎంత క్షుణ్ణంగా ఉంటుంది? అనే పాయింట్‌ను దర్శకుడు చక్కగా చెప్పాడు. ఈ చిత్రానికి సీక్వెల్‌కి కథ రెడీ అయింది. 'వేదాంత్' అనే టైటిల్‌తో మరో థ్రిల్లర్ సినిమా ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు.

మంచి లక్ష్యంతో...



● యోగేశ్వర్, అతిథి

యోగేశ్వర్, అతిథి జంటగా సాయి శివాజీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పరారీ'. గాలి ప్రత్యూష సమర్పణలో జీవీవీ గిరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదలకానుంది. ఈ మూవీ పోస్టర్‌ను ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి, టీజర్‌ను ప్రొడ్యూసర్ కౌన్సిల్ అధ్యక్షుడు దామోదర్ ప్రసాద్ విడుదల చేశారు. ''మంచి సినిమా తీయాలనే లక్ష్యంతో 'పరారీ' నిర్మించాను. సుమన్‌గారి వందో సినిమా నేను నిర్మించాల్సి ఉన్నా కుదరలేదు.. ఈ మూవీలో సుమన్‌గారు మంచి పాత్ర చేశారు'' అన్నారు జీవీవీ గిరి. ''పరారీ'లో అన్ని పాటలు బాగా వచ్చాయి'' అన్నారు సంగీత దర్శకుడు మహిత్ నారాయణ్.

పులి విజువల్స్ బాగున్నాయి

– కేఎల్ దామోదర్ ప్రసాద్



● సుధాకర్, దామోదర్

''**'పులి'** సినిమా ట్రైలర్‌లో విజువల్స్ బాగున్నాయి'' అన్నారు నిర్మాతల మండలి అధ్యక్షుడు కేఎల్ దామోదర్ ప్రసాద్ అన్నారు. సిజు విల్సన్, కాయాదు లోహర్ జంటగా వినయన్ దర్శకత్వం వహించిన మలయాళ హిట్ 'పాథోన్‌పథం నూట్టాండు' తెలుగులో 'పులి– 19వ శతాబ్దం' టైటిల్‌తో రిలీజ్ కానుంది. నిర్మాత సీహెచ్ సుధాకర్ బాబు ఈ నెల 10న విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ని దామోదర్ ప్రసాద్ రిలీజ్ చేశారు. సుధాకర్‌బాబు మాట్లాడుతూ– ''పాతికేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. అయితే 'అమ్మ దొంగ' తర్వాత నాకు మళ్లీ అంత పెద్ద సక్సెస్ రాలేదు. 'పులి'తో ఆ సక్సెస్ వస్తుందని ఆశిస్తున్నా'' అన్నారు.

కెమెరామేన్ ప్రవీణ్ కన్నుమూత



కెమెరామేన్ ప్రవీణ్ అనుమోలు ఆదివారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. అసిస్టెంట్ కెమెరామేన్‌గా కెరీర్‌ను మొదలుపెట్టారు ప్రవీణ్. పవన్ కల్యాణ్ 'పంజా', ఎన్టీఆర్ 'యమదొంగ' చిత్రాలతో పాటు హిందీలో 'బేబీ', 'ధూమ్ 3', 'బాజీరావ్ మస్తానీ' వంటి చిత్రాలకు అసిస్టెంట్ కెమెరామేన్‌గా చేశారు. 2017లో వచ్చిన 'దర్శకుడు' చిత్రంతో కెమెరామేన్‌గా మారారు. ఈ చిత్రాన్ని డైరెక్టర్ సుకుమార్ నిర్మించారు. 'దర్శకుడు' తర్వాత ప్రవీణ్ మరికొన్ని సినిమాలకు కెమెరామేన్‌గా చేశారు. అయితే అవి ఇంకా రిలీజ్ కాలేదు. ఈలోపు ఇలా జరగడం పట్ల పలువురు చిత్రరంగ ప్రముఖుల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	415	60,224
నిఫ్టీ ▲	117	17,711

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లష్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,780	▲ 93
డోజోన్స్	33,512	▲ 121
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,930	▽ 17
డాక్స్	15,654	▲ 75
హాంగ్‌సెంగ్	3,322	▽ 6
నికాయ్	28,927	▲ 310

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారట్)	56,089
బంగారం (22 క్యారట్)	55,865
వెండి (కిలో)	64,266

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.45	83.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	95.78	100.31
€	యూరో	ఎస్‌బీఐ	84.86	87.81
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	58.75	60.17
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.33	57.17
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.21	61.15
SAR	సౌదీ రియాల్	ధనలక్ష్మీ	20.11	22.21
UAE D	యూఏఈ దిర్హామ్	ధనలక్ష్మీ	21.23	23.91
¥	చైనా యువాన్	ధనలక్ష్మీ	10.65	12.44

మహిళల హైరింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం

ఫౌండిట్ సర్వేలో వెల్లడి

ముంబై: దేశీయంగా ఉద్యోగ నియామకాల్లో మహిళలకు ప్రాధాన్యమిచ్చే ధోరణి పెరుగుతోంది. కంపెనీల్లో వైట్ కాలర్ ఉద్యోగాల్లో (ఆఫీసుల్లో చేసే) మహిళల రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరిలో డిమాండ్ 35 శాతం పెరిగింది. జాబ్ ప్లాట్‌ఫామ్ ఫౌండిట్ (గతంలో మాన్‌స్టర్ ఏపీఏసీ, ఎంఈ) తమ పోర్టల్‌లో నమోదైన హైరింగ్ గణాంకాల ఆధారంగా రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. మహిళా ఉద్యోగుల సంఖ్యను పెంచుకునే దిశగా.. నెలసరి, శిశు సంరక్షణ తదితర సందర్భాల కోసం ప్రత్యేకంగా సెలవులు ఇవ్వడం, కార్యాలయాల్లో పక్షపాత ధోరణులను నిరోధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంలాంటి అంశాలపై కంపెనీలు దృష్టి పెడుతున్నాయి. అలాగే పని విషయంలో వెసులుబాటు కల్పించడం వంటివి చేస్తున్నాయి. మహిళా ఉద్యోగులకు డిమాండ్‌పరంగా చూస్తే ఐటీఈఎస్/బీపీవో రంగంలో అత్యధికంగా 36 శాతం, ఐటీ/కంప్యూటర్స్–సాఫ్ట్‌వేర్ (35%), బ్యాంకింగ్/అకౌంటింగ్/ఆర్థిక సర్వీసులు (22%)గా ఉంది.

అవగాహన ఉన్నా వినియోగం కొంతే..

- మహిళలకు ఆర్థిక సేవలపై ఆర్‌బీఐ అధ్యయనం
- పిల్లల చదువుల కోసం పొదుపునకు ప్రాధాన్యం

ముంబై: ఆర్థిక సేవలపై మహిళలకు అవగాహన పెరుగుతున్నప్పటికీ వారు వాటిని వినియోగించుకోవడం తక్కువగానే ఉంటోంది. బీమా తదితర సాధనాల గురించి మూడో వంతు మందికి తెలిసినా కూడా డిజిటల్ విధానంలో కొనుగోలు చేసే వారి సంఖ్య ఒక్క శాతం కూడా ఉండటం లేదు. రిజర్వ్ బ్యాంక్‌లో భాగమైన రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్, డిజిటల్ చెల్లింపుల నెట్‌వర్క్ పేనియర్‌బై నిర్వహించిన సర్వేలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం మహిళల్లో .. ముఖ్యంగా 18–35 ఏళ్ల వారిలో బీమాపై అవగాహన గతేడాది 29 శాతం మేర పెరిగింది. కానీ పాలసీల వినియోగం 1 శాతానికి లోపే ఉంది. మహిళలు ఎక్కువగా జీవిత బీమా, ఆరోగ్య బీమా వైపు మొగ్గు చూపుతున్నారు. 5,000 రిటైల్ స్టోర్స్‌లో ఆర్థిక సేవలను వినియోగించుకున్న ఈ వయస్సు గ్రూప్ మహిళలపై నిర్వహించిన సర్వే ద్వారా అధ్యయన నివేదిక రూపొందింది. దీనికి సంబంధించిన మరిన్ని విశేషాలు..

- రిటైల్ స్టోర్స్‌లో మహిళలు ఎక్కువగా నగదు విత్‌డ్రాయల్, మొబైల్ రీచార్జీలు, బిల్లుల చెల్లింపుల సర్వీసులను వినియోగించుకుంటున్నారు. ఇతరత్రా పాన్ కార్డు దరఖాస్తులు, వినోదం, ప్రయాణాలు, ఈ–కామర్స్ మొదలైన వాటి సంబంధిత లావాదేవీలూ చేస్తున్నారు.
- తమ పిల్లలకు మంచి చదువు ఇవ్వడానికి అత్యధిక శాతం మహిళలు ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకు పొదుపే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు 68% మంది తెలిపారు. ఇక అత్యవసర వైద్యం, ఎలక్ట్రానిక్ గృహోపకరణాల కొనుగోలు కోసం పొదుపు చేసుకోవడమూ యవారికి ప్రాధాన్యతాంశాలు.
- నగదు లావాదేవీలను తగ్గించడానికి ప్రభుత్వం, ఆర్‌బీఐ ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కూడా చాలా మంది మహిళలు నగదు రూపంలో లావాదేవీలు జరపడానికే ప్రాధాన్యమిస్తున్నారు. సర్వేలో పాల్గొన్న వారిలో సుమారు 48 శాతం మంది నగదువైపే మొగ్గు చూపారు. నగదు విత్‌డ్రాయల్ సర్వీసుల కోసమే రిటైల్ స్టోర్‌ను సందర్శిస్తామంటూ 78 శాతం మంది తెలిపారు.
- అయితే, అదే సమయంలో డిజిటల్ చెల్లింపుల కోసం యూపీఐ వినియోగమూ పెరుగుతోంది. 5–20% మంది మహిళలు దీనిని ఎంచుకుంటున్నారు. క్రెడిట్ కార్డుల వినియోగం దాదాపు శూన్యమే.
- డిజిటల్ మాధ్యమం వినియోగం.. 18–40 ఏళ్ల గ్రూప్ మహిళల్లో ఎక్కువగా ఉంటోంది. వారిలో 60%మందికి పైగా మహిళలకు స్మార్ట్‌ఫోన్లు, వాటి ద్వారా డిజిటల్ కంటెంట్ అందుబాటులో ఉంటోంది.

లాభాల హోలీ

- రెండోరోజూ మార్కెట్ ర్యాలీ
- 60వేల స్థాయి పైకి సెన్సెక్స్
- 17,700 ఎగువకు నిఫ్టీ
- ఐటీ, ఫైనాన్స్, ఆటో షేర్లకు డిమాండ్
- నేడు మార్కెట్లకు హోలీ సెలవు



ముంబై: ఐటీ, ఫైనాన్స్, ఇంధన, ఆటో షేర్ల ర్యాలీకి తోడు ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో స్టాక్ మార్కెట్ సోమవారమూ లాభపడింది. అదానీ గ్రూప్‌లోకి జీక్యూజీ పార్ట్‌నర్స్ ద్వారా పెట్టుబడులు రావడం, విదేశీ ఇన్వెస్టర్ల షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు, అమెరికా బాండ్లపై ఈల్డ్ తగ్గడం తదితర అంశాలు కలిసొచ్చాయి. ఫలితంగా సెన్సెక్స్ 415 పాయింట్లు బలపడి 60 వేల స్థాయిపైనా 60,224 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 117 పాయింట్లు పెరిగి 17,711 వద్ద నిలిచింది. కాగా, డాలర్ మారకంలో రూపాయి విలువ ఐదు పైసలు బలపడి 81.92 వద్ద స్థిరపడ్డాయి.

ఇంట్రాడేలో 18వేల స్థాయికి నిఫ్టీ

గతవారం లాభాలకు కొనసాగింపుగా సూచీలు ఈ వారాన్ని గ్యాప్ అప్‌తో మొదలయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 689 పాయింట్లు దూసుకెళ్లి 60,498 వద్ద, నిఫ్టీ 406 పాయింట్లు ఎగసి 18,000 వద్ద ఇంట్రాడే గరిష్టాను అందుకున్నాయి.

నేడు మార్కెట్‌కు సెలవు

హోలీ సందర్భంగా మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సెలవు. కమోడిటీ మార్కెట్ తొలి సెషన్‌లో మాత్రమే పనిచేయదు. సాయంత్రం సెషన్ (సాయంత్రం 5గంటల నుంచి 11:55 గంటకు వరకు)లో ట్రేడింగ్ జరుగుతుంది.

హీరో ప్రీమియం ఎలక్ట్రిక్ బైక్స్!

జీరో మోటార్‌సైకిల్స్‌తో జోడీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రీమియం ఎలక్ట్రిక్ బైక్స్ తయారీలోకి హీరో మోటోకార్ప్ ఎంట్రీ ఇవ్వనుంది. ఇందుకోసం యూఎస్‌కు చెందిన జీరో మోటార్‌సైకిల్స్‌తో చేతులు కలిపింది. పవర్‌ట్రెయిన్స్, ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్స్ తయారీలో జీరో మోటార్‌సైకిల్స్‌కు పేరుంది. ఈ కంపెనీలో సుమారు రూ.490 కోట్లు ఈక్విటీ రూపంలో పెట్టుబడి చేసేందుకు 2022 సెప్టెంబర్‌లో హీరో మోటోకార్ప్ బోర్డ్ ఆమోదం తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

7-3-2023	
విశాఖ	420–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	417–00
విజయవాడ	417–00
రిటైల్ ధర (డజను)	66.00
6-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	395–00
వరంగల్	397–00
రిటైల్ ధర	4.55

నగదు రహిత వ్యవస్థ బాటలో భారత్!

- 'హర్ పేమెంట్ డిజిటల్' మిషన్‌ను ఆవిష్కరించిన ఆర్‌బీఐ గవర్నర్
- యూపీఐ ఆధారిత పేమెంట్ వ్యవస్థపై పలు దేశాల ఆసక్తి
- ఆయా దేశాల చెల్లింపు ప్లాట్‌ఫామ్‌లతో యూపీఐ లింక్‌కు ఏర్పాట్లు



హర్ పేమెంట్ డిజిటల్ లోగోను ఆవిష్కరిస్తున్న ఆర్‌బీఐ గవర్నర్ తదితర అధికారులు

ముంబై: నగదు రహిత వ్యవస్థ ఆవిష్కరణ దిశలో భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రధాన కార్యాలయంలో డిజిటల్ చెల్లింపుల అవగాహన వారోత్సవాన్ని (డీపీఏడబ్ల్యూ) 2023 గవర్నర్ శక్తికాంతదాస్ సోమవారం ప్రారంభించారు. 'హర్ పేమెంట్ డిజిటల్' (డిజిటల్‌లోనే ప్రతి చెల్లింపు) పేరుతో కీలక చొరవకు శక్తికాంతదాస్ శ్రీకారం చుట్టారు. బ్యాంకులు, సంబంధిత అన్ని వర్గాలూ ఆన్‌లైన్ చెల్లింపులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, వాటి ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాలని అభ్యర్థించారు. యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్) పేమెంట్ వ్యవస్థ పట్ల ప్రస్తుతం జరుగుతున్న జీ20 దేశాల సమావేశాల్లోసహా పలు దేశాలు ఎంతో ఆసక్తి ప్రదర్శిస్తున్నాయన్నారు. ఈ వ్యవస్థతో సహకారానికి ప్రత్యేకించి ఆయా దేశాల చెల్లింపు ప్లాట్‌ఫారమ్‌లతో యూపీఐను అనుసంధానం చేయడానికి ముందడుగులు వేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రస్తుతం ఈ దేశాలతో..: యూపీఐ వ్యవస్థ ప్రస్తుతం సింగపూర్, యూఏఈ, ఒమన్, సౌదీ అరేబియా, మలేషియా, ఫ్రాన్స్, బెల్జియం, నెదర్లాండ్స్, లక్సెంబర్గ్, స్విట్జర్లాండ్‌లలో అందుబాటులో ఉంది. యూపీఐ స్వీకరించాలనుకునే 13 దేశాలతో భారత్ అవగాహన ఒప్పందాలపై సంతకం చేశాయని సమాచారం. 'యూపీఐ' – సింగపూర్ భాగస్వామి 'పేనౌ' మధ్య లింకేజీలు యాక్టివేట్ అయినప్పటి నుండి, చెల్లింపుల విషయంలో చాలా దేశాలు అటువంటి సహకారంలోకి ప్రవేశించడానికి ఆసక్తిని వ్యక్తం చేశాయని దాస్ తెలిపారు.

విస్తరణ వేగం..

యూపీఐ ద్వారా చెల్లింపులు గత 12 నెలల్లో విపరీతంగా పెరిగాయని గవర్నర్ శక్తికాంతదాస్ పేర్కొన్నారు. రోజువారీ లావాదేవీలు 36 కోట్లు దాటాయని అన్నారు. ఫిబ్రవరి 2022లో 24 కోట్లతో పోలిస్తే 50 శాతం పెరిగినట్లు పేర్కొన్నారు. విలువ పరంగా చూస్తే, యూపీఐ లావాదేవీల విలువ 2022 ఫిబ్రవరిలో రూ.5.36 లక్షల కోట్లయితే, 2023 ఫిబ్రవరిలో ఈ విలువ రూ. 6.27 లక్షల కోట్లకు పెరిగినట్లు తెలిపారు. ఫిబ్రవరి 2022లో రూ. 5.36 లక్షల కోట్ల నుండి 17 శాతం వృద్ధిని నమోదు చేశాయని చెప్పారు. గత మూడు నెలల్లో మొత్తం నెలవారీ డిజిటల్ చెల్లింపు లావాదేవీలు ప్రతి నెలా రూ. 1,000 కోట్ల మార్కును దాటాయని కూడా ఆయన చెప్పారు.

సోలిస్ ట్రాక్టర్స్ చేతికి జర్మనీ కంపెనీ థాలర్

న్యూఢిల్లీ: ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ గ్రూప్ అనుబంధ సంస్థ సోలిస్ ట్రాక్టర్స్ అగ్రికల్చరల్ మిషనరీ జర్మనీకు చెందిన థాలర్ జీఎంబీహెచ్ అండ్ కో.కేజీ ని కొనుగోలు చేసింది. ఈ వ్యూహాత్మక విలీనంతో సోలిస్ ట్రాక్టర్స్ యూరప్ మార్కెట్లోకి ప్రవేశించనుంది. అలాగే 19–75 హెచ్‌పీ శ్రేణికి చెందిన నాణ్యమైన జేసీబీలను తన పోర్ట్ ఫోలియోలోకి చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. రూ.200 కోట్ల ముందస్తు పెట్టుబడులతో ఈ డీల్‌ను ప్రారంభిస్తున్నట్లు ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ ఎండీ దీపక్ మిట్టల్ తెలిపారు. జర్మనీలోని థాలర్ ఫ్యాక్టరీ కార్యాలయంలో జరిగిన టేకోవర్ కార్యక్రమంలో ఐటీఎల్ గ్రూప్ ఎండీ దీపక్ మిట్టల్, థాలర్ జీఎంబీహెచ్ అండ్ కో.కేజీ కంపెనీ అధినేత మ్యాన్‌ఫ్రెడ్ థాలర్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ పాలీసెట్-2023

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ పాలీసెట్–2023 నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లోని డిప్లొమా(ఇంజనీరింగ్, నాన్–ఇంజనీరింగ్/టెక్నాలజీ) సీట్లను పాలీసెట్ ర్యాంకు ఆధారంగా భర్తీచేస్తారు.

» **అర్హత:** పదో తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులవ్వాలి. ఏప్రిల్ /మే–2023లో జరిగే పదో తరగతి లేదా తత్సమాన పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.04.2023.
» **ఏపీ పాలీసెట్ పరీక్ష తేది:** 10.05.2023.
» **వెబ్‌సైట్:** polycetap.nic.in

టీఎస్‌పీజీఈసెట్-2023

తెలంగాణ స్టేట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్)–2023 నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. పరీక్షను జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జేఎన్‌టీయూహెచ్) నిర్వహించనుంది. ఈ నోటిఫికేషన్ ద్వారా 2023 విద్యా సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలు, అఫిలియేటెడ్ ఇంజనీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్ కళాశాలల్లో ఫుల్‌టైం ఎంఈ/ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

» **పరీక్ష వివరాలు:** తెలంగాణ స్టేట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్)–2023
» **కోర్సులు:** ఫుల్‌టైం ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్.
» **అర్హత:** కోర్సును అనుసరించి బీఈ, బీటెక్, బీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.

విభాగాలు

ఏరోస్పేస్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, జియో ఇంజనీరింగ్ అండ్ జియో ఇన్ఫర్మాటిక్స్, ఫుడ్ టెక్నాలజీ, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్, నానో టెక్నాలజీ, ఫార్మసీ.

ముఖ్యసమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తులకు చివరి తేది:** 30.04.2023
» **ఎడిట్ ఆప్షన్:** 2023, మే 2–4 తేదీ వరకు
» **హాల్‌టికెట్ల డౌన్‌లోడ్:** 2023, మే 21 నుంచి
» **పరీక్ష తేదీలు:** 2023 మే 29 నుంచి జూన్ 01 తేదీ వరకు
» **వెబ్‌సైట్:** https://pgecet.tsche.ac.in

టీఎస్ ఎంసెట్ 2023

తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ మెడికల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్–2023(ఎంసెట్) ప్రకటనను రాష్ట్ర ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఈ పరీక్షను జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, హైదరాబాద్ (జేఎన్‌టీయూ ఎహెచ్) నిర్వహించనుంది. అర్హులైన అభ్యర్థులు మార్చి 03 నుంచి ఏప్రిల్ 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మే 7 నుంచి 11 వరకు పరీక్ష జరగనుంది.

పరీక్ష వివరాలు

తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ మెడికల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ –2023(ఎంసెట్).

కోర్సుల వివరాలు

బీఈ, బీటెక్/బీటెక్(బయోటెక్నాలజీ)/ బీటెక్ (డెయిరీ టెక్నాలజీ)/బీటెక్ (అగ్రికల్చర్ ఇంజనీరింగ్)/ బీఫార్మసీ/ బీటెక్(ఫుడ్‌టెక్నాలజీ)/బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్/ బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్/ బీఎస్సీ(ఫారెస్ట్రీ)/ బీవీఎస్సీ అండ్ ఏహెచ్ /బీఎఫ్ఎస్సీ. వీటితోపాటు ఫార్మ్–డి, బీఎస్సీ నర్సింగ్‌కు కూడా ఎంసెట్ ద్వారానే అడ్మిషన్ కల్పిస్తారు.

అర్హత: ఇంటర్మీడియట్(ఎంపీసీ/బైపీసీ)లో ఎస్సీ, ఎస్టీలకు 40శాతం, ఇతరులకు 45 శాతం మార్కులు తప్పనిసరి. బీఎస్సీ నర్సింగ్‌లో చేరాలనుకున్న విద్యార్థులు ఎంసెట్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగం పరీక్ష రాయాల్సి ఉంటుంది.

పరీక్ష కేంద్రాలు

ఎంసెట్ నిర్వహణ తెలంగాణలో 16 పరీక్ష జోన్లు ఏర్పాటు చేశారు. ఏపీలో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు నగరాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు.

ముఖ్యసమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరి తేదీ:** 10.04.2023
» **ఎడిట్ ఆప్షన్:** 2023 ఏప్రిల్ 12 –14 తేదీవరకు
» **రూ.250–5వేల ఫైన్‌తో దరఖాస్తుకు చివరి తేదీ:** 2023 ఏప్రిల్ 15 నుంచి మే 02 తేదీ వరకు
» **హాల్‌టికెట్ల డౌన్‌లోడ్:** 2023 ఏప్రిల్ 30 నుంచి
» **ఎంసెట్ ఇంజనీరింగ్ పరీక్ష:** 2023 మే 7,8,9 తేదీల్లో »**ఎంసెట్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్ష:** 2023 మే 10, 11 తేదీల్లో
» **వెబ్‌సైట్:** https://eamcet.tsche.ac.in



స్కిల్ డెవలప్‌మెంట్

సరికొత్తగా.. అప్రెంటీస్‌షిప్ స్కీమ్!

» ఇండస్ట్రీ 4.0 అంశాల్లోనూ అప్రెంటీస్ అవకాశాలు
» స్కిల్ ఇండియా ప్రోగ్రామ్ పరిధిలోకే ఎన్‌ఏపీఎస్
» అప్రెంటీస్ ట్రైనీల అకౌంట్లలోకే నేరుగా స్టయిఫండ్ బదిలీ
» వచ్చే మూడేళ్లలో 47 లక్షల మందికి శిక్షణ లక్ష్యం
» తాజా బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం వెల్లడి

అప్రెంటీస్‌షిప్..అకడమిక్‌గా నేర్చుకున్న అంశాలపై క్షేత్ర స్థాయిలో శిక్షణ పొందే మార్గం! ఇది స్కిల్ గ్యాప్ సమస్యకు పరిష్కారంతోపాటు భవిష్యత్తులో ఉద్యోగ వేటలో ముందంజలో నిలిచేందుకు దోహదపడుతుంది. ముఖ్యంగా ఐటీఐ, డిప్లొమా, ఇతర టెక్నికల్ కోర్సుల విద్యార్థులకు అప్రెంటీస్‌షిప్ శిక్షణ చాలా అవసరం! అందుకే అప్రెంటీస్‌షిప్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం.. గతంలో నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్(ఎన్‌ఏపీఎస్)ను తెచ్చింది. మారుతున్న టెక్నాలజీ, పరిశ్రమల అవసరాలను పరిగణనలోకి తీసుకుంటూ.. తాజాగా ఈ ఎన్‌ఏపీఎస్‌లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. కేంద్ర బడ్జెట్ 2023-24లో ఈ అంశాన్ని ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో.. అప్రెంటీస్‌షిప్ స్కీమ్‌లో తలపెట్టిన మార్పులు, అప్రెంటీస్ ట్రైనీలకు కలిగే ప్రయోజనాలపై ప్రత్యేక కథనం..

అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్‌లో.. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నిరంతరం మార్పులు జరుగుతుండాలి. అప్పుడే విద్యార్థులు క్షేత్ర నైపుణ్యాల సాధనలో.. ఎంప్లాయబిలిటీ స్కిల్స్‌ను మెరుగుపరచుకోవడంలో ముందంజలో నిలుస్తారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన మార్పులు అప్రెంటీస్ ట్రైనీలకు ఎంతో ఉపకరిస్తాయి అంటున్నారు నిపుణులు.

స్కిల్ ఇండియా పరిధిలోకి

నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్(ఎన్‌ఏపీఎస్)ను స్కిల్ ఇండియా ప్రోగ్రామ్ పరిధిలోకి తీసుకురావాలని తాజాగా నిర్ణయించారు. ఇప్పటి వరకు ప్రత్యేక విభాగంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్కీమ్‌ను.. ఇక నుంచి స్కిల్ ఇండియా ప్రోగ్రామ్‌లలో ఒకటిగా పరిగణిస్తారు. ప్రస్తుతం స్కిల్ ఇండియా పరిధిలో.. ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన, జన్ శిక్షణ్ సంస్థాన్‌లు ఉన్నాయి. తాజా నిర్ణయంతో ఎన్‌ఏపీఎస్ కూడా స్కిల్ ఇండియా ప్రోగ్రామ్ జాబితాలో చేరనుంది. అంతేకాకుండా.. దాదాపు ఏడేళ్ల నుంచి అమలవుతున్న ఎన్‌ఏపీఎస్‌ను ఇకపై ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్‌గా పిలవనున్నారు.

ఇండస్ట్రీ 4.0 స్కిల్స్ కూడా

ఎన్‌ఏపీఎస్ ద్వారా ఇండస్ట్రీ 4.0 స్కిల్స్‌లోనూ అప్రెంటీస్ శిక్షణ లభించేలా చూడాలని కూడా నిర్ణయించారు. ఇండస్ట్రీ 4.0 స్కిల్స్‌గా పేర్కొనే ఐఓటీ, ఆటోమేషన్, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీలకు ఇటీవల కాలంలో ప్రాధాన్యత పెరుగుతోంది. దీంతో ఈ టెక్ స్కిల్స్‌లోనూ అప్రెంటీస్ ట్రైనింగ్ అవకాశాలు కల్పించనున్నారు. ఫలితంగా ఇంతకాలం కోర్ అంశాల్లోనే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు.. ఇకపై లేటెస్ట్ టెక్నాలజీస్‌పైనా శిక్షణ, నైపుణ్యం లభించనున్నాయి.

బ్యాంక్ అకౌంట్లోకి స్టయిఫండ్

ఎన్‌ఏపీఎస్ స్కీమ్ ప్రకారం–ఒక అప్రెంటీస్ ట్రైనీకి ప్రతి నెల ఇచ్చే స్టయిఫండ్‌లో 75 శాతాన్ని సదరు శిక్షణ కల్పిస్తున్న సంస్థ, మరో 25 శాతం లేదా రూ.1500ను ప్రభుత్వం చెల్లిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ స్టయిఫండ్ చెల్లింపును డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో అందిస్తారు. అంటే.. అప్రెంటీస్ ట్రైనీల బ్యాంక్ అకౌంట్లలోకే నేరుగా స్టయిఫండ్ జమ చేస్తారు. ముందుగా సదరు ట్రైనింగ్ అవకాశం కల్పించిన సంస్థ తాను ఇవ్వాల్సిన 75 శాతం మొత్తాన్ని అప్రెంటీస్ ట్రైనీ ఖాతాలో జమ చేసినట్లు ఆధారాలు చూపిన తర్వాతే కేంద్ర ప్రభుత్వ వాటా జమ కానుంది. ఇప్పటికే అప్రెంటీస్ ట్రైనీలుగా పని చేస్తూ స్టయిఫండ్ పొందుతున్న వారు, స్టయిఫండ్ అందిస్తున్న సంస్థలు.. డీబీటీ విధానంలోకి మారడానికి ఈ–కేవైసీ, ఆధార్ ధ్రువీకరణలతో అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది.

పైలట్ ప్రాజెక్ట్‌గా

అప్రెంటీస్ ట్రైనీలకు డీబీటీ విధానంలో స్టయిఫండ్ చెల్లింపుపై ఇప్పటికే పైలట్ ప్రాజెక్ట్‌ను అమలు చేశారు. గతేడాది జూలైలో ఈ పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి..1,544 సంస్థల పరిధిలో పని చేస్తున్న 1,55,000 మంది అప్రెంటీస్ ట్రైనీలకు రూ.22.29 కోట్ల మొత్తాన్ని డీబీటీ విధానంలో చెల్లించారు. డీబీటీ విధానం వల్ల స్టయిఫండ్ చెల్లింపుల్లో పారదర్శకత వస్తుందని భావిస్తున్నారు. అంతేకాకుండా ట్రైనీలకు సంస్థలు ఇచ్చే స్టయిఫండ్ విషయంలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా నియంత్రించొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మూడేళ్లలో 47 లక్షల ట్రైనీలు

ఎన్‌ఏపీఎస్‌లో భాగంగా రానున్న మూడేళ్లలో 47 లక్షల మందికి అప్రెంటీస్ ట్రైనీ అవకాశాలకు కల్పించడం లక్ష్యంగా చేసుకున్నట్లు కేంద్ర బడ్జెట్ సందర్భంగా పేర్కొన్నారు. పదో తరగతి నుంచి ప్రొఫెషనల్ డిగ్రీ వరకు.. ట్రెడిషనల్, టెక్నికల్ కోర్సుల అభ్యర్థులందరికీ వారి అర్హతలకు సరితూగే సంస్థలు లేదా విభాగాల్లో అప్రెంటీస్ శిక్షణ లభించేలా చర్యలు తీసుకుంటారు. ఇప్పటికే ఈ స్కీమ్ ద్వారా 2016–17 ఆర్థిక సంవత్సరం నుంచి 2022–23 ఆర్థిక సంవత్సరం.. డిసెంబర్ 2022 నాటికి 35,229 సంస్థలు నమోదు చేసుకోగా.. 21,71,431 మంది అభ్యర్థులు అప్రెంటీస్ ట్రైనీలుగా నమోదు చేసుకున్నారు. ఈ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే.. అప్రెంటీస్ ట్రైనింగ్‌కు ఆదరణ పెరుగుతుందని చెప్పొచ్చు.

ఎన్‌ఏపీఎస్.. లక్ష్యం

- కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 2016లో.. ఎంఎస్ఎంఈ సెక్టార్‌లో అప్రెంటీస్ అవకాశాలను పెంచే ఉద్దేశంతో సంస్థలను భాగస్వాములను చేస్తూ ఎన్‌ఏపీఎస్‌ను ప్రారంభించారు.
- అప్రెంటీస్ ట్రైనీలను.. ట్రేడ్ అప్రెంటీసెస్, గ్రాడ్యుయేట్ అప్రెంటీసెస్, టెక్నీషియన్ అప్రెంటీసెస్, టెక్నీషియన్(ఒకేషనల్) అప్రెంటీస్, ఇతర ఆప్షనల్ ట్రేడ్ అప్రెంటీసెస్‌గా వర్గీకరించారు.
- ఎన్‌ఏపీఎస్ పరిధిలోని సంస్థలు, అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థలు అప్రెంటీస్ ట్రైనీ అవకాశాలను కల్పించాలి. సంస్థ మొత్తం సిబ్బందిలో 2.5 శాతం నుంచి 10 శాతానికి సమానమైన సంఖ్యలో అభ్యర్థులను అప్రెంటీస్ ట్రైనీలుగా నియమించాలి.
- నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్‌లో సంస్థలు పాల్పంచుకునేలా పలు ఆర్థిక ప్రోత్సాహకాలను ప్రకటించారు.

పరీక్షలు.. సర్టిఫికెట్లు

ఎన్‌ఏపీఎస్ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్ పేరుతో పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే సర్టిఫికెట్ కూడా అందిస్తారు. ఈ పరీక్షకు హాజరు కావాలంటే.. సదరు అభ్యర్థులు అప్రెంటీస్ ట్రైనింగ్ సమయంలో కనీసం 80 శాతం హాజరు కలిగుండాలి. అదే విధంగా.. ఫార్మేటివ్ అసెస్‌మెంట్‌లో ట్రేడ్ ప్రాక్టికల్స్‌లో 60 శాతం, ట్రేడ్ థియరీలో 40 శాతం మార్కులు పొందాలి.

ప్రత్యేక వెబ్‌సైట్

ఎన్‌ఏపీఎస్‌లో భాగంగా సంస్థలు, అప్రెంటీస్ ట్రైనీ అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసుకోవడానికి వీలుగా ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించారు. సంస్థలు తమకు అవసరమైన అర్హతలతో కూడిన ట్రైనీ నియామక వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది. అదే విధంగా అభ్యర్థులు తమ అర్హతలు, తమకు ఆసక్తి ఉన్న విభాగాల వివరాలతో ప్రొఫైల్ క్రియేట్ చేసుకోవాలి. ఇలా అభ్యర్థుల వివరాలను పరిశీలించి సంస్థలు నియామకాలు చేపట్టే అవకాశం ఉంటుంది. శిక్షణ సమయంలో అభ్యర్థుల, సంస్థల పనితీరును పరిశీలించేందుకు రీజనల్ డైరెక్టరేట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్‌కు సంబంధించిన అధికారులు ప్రత్యక్ష తనిఖీలు చేస్తారు.

ఎన్‌ఏటీఎస్‌లోనూ మార్పులు!

- గ్రాడ్యుయేట్, డిప్లొమా విద్యార్థులకు ఉద్దేశించిన నేషనల్ అప్రెంటీస్ ట్రైనింగ్ స్కీమ్‌లోనూ మార్పులు చేసే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి.
- ప్రస్తుతం ఎన్‌ఏటీఎస్ ప్రకారం–ఆర్ట్స్, హ్యూమానిటీస్, కామర్స్, ఇంజనీరింగ్, డిప్లొమా విద్యార్థులను ఎన్‌ఏటీఎస్ పరిధిలోకి తీసుకొచ్చారు.
- డిప్లొమా ఉత్తీర్ణులకు నెలకు రూ.8 వేలు, ఇతర కోర్సుల వారికి నెలకు రూ.9వేల స్టయిఫండ్‌ను అందిస్తున్నారు.
- శాశ్వత ఉద్యోగులు 30 మంది ఉన్న సంస్థలు ఎన్‌ఏటీఎస్ విధానంలో అప్రెంటీస్ ట్రైనీలను నియమించుకోవచ్చు.
- ప్రతి సంస్థ కనిష్టంగా నలుగురిని అప్రెంటీస్ ట్రైనీలుగా నియమించుకోవచ్చు.
- అప్రెంటీస్ ట్రైనీలకు నిర్దేశించిన స్టయిఫండ్ మొత్తంలో 50 శాతాన్ని సంస్థలు చెల్లిస్తే సరిపోతుంది. మిగతా 50 శాతాన్ని కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 2,77, 140 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా.. 1,77, 606 మందికి అప్రెంటీస్ ట్రైనీలుగా నియామకాలు ఖరారు.

ఎన్‌ఏపీఎస్ స్కీమ్.. మార్పులు

- స్టయిఫండ్ చెల్లింపులో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానం అమలు.
- ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీస్‌లోనూ అప్రెంటీస్ ట్రైనింగ్ అవకాశం.
- రానున్న మూడేళ్లలో 47 లక్షల మందికి శిక్షణ లక్ష్యం.
- స్కిల్ ఇండియా స్కీమ్స్‌లో భాగంగా అమలు కానున్న ఎన్‌ఏపీఎస్.
- ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్‌గా పేరు మార్పు.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.apprenticeshipindia.gov.in

క్లుప్తంగా...

16వ శతాబ్దం నాటి వినాయక విగ్రహం గుర్తింపు



మైదుకూరు: వైఎస్సార్ జిల్లా మైదుకూరు మండలం ఉత్సలవరం గ్రామంలో 16వ శతాబ్దం నాటి వినాయక విగ్రహాన్ని గుర్తించినట్టు ఔత్సాహిక పరిశోధకుడు బొమ్మిశెట్టి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి పశువుల దొడ్డిలో ఈ విగ్రహాన్ని కనుగొన్నట్టు పేర్కొన్నారు. విగ్రహం ఎడమ చేతిలో శంఖం, కుడి చేతిలో డమరుకం ఉన్నట్టు తెలిపారు. మైసూరు పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నం రెడ్డికి విగ్రహం గురించి తెలియజేయగా, అది 16వ శతాబ్దం నాటిదని ఆయన చెప్పినట్టు రమేష్ తెలిపారు.

ప్రపంచ రికార్డు కోసం బాలుడి స్కేటింగ్ యాత్ర



కలువాయి(తిరుపతి జిల్లా)/ఏర్పేడు(తిరుపతి జిల్లా): ప్రపంచ రికార్డు కోసం ఎనిమిదేళ్ల బాలుడు స్కేటింగ్ యాత్ర చేస్తున్నాడు. ఏర్పేడుకు చెందిన వేదనరసింహ సోమవారం ఉదయం ఏర్పేడు నుంచి రోలర్ స్కేటింగ్ యాత్ర ప్రారంభించాడు. వెంకటగిరి, రాపూరు, పెంచలకోన, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, నెల్లూరు, గూడూరు మీదుగా మొత్తం 270 కిలోమీటర్ల మేర యాత్ర సాగనుంది. సోమవారం మధ్యాహ్నానికి కలువాయి మండలం ఉయ్యాలపల్లికి చేరుకుంది. ఉయ్యాలపల్లి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు వేదనరసింహకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాలుడి కోచ్ ప్రతాప్ వివరాలు వెల్లడిస్తూ.. ఇప్పటి వరకు కర్ణాటకకు చెందిన వెన్నికసిరి అనే ఎనిమిదేళ్ల బాలిక 2022 ఫిబ్రవరిలో 250 కి.మీ. నాన్‌స్టాప్ సోలో స్కేటింగ్ చేసి వరల్డ్ రికార్డు సాధించిందని, ఆ రికార్డును అధిగమించేందుకు వేదనరసింహ 270 కి.మీ స్కేటింగ్ యాత్ర చేస్తున్నట్టు చెప్పారు.

9 నుంచి నిరసనలు, ధర్నాలు

- ఏప్రిల్ 3న కలెక్టరేట్‌ల వద్ద ఛలో స్పందన
- ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు



సాక్షి, విశాఖపట్నం: ఉద్యోగ వర్గాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ఏపీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 9వ తేదీ నుంచి నిరసనలు, ధర్నాలు చేపట్టనున్నామని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు వెల్లడించారు. విశాఖలోని రెవెన్యూ అసోసియేషన్ భవన్‌లో ఉద్యోగులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల్ని పట్టించుకోలేదన్నారు. అందుకే 9 నుంచి 20వ తేదీ వరకు నల్లబ్యాడ్జీలు ధరించడం, కలెక్టరేట్, డీఆర్‌డీవో కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో నిరసన సమావేశాలు, 15, 17, 20వ తేదీల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, 21న సెల్ డౌన్, 24న కమిషనర్ కార్యాలయాల వద్ద ధర్నాలు.. తదితర నిరసన ప్రదర్శనలు చేపడతామన్నారు. ఏప్రిల్ 3న ఛలో స్పందన కార్యక్రమాన్ని అన్ని కలెక్టరేట్ కార్యాలయాల వద్ద నిర్వహించి.. వినతి పత్రాలు అందిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే.. వచ్చే నెల 5న రాష్ట్ర కార్యవర్గం మరోసారి సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని బొప్పరాజు తెలిపారు. ఆర్టీసీ జేఏసీ ప్రతినిధి వాలిశెట్టి దామోదర్, పలువురు జేఏసీ నేతలు పాల్గొన్నారు.

ఆ నేతలపై క్రమశిక్షణ చర్యలు తప్పవు

- బీజేపీ రాష్ట్ర శాఖ క్రమశిక్షణ కమిటీ చైర్మన్

సాక్షి, అమరావతి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుకు వ్యతిరేకంగా ఇటీవల కొందరు బీజేపీ నేతలు ఢిల్లీ వెళ్లి.. అక్కడ మీడియా ముందు బహిరంగంగా విమర్శలు చేయడం పార్టీ క్రమశిక్షణ నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందని.. ఆ నేతలపై చర్యలు తప్పవని పార్టీ రాష్ట్ర శాఖ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాకా వెంకటసత్యనారాయణ చెప్పారు. పార్టీ అధిష్టానం సూచనల మేరకు వారిపై చర్యలుంటాయన్నారు. విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీలో ఏ సమస్య ఉన్నా అంతర్గతంగా మాట్లాడాలి గానీ.. బహిరంగంగా వ్యాఖ్యలు చేసి రోడ్డెక్కడం పార్టీకి నష్టం చేసే చర్యగా పేర్కొన్నారు.

నికర జలాల్లో మిగులు తేల్చాకే కావేరికి గోదావరి

నదుల అనుసంధానం టాస్క్‌ఫోర్స్ చైర్మన్‌కు తేల్చి చెప్పిన రాష్ట్రం

ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదన:

ఇచ్చంపల్లి నుంచి 141.3 టీఎంసీల గోదావరి జలాలను నాగార్జున సాగర్‌లోకి ఎత్తిపోసి.. సాగర్ కుడి కాలువకు సమాంతరంగా తవ్వే కాలువ ద్వారా వాటిని సోమశిల, కండలేరుకు తరలించి.. అక్కడి నుంచి కావేరి గ్రాండ్ ఆనకట్టకు తీసుకెళ్లాలి. ఆవిరి ప్రవాహ నష్టాలుపోను ఆంధ్రప్రదేశ్‌కు 41.8, తెలంగాణకు 42.6, తమిళనాడుకు 38.6, పుదుచ్చేరికి 2.2, కర్ణాటకకు 9.8 టీఎంసీలను అందించాలి.

దీని ప్రకారం పనులు చేపట్టాలంటే తెలంగాణలో ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నల్గొండ, ఏపీలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో సారవంతమైన భూములను సేకరించాలి. ఇది ఖర్చుతోనూ కూడుకున్నది. సారవంతమైన భూములను సేకరించడం అతి పెద్ద సవాల్.

సీఎం జగన్ చేసిన ప్రతిపాదన:

పోలవరం ప్రాజెక్టు జల విస్తరణ ప్రాంతం నుంచి గోదావరి జలాలను నాగార్జునసాగర్‌లోకి ఎత్తిపోసి.. అక్కడి నుంచి కృష్ణా నది మీదుగా రివర్స్ పంపింగ్ చేస్తూ శ్రీశైలం జలాశయంలోకి తరలించి.., పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ మీదుగా తెలుగు గంగ ప్రధాన కాలువ ద్వారా సోమశిల, కండలేరు జలాశయాలకు తరలించి.. అక్కడి కావేరి గ్రాండ్ ఆనకట్టకు తరలించాలి.

దీని ప్రకారం పనులు చేపట్టడానికి తెలంగాణలో అతి తక్కువ భూమిని సేకరిస్తే సరిపోతుంది. ఏపీలో భూమిని సేకరించాల్సిన అవసరం ఉండదు. తక్కువ ఖర్చుతో గోదావరి–కావేరి అనుసంధానం చేయడమే కాదు దుర్భిక్ష ప్రాంతాలను సుభిక్షం చేయవచ్చు.



హైదరాబాద్‌లోని జలసౌధలో నదుల అనుసంధానంపై జరిగిన సమావేశంలో పాల్గొన్న ఉన్నతాధికారులు

సాక్షి, అమరావతి: గోదావరి నదిలో నీటి లభ్యతపై శాస్త్రీయంగా అధ్యయనం చేసి.. 75 శాతం లభ్యత (నికర జలాలు) ఆధారంగా మిగులు జలాలు ఉన్నాయని తేల్చాకే కావేరికి గోదావరి జలాలను తరలించాలని టాస్క్‌ఫోర్స్ చైర్మన్ వెదిరె శ్రీరామ్‌కు రాష్ట్ర ప్రభుత్వం తెగేసి చెప్పింది. నదుల అనుసంధానంపై కేంద్ర జల్ శక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ అధ్యక్షతన సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన టాస్క్‌ఫోర్స్ 17వ సమావేశంలో జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి వర్చువల్‌గా పాల్గొన్నారు. కేసీ కెనాల్ ద్వారా తుంగభద్ర–పెన్నా, తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా కృష్ణా – పెన్నాలను అనుసంధానం చేసి దేశంలో నదుల అనుసంధానికి ఏపీ మార్గదర్శకంగా నిలిచిందని శశిభూషణ్‌కుమార్ గుర్తు చేశారు. గోదావరి – కావేరి నదుల అనుసంధానంలో దిగువ రాష్ట్రమైన తమ హక్కులకు విఘాతం కలగకుండా చూడాలని సూచించారు. కేంద్రం నిధులు ఇచ్చి సహకరిస్తే పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసి కుడి కాలువ ద్వారా దేశంలో అతి పెద్ద నదులైన గోదావరి, కృష్ణాను అనుసంధానం చేసి, 80 టీఎంసీలను తరలిస్తామని చెప్పారు. దీనిపై టాస్క్‌ఫోర్స్ చైర్మన్ వెదిరె శ్రీరాం సానుకూలంగా స్పందించారు. సత్వరమే పోలవరాన్ని పూర్తి చేయడానికి సరిపడా నిధులు విడుదల చేయాలని కేంద్రానికి సూచిస్తానని హామీ ఇచ్చారు.

ఛత్తీస్‌గఢ్ అనుమతి తీసుకున్నాకే

ఇచ్చంపల్లి వద్ద గోదావరిలో నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ప్రతినిధులు పునరుద్ఘాటించారు. ఈ నేపథ్యంలోనే ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141.3 టీఎంసీలను గోదావరి–కావేరి అనుసంధానంలో భాగంగా తరలిస్తామని వెదిరె శ్రీరామ్ చెప్పారు. ఈ సమావేశానికి ఛత్తీస్‌గఢ్ ప్రతినిధులను ఆహ్వానించకుండా ఆ రాష్ట్ర కోటా నీటిని వాడుకుంటామని ప్రతిపాదించడంపై ఏపీ, తెలంగాణ అధికారులు అభ్యంతరం తెలిపారు. ఛత్తీస్‌గఢ్ అనుమతి తీసుకున్నాకే అనుసంధానం చేపట్టాలని స్పష్టంచేశారు. కోటా నీటిని ఛత్తీస్‌గఢ్ వాడుకునే సమయానికి గోదావరికి మహానది జలాలను తరలిస్తామని, వాటిని కావేరికి తీసుకెళ్తామని వెదిరె శ్రీరామ్ చెప్పారు. ఈ అంశంపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి షెకావత్ చర్చలు జరుపుతారని తెలిపారు.

పోలవరం నుంచి గోదావరి తరలింపు

దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో పోలవరం ప్రాజెక్టు జలవిస్తరణ ప్రాంతం నుంచి గోదావరి జలాలను కావేరికి తరలించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన ప్రతిపాదనను వెదిరె శ్రీరామ్ దృష్టికి ఏపీ అధికారులు తీసుకెళ్లారు. సీఎం వైఎస్ జగన్ ప్రతిపాదన మేరకు అనుసంధానం చేపడితే.. భూసేకరణ సమస్య లేకుండా, అతి తక్కువ వ్యయంతో కావేరికి గోదావరి జలాలను తరలించవచ్చని వివరించారు. దీనివల్ల ఐదు రాష్ట్రాలకు గరిష్ట ప్రయోజనం చేకూర్చవచ్చని చెప్పారు. సమ్మక్క (తుపాకులగూడెం) బ్యారేజ్ నుంచి గోదావరి జలాలను కావేరికి తరలించాలని తెలంగాణ అధికారులు సూచించారు. ఈ రెండు ప్రతిపాదనలను పరిశీలిస్తామని వెదిరె శ్రీరామ్ చెప్పారు. అన్ని రాష్ట్రాల ఏకాభిప్రాయంతోనే గోదావరి–కావేరి అనుసంధానం చేపడతామని వెదిరె శ్రీరాం చెప్పారు.

విద్యుత్ కొనుగోలు ఖర్చు తడిసి మోపెడు

- 2021–22లో 11,773 మి.యూ. కొన్న డిస్కంలు
- బహిరంగ మార్కెట్‌లో యూనిట్ సగటు ధర రూ.5.31
- ఏడాదిలో అదనపు కొనుగోళ్ల మొత్తం ఖర్చు రూ.6,255.97 కోట్లు
- ఇందులో రూ.3,538 కోట్ల సర్దుబాటుకే ఏపీఈఆర్‌సీ ఆమోదం
- సరఫరాకి మించి ఇచ్చిన సబ్సిడీ తిరిగిచ్చేయాలని డిస్కంలకు ఆదేశం



సాక్షి, అమరావతి: వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయడానికి విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) ఖర్చు విషయంలో ఏమాత్రం వెనుకడుగు వేయడం లేదు. అవసరాల మేరకు.. ముందుగా తీసుకున్న అనుమతికి మించి బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విద్యుత్ కొనాల్సి వస్తున్నా వెనక్కు తగ్గడం లేదు. తద్వారా ప్రజలకు, వ్యవసాయ అవసరాలకు విద్యుత్ కొరత రాకుండా చేయాలనే లక్ష్యానికి ఏమాత్రం విఘాతం కలగనీయడం లేదు. అయితే ఇందుకోసం చేస్తున్న విద్యుత్ కొనుగోళ్ల ఖర్చు మాత్రం తడిసిమోపెడవుతోంది. అందులో నుంచి ఆదాయాన్ని తీసేసినా ఇంకా నష్టమే కనిపిస్తోంది. దానిలో కొంతైనా పూడ్చుకోవడానికి విద్యుత్ కొనుగోళ్ల సర్దుబాటు చార్జీలకు అనుమతించాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ)ని ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలు కోరాయి. ఈ మేరకు 2021–22 ఆర్థిక సంవత్సరానికి ఫ్యూయల్, పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పీపీసీఏ)ను ఏపీఈఆర్‌సీకి సమర్పించాయి. డిస్కంల ప్రతిపాదనలపై జనవరిలో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిన ఏపీఈఆర్‌సీ రూ.3,538 కోట్లను సర్దుబాటు చేసుకునేందుకు తాజాగా ఆమోదం తెలిపింది. ఈ విద్యుత్ కొనుగోళ్ల సర్దుబాటును 2023–24 ఏప్రిల్ నుంచి విద్యుత్ బిల్లుల్లో డిస్కంలు కలపనున్నాయి.

బిల్లుల్లో పడేది కేవలం యూనిట్‌కు 20 పైసల నుంచి 67 పైసలే..

2021–22లో రాష్ట్రంలో 1.92 కోట్ల వినియోగదారులకు విద్యుత్‌ను అందించడం కోసం 67,756.10 మిలియన్ యూనిట్లు అవసరమని భావించిన ఏపీఈఆర్‌సీ ఆ మేరకు సమకూర్చుకోవడానికి డిస్కంలకు అనుమతినిచ్చింది. అయితే డిస్కంలు దానికంటే తక్కువగా 66,738.70 మిలియన్ యూనిట్లనే కొనుగోలు చేశాయి. అంటే 1,017.40 మిలియన్ యూనిట్లను ఆదా చేసి ఖర్చును మిగిల్చాయి. అయితే ఏపీఈఆర్‌సీ అనుమతించిన దాని ప్రకారం .. బహిరంగ మార్కెట్ నుంచి స్వల్పకాలిక కొనుగోళ్ల ద్వారా 1,316.80 మిలియన్ యూనిట్లు కొనాలి. కానీ అప్పటి పరిస్థితులు అందుకు తగ్గట్టుగా లేవు. తీవ్ర బొగ్గు సంక్షోభం కారణంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు అనుకున్నంత మేర విద్యుత్‌ను అందించలేకపోయాయి. దీంతో విద్యుత్ కొరతను అధిగమించడానికి అప్పటికప్పుడు నిర్ణయం తీసుకుని బయటి నుంచి విద్యుత్‌ను కొనాల్సి వచ్చింది. అలా 11,773 మిలియన్ యూనిట్లను సగటున యూనిట్ రూ.5.31 చొప్పున డిస్కంలు కొనుగోలు చేశాయి. అంటే అనుకున్న దానికంటే 10,456.20 మిలియన్ యూనిట్లు అదనంగా కొన్నాయి. ఈ మొత్తం విద్యుత్ కోసం రూ.6,255.97 కోట్లు అదనంగా ఖర్చు చేశాయి. దీంతో విద్యుత్ కొనుగోళ్లు, విక్రయాల ఆదాయంలో రూ.3,082 కోట్లు తేడా వచ్చింది. పంపిణీ, ప్రసార నష్టాలు మరో రూ.456 కోట్లు వచ్చాయి. మొత్తం కలిపి రూ.3,538 కోట్లను ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి నెలకు యూనిట్‌కు సగటున రూ.0.29 పైసల చొప్పున వసూలు చేసుకునేందుకు డిస్కంలకు ఏపీఈఆర్‌సీ అనుమతినిచ్చింది. ఈ సర్దుబాటు డిస్కంలను బట్టి యూనిట్‌కు దాదాపు రూ.0.20 పైసలతో ప్రారంభమై రూ.0.67 పైసల వరకూ 12 నెలల పాటు బిల్లుల్లో పడనుంది. మరోవైపు వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న సంగతి తెలిసిందే. డిస్కంలు సరఫరా చేసిన విద్యుత్‌కు అయ్యే ఖర్చును ప్రభుత్వం సబ్సిడీగా భరిస్తోంది. 2021–22లో వ్యవసాయానికి మూడు డిస్కంలలో కలిపి 10,887.32 మిలియన్ యూనిట్లు సరఫరా చేశారు. కానీ ఏపీఈఆర్‌సీ ఆదేశాల ప్రకారం.. 12,721.67 మి.యూ.అందించాలి. అంత ఇవ్వాల్సిన అవసరం రానందున ప్రభుత్వానికి రూ.375.98 కోట్లు తిరిగి ఇచ్చేయాలని డిస్కంలకు ఏపీఈఆర్‌సీ చెప్పింది.

పెట్టుబడుల కోసం సీఎం జగన్‌ది మంచి ప్రయత్నం

మీడియాతో బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు


సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు చెప్పారు. విశాఖపట్నంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్) నిర్వహించడం ద్వారా పెట్టుబడులను ఆకట్టుకోవడానికి కృషి చేశారన్నారు. సోమవారం ఆయన విశాఖలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సమ్మిట్‌లో కుదుర్చుకున్న ఒప్పందాలు (ఎంవోయూలు) వాస్తవ రూపం దాలిస్తే ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. తద్వారా రాష్ట్రంలో భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులు వస్తాయని అభిప్రాయపడ్డారు.

జీఐఎస్ నిర్వహణ భేష్: విష్ణుకుమార్‌రాజు

విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను గొప్పగా నిర్వహించారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు విలేకరుల సమావేశంలో కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తొలిసారిగా నిర్వహించిన ఈ సదస్సులో రూ.13 లక్షల కోట్లకు పైగా విలువైన ఎంవోయూలు కుదుర్చుకోవడం, అంబానీ, కరణ్ అదానీ, జిందాల్ వంటి అతిరథులు పాల్గొనడం గొప్ప విషయమని చెప్పారు. రాష్ట్రానికి ఇంతమంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు వచ్చారంటే మారుతున్న పరిస్థితులకు అద్దం పడుతుందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చే వేళ రాజకీయ విమర్శలు సరికాదని చెప్పారు. విశాఖలో రోడ్ల అభివృద్ధి, నగర సుందరీకరణ అభినందనీయమన్నారు.

‘బ్రహ్మ కన్ను’ శాపం!

ఇది కోహినూర్‌ను మించిన కథ



కోహినూర్.. ప్రపంచంలోనే ఫేమస్ వజ్రం. బ్రిటన్ రాణి కిరీటంలో ఉన్న ఈ వజ్రం మనకు తిరిగిచ్చేయాలన్న డిమాండ్లు ఎప్పటికప్పుడు వస్తునే ఉంటాయి. ఆ మధ్య రాణి చనిపోయినప్పుడు కూడా ఇవి వెల్లువెత్తాయి. ఇదే తరహాలో మన దేశం నుంచి తరలిపోయిన మరో పెద్ద వజ్రం ‘బ్రహ్మ కన్ను (ఐ ఆఫ్ బ్రహ్మ)’ గురించి మీకు తెలుసా? అది ఇచ్చిన ‘శాపం’ గురించి మీరెప్పుడైనా విన్నారా? లేదా.. అయితే.. ఈ వివరాలు మీ కోసమే..

మీకు తెలుసా?

అది అరుదైన నలుపు రంగు వజ్రం. ‘ది బ్లాక్ ఓర్లోవ్ డైమండ్’గా పిలుస్తున్న దీని బరువు 67.69 క్యారెట్లు. ప్రపంచంలోని నలుపు రంగులోని అతిపెద్ద వజ్రాల్లో దీనిది ఏడో స్థానం. పాండిచ్చేరి (ప్రస్తుతం పుదుచ్చేరి)లోని ఉన్న ఓ ఆలయంలో ఉన్న బ్రహ్మ దేవుడి విగ్రహం నుదుటిపై ఈ వజ్రం ఉండేదట. అందుకే దీనిని ‘బ్రహ్మ కన్ను’గా పిలిచేవారు. ఆ ప్రాంతం మీదుగా ప్రయాణిస్తున్న ఓ సన్యాసి బ్రహ్మ దేవుడి విగ్రహం నుంచి ఈ వజ్రాన్ని పెకలించి, దొంగిలించుకెళ్లాడు. దీనితో ఈ వజ్రం ఎవరివద్ద ఉంటే వారికి కీడు జరిగేలా బ్రహ్మ దేవుడు శపించాడన్నది అప్పటి కథనం. ఈ క్రమంలోనే వజ్రాన్ని దొంగిలించిన సన్యాసి కొంతకాలానికే హత్యకు గురయ్యాడని.. క్రమంగా ఇది రష్యాకు చేరిందని చెబుతారు.



పుదుచ్చేరిలోని ఆలయం నుంచి..

ముగ్గురి ఆత్మహత్యలతో..



భారతదేశం నుంచి రష్యాకు చేరిన ‘బ్రహ్మ కన్ను’ వజ్రం చేతులు మారుతూ యూరప్‌కు చేరుకుంది. 1932లో యూరోపియన్ వజ్రాల డీలర్ జేడబ్ల్యూ పారిస్ ఈ వజ్రాన్ని కొని అమెరికాకు తీసుకెళ్లాడు. కొద్దిరోజులకే ఓ పెద్ద భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దాదాపు పదిహేనేళ్ల తర్వాత రష్యా నుంచి ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌కు వచ్చి తలదాచుకుంటున్న రష్యా రాజకుమార్తెలు లియోనిలా బరియటిన్‌స్కీ, నదియా వ్యేగిన్ ఓర్లోవ్‌ల చేతికి ఈ వజ్రం చేరింది. ఈ ఇద్దరూ కూడా ఆత్మహత్య చేసుకున్నారు. వజ్రాన్ని చివరిగా ధరించిన రాజకుమార్తె పేరిటే దీనికి ‘బ్లాక్ ఓర్లోవ్’ అని పేరువచ్చింది. అది శాపగ్రస్తమైనదిగా ప్రచారమైంది.

1950వ దశకంలో చార్లెస్ విల్సన్ అనే వ్యక్తి ఈ వజ్రాన్ని కొనుగోలు చేశాడు. అసలైన ‘బ్రహ్మ కన్ను’ వజ్రం బరువు ఏకంగా 195 క్యారెట్లు. అయితే దీనికి ఉన్న శాపం

శాపం పోతుందని ముక్కలు చేసి

పోతుందన్న ఉద్దేశంతో.. మూడు ముక్కలు చేయించాడు. అందులో పెద్ద ముక్క ఇప్పుడు ‘బ్లాక్ ఓర్లోవ్’ (67.69 క్యారెట్లు)గా చలామణీ అవుతోంది. మిగతా రెండు ముక్కలు ఏమయ్యాయో ఎవరికీ తెలియదు.

భయంతో ‘రేటు’ మారుతూ..

‘బ్లాక్ ఓర్లోవ్’ వజ్రం శాపగ్రస్తమైనదన్న ప్రచారంతో దాని విలువ పెరుగుతూ తగ్గుతూ వచ్చింది. విల్సన్ 1969లో ‘బ్లాక్ ఓర్లోవ్’ వజ్రాన్ని గుర్తు తెలియని వ్యక్తికి రూ.2.45 కోట్లకు అమ్మాడు. తర్వాత చాలాకాలం ఎవరి కంటా పడ లేదు. 1990లో ఈ వజ్రం సదబీజ్ సంస్థలో వేలానికి వచ్చినప్పుడు రూ.80 లక్షలే పలికింది. కానీ 1995లో జరిగిన వేలంలో ఏకంగా రూ.12.25 కోట్లకు అమ్ముడైంది. ఆ వ్యక్తి నుంచి 2004లో అమెరికన్ ధనవంతుడు డెన్నిస్ పెటిమెజాస్ ఈ వజ్రాన్ని కొన్నా ధర ఎంతో బయటికి రాలేదు. 2006లో ఆయన దీనిని రూ.2.9 కోట్లకు అమ్మేశాడు. ఇటీవలే ఈ వజ్రాన్ని న్యూయార్క్, లండన్‌లలో జరిగిన నేచురల్ హిస్టరీ ఎగ్జిబిషన్లలో ప్రదర్శించారు. అయితే, భారత్‌లో ఇప్పటి వరకూ నల్ల వజ్రాలు దొరకనందున.. ‘బ్లాక్ ఓర్లోవ్’వజ్రం ఇక్కడిది కాదనే వాదనా ఉంది. వజ్రాల వ్యాపారంలో ఉన్న వారు మాత్రం ఇది భారత్ నుంచే వచ్చిందని చెబుతున్నారు. ఆ శాపమూ వాస్తవమే అని అంటున్నారు.

నిజానిజాలు ఆ బ్రహ్మదేవుడికే ఎరుక!

– సాక్షి సెంట్రల్ డెస్క్

ఏపీ జేఏసీ నిరసనలకు వీఆర్‌వోలు దూరం

- ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ప్రకటన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 9 నుంచి ఏపీ జేఏసీ అమరావతి నిర్వహించే ఆందోళనలు, నిరసనలకు వీఆర్‌వోలు దూరంగా ఉంటారని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు ప్రకటించారు. ఈ మేరకు సంఘం సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ సంఘాల నాయకులపై ప్రతి ఉద్యోగి చాలా అసంతృప్తిగా ఉన్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఏపీ జేఏసీ అమరావతి నిరసనలు, ఆందోళనలు నిర్వహించడం వల్ల ఉద్యోగులకు న్యాయం జరగదన్నారు. కొన్ని ఉద్యోగ సంఘాలు సొంత ప్రయోజనాల కోసం మళ్లీ ఉద్యోగులను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. దీన్ని ఉద్యోగులు ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఉద్యోగ సంఘాల నాయకులపై ఆరోపణలను తొలగించుకోవడం.. ఉద్యమం పేరుతో మీడియాలో హడావుడి చేయడం, లోపాయకారిగా ప్రభుత్వ పెద్దలతో ఒప్పందాలు చేసుకోవడం వీరి నైజమన్నారు. చిత్తశుద్ధితో కార్యాచరణ ప్రకటించే వారికి తమ సంఘం మద్దతు ఉంటుందని తెలిపారు. అప్పటివరకు ఏపీ జేఏసీ అమరావతి చేపట్టే నిరసనల్లో గ్రామ రెవెన్యూ అధికారులు ఎవరూ పాల్గొనరని వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు జోనల్ ఇన్‌చార్జిల నియామకం

సాక్షి,, అమరావతి: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు జోనల్ ఇన్‌చార్జిలను నియమించారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్టు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలోని 26 జిల్లాలను 8 జోన్లుగా చేసి ఆయా అనుబంధ విభాగాల ఇన్‌చార్జిలను నియమించారు. వైఎస్సార్‌సీపీ యువత, రైతు, విద్యార్థి, మహిళా, బీసీ సెల్, ఎస్టీ సెల్, మైనారిటీ సెల్, వైఎస్సార్‌టీయూసీ, పంచాయతీరాజ్, దివ్యాంగుల, వైఎస్సార్ సేవాదళ్, డాక్టర్స్, వాణిజ్య, సాంస్కృతిక, పబ్లిసిటీ, గ్రీవెన్స్‌సెల్, చేనేత విభాగాలకు జోనల్ ఇన్‌చార్జిలను నియమించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.